veluturu telugu daily

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి నల్గొండ | శనివారం 24.10.2026

సంపుటి : 9 | సంచిక : 131

www. veluturu.com



పానగల్ ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి

## రూ.20 కోట్లు మంజూరు

- ముఖ్యమంత్రి,మంత్రి జూపల్లికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- ఆలయ యునెస్కో గుర్తింపు దిశగా కృషి చేస్తా..

12

# విభజన శక్తులపై ఐక్యంగా పోరాడాలి

**వికసిత్ భారత్ 2047 దిశగా అడుగులు వేయాలి**

**ప్రజలంతా ఏకం కావాలని ప్రధాని నరేంద్రమోదీ పిలుపు**



**న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 23:**

విభజన శక్తులకు వ్యతిరేకంగా సమాజాన్ని ఏకం చేయాలని, ఆత్మనిర్భరత వైపు పౌరులను ప్రేరేపించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం పిలుపునిచ్చారు. ప్రస్తుత సమాజంలో తలెత్తుతున్న రుగ్మతలు, కొత్త సవాళ్లను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఢిల్లీలోని భారత మండపంలో అక్టోబర్ 23 నుంచి 25వరకు జరగనున్న చిన్మయ అమృత్ మహోత్సవ్ గ్లోబల్ సమ్మేళనాన్ని ప్రారంభిస్తూ ఈ మేరకు వ్యాఖ్యానించారు. చిన్మయ మిషన్ కేవలం ఒక సంస్థ మాత్రమే కాదని, అదొక ఆలోచనా విధానమని కొనియాడారు. భారత్ సంస్కృతికి జన్మస్థలమని, దేశ ఉనికికి పునాదని మోదీ అన్నారు.

వ్యక్తిగత పురోగతి అనేది జాతీయ అభివృద్ధికి ఒక సాధనంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ సందర్భంగా స్వామి చిన్మయానంద బోధనలను, ఆధ్యాత్మిక వృద్ధిని దేశాభివృద్ధికి అనుసంధానించేందుకు ఆయన చేసిన కృషిని గుర్తు చేశారు. 'వయం రాష్ట్ర జాగృయామ్ పురోహితాః' అనే వేద మంత్రాన్ని చెబుతూ, దేశాన్ని చైతన్యవంతంగా, అభివృద్ధి చెందినదిగా మార్చేందుకు ప్రజలందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

భారతీయుల్లో తమ దేశం పట్ల ఆత్మగౌరవాన్ని పెంపొందించడమే స్వామి చిన్మయానంద లక్ష్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. "ఈ దేశమే మన ఉనికికి పునాది. మన ఆధ్యాత్మిక పురోగతిని వ్యక్తిగత వికాసంతో అనుసంధానించాలని, దానిని దేశాభివృద్ధికి ఒక సాధనంగా మార్చుకోవాలని స్వామీజీ మనకు బోధించారు. భారతీయుల్లో దేశం పట్ల ఆత్మగౌరవాన్ని నింపడమే ఆయన లక్ష్యం. ఇదే ఉద్దేశంతో ఆయన 'గీతా జ్ఞాన యజ్ఞాన్ని' ప్రారంభించి, ఉపనిషత్తులు, వేదాంతం మన ఇతర శాస్త్రాల జ్ఞానాన్ని సామాన్య ప్రజల వరకు చేరవేశారు. ఆయన తీసుకున్న ఆ సంకల్పం ఫలితాలను ఇప్పుడు మనం చూడవచ్చు" అని ప్రధానమంత్రి మోదీ అన్నారు.

## క్లోరోఫామ్ లీకేజీతో ఇద్దరు కార్మికుల మృతి

- సరాకా ల్యాబొరేటరీస్ మూసివేతకు ఆదేశాలు
- యాజమాన్య నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యుల ఆరోపణలు




12





# తుమ్మిడిహెట్టి బ్యారేజ్‌పై మహారాష్ట్రతో చర్చలు

**152 మీటర్ల ఎత్తున బ్యారేజ్ నిర్మాణానికి ఒప్పించేలా త్వరలోనే వాదనలు**

**తుమ్మిడిహెట్టి బ్యారేజ్ నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో త్వరలో జరిగే చర్చలకు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నెల 23 తర్వాత చర్చలకు ఆహ్వానిస్తానని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఇటీవలే సూచనప్రాయంగా తెలియజేశారని సీఎం వెల్లడించారు. శుక్రవారం బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఎంతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.**

- ఈ నెల 23 తర్వాత చర్చలకు సానుకూలత తెలిపిన మహారాష్ట్ర సీఎం
- ఏదుల నుంచే డిండి, అచ్చంపేట ఎత్తిపోతలకు నీళ్లు
- పాలమూరు నీటికి గండి పడకుండా అదనపు నీటి తరలింపు
- శ్రీశైలం నుంచి ఏదుల వరకు అదనంగా 0.6 టీఎంసీల లిఫ్టింగ్
- నీటిపారుదల ప్రాజెక్టుల సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 23 :**

తుమ్మిడిహెట్టి బ్యారేజ్‌తో పాటు డిండి, అచ్చంపేట ఎత్తిపోతల ప్రాజెక్టులపై పీటముడిగా ఉన్న అంశాలన్నింటినీ ఈ సమావేశంలో చర్చించారు. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తున బ్యారేజ్ నిర్మిస్తే ఎంత నీటిని తెచ్చుకునే వీలుంది.. 150 మీటర్ల ఎత్తున ఎంత నీటిని ఎల్లంపల్లి వరకు తెచ్చుకునే వీలుందనే వివరాలను ఇరిగేషన్ ఇంజనీర్లు సీఎంకు వివరించారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంతో మహారాష్ట్ర పరిధిలో ఎక్కడ కూడా గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం లేదని వివరించారు. 152 మీటర్ల ఎత్తున నిర్మిస్తే దాదాపు 2300 ఎకరాల భూములు ముంపునకు గురవుతాయని, 150మీటర్ల ఎత్తున నిర్మిస్తే వెయ్యి ఎకరాలలోపే ముంపు ప్రభావం ఉంటుందని

- మిగతా 2 లో..



# కరువుపై సమరశంఖం!

**ఈ నెల 31లోగా కరువు మండలాల ప్రకటనకు కసరత్తు**

**ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే కరువును ముందుగానే అంచనా వేసి తాగునీరు, సాగునీటి లభ్యతను కాపాడటంతో పాటు విద్యుత్ సరఫరా, వ్యవసాయం, గ్రామీణ ఉపాధి వంటి కీలక రంగాలకు రానున్న రోజుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శాఖల వారీగా సమగ్రంగా కార్యచరణ ప్రణాళికలు రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ తీర్మానించింది. నియమిత గడువు అక్టోబర్ 31 తేదీ లోగా రాష్ట్రంలోని కరువు మండలాలను ప్రకటించడంతో పాటు, ఎల్ నినో, కరువు పరిస్థితులను చర్చించడానికి అఖిల పక్ష సమావేశం త్వరలో ఏర్పాటు చేయాలని కమిటీ తీర్మానించింది.**

- 358 మండలాల్లో కరువు పరిస్థితులు..
- 324 మండలాల్లో పడిపోయిన భూగర్భ జలాలు
- రైతులకు ప్రత్యామ్నాయ పంటలు..
- తాగు, సాగునీటికి ప్రత్యేక కార్యాచరణ
- అఖిలపక్ష భేటీకి నిర్ణయం..
- అన్ని శాఖలూ అప్రమత్తంగా ఉండాలని భట్టి ఆదేశం

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 23:**

రాష్ట్రంలో నెలకొన్న కరువు, ఎల్-నినో పరిస్థితులను అధిగమించేందుకు, తగిన చర్యలను సమీక్షించి ప్రభుత్వానికి సిఫార్సులు చేసేందుకు సచివాలయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, సబ్-కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ తొలి సమావేశం శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఎల్ నినో, కరువు ప్రభావం, నీటి లభ్యత, రైతులకు అందించాల్సిన ఉపశమనం, భవిష్యత్తు కార్యాచరణపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ సమావేశానికి సబ్-కమిటీ సభ్యులు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి, సిఎస్ సంజయ్ జాజుతో పాటు సంబంధిత శాఖల కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, కరవు ప్రభావిత మండలాలను శాస్త్రీయంగా గుర్తించి, నిబంధనల ప్రకారం అర్హత కలిగిన మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. కరువు ప్రభావాన్ని తగ్గించి, ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు సమయానికి అందించడమే లక్ష్యంగా సమన్వయంతో

- మిగతా 2 లో..

## తెలంగాణ ప్రగతికి టీజీఎస్‌పీఎఫ్ రక్షణ కవచం

- 67ప్రభుత్వ కీలక సంస్థలకు టీజీఎస్‌పీఎఫ్ భద్రత..
- టీజీఎస్‌పీఎఫ్ సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- అమీన్ పూర్‌లో ఘనంగా తెలంగాణ ప్రత్యేక రక్షణ దళం 36వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

12



# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీపీఐ మద్దతు కోరాం

**టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్**

**సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో కాంగ్రెస్, కమ్యూనిస్టు నేతల సమావేశం**



**హైదరాబాద్, వెలుతురు, అక్టోబర్ 23:**

రానున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి మద్దతు ఇవ్వాలని సీపీఐ నాయకులను కోరినట్లు టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. హిమాయత్‌నగర్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో గురువారం కాంగ్రెస్, సీపీఐ నాయకుల మధ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రెండు పార్టీల మధ్య రాజకీయ సమన్వయం, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ఇండియా కూటమిలో సీపీఐ భాగస్వామిగా ఉందని, గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేసిందని గుర్తు చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రజాక్షేత్రంలో సీపీఐతో కలిసి ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. రానున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు సీపీఐ మద్దతు ఇవ్వాలని కోరినట్లు

- మిగతా 2 లో..

## రాజకీయ బిక్ష పెట్టిన ప్రజలకే అన్యాయం చేస్తున్న రేవంత్ రెడ్డి

**ఏలేటి మహేశ్వర్ రెడ్డి**



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 23:**

జవహర్ నగర్ డంప్ యార్డ్ తరలింపు ఉద్యమం, పాదయాత్ర సన్నాహక సమావేశంలో బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారు పాల్గొన్నారు. బీజేపీ మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ చేపట్టిన పోరాటానికి, ఆయన సంకల్పించిన పాదయాత్రకు బీజేపీ శాసనసభాపక్షం, బీజేపీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులంతా ఈ ఉద్యమంలో భాగస్వాములవుతారని తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రాజ్యాంగం గురించి మాట్లాడే రాహుల్ గాంధీకి తెలంగాణలో ప్రజలు ఎదుర్కొం టున్న పర్యావరణ సమస్యలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి రాజకీయ బిక్ష పెట్టి, ఆయన ముఖ్యమంత్రి కావడానికి ముందు ఎన్నికల్లో గెలిపించి అండగా నిలిచిన ప్రజలే నేడు జవహర్నగర్ డంప్ యార్డ్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రాజకీయ భిక్ష పెట్టిన ప్రజల ఆరోగ్యం, హక్కులను కాపాడాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డికి లేదా? అని ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు.

గత 30 ఏళ్లుగా జవహర్నగర్ డంప్యార్డ్ సమస్యతో పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రోజుకు సుమారు 10,000 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు పేరుకుపోవడంతో ప్రజల ఆరోగ్యం, జీవన పరిస్థితులు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు హామీలకే పరిమితమయ్యాయని, నేటికీ శాశ్వత పరిష్కారం చూపకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పాల్గొని, అనేక సంక్లిష్టమైన ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడిన అనుభవం ఈటల రాజేందర్‌కి ఉందని

- మిగతా 2 లో..

## రేవంత్ రెడ్డి హడావిడి ఏడాది మాత్రమే..



- తర్వాత కేసీఆరే సీఎం : కేటీఆర్
- ప్రభుత్వానికి ఎన్నికలు నిర్వహించే ధైర్యం లేదు
- రాష్ట్ర ప్రయోజనాల కోసం ఒక్క ఎంపీ కూడా పనిచేయడం లేదని విమర్శ

- వివరాలు 2 లో..

## తెలంగాణలో ఖేలో ఇండియా

- గేమ్స్ నిర్వహణకు పకడ్బందీ కార్యాచరణ
- గ్రామీణ స్థాయి నుంచే ప్రతిభావంతులైన క్రీడాకారుల గుర్తింపు
- డిసెంబర్ 11 నుంచి 22 వరకు పోటీలు
- 27 క్రీడాంశాల్లో ప్రతిభావంతుల ఎంపిక

- వివరాలు 12 లో..

# తుమ్మిడిహెట్టి బ్యారేజ్‌పై మహారాష్ట్రతో చర్చలు



(మొదటిపేజీ తరువాయి)

వివరించారు.

**సాధ్యమైనంత నీటిని తెచ్చుకునేందుకు..**

మహారాష్ట్రలో ముంపు ప్రభావాన్ని అంచనా వేసుకొని, సాధ్యమైనంత నీటిని తెచ్చుకునేందుకు వీలుగా ఈ బ్యారేజీ నిర్మించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఇప్పటికే కేంద్ర జల సంఘం అధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన రెండు రాష్ట్రాల అధికారుల సమావేశంలో జరిగిన వివరాలన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని, సీడబ్ల్యూసీ కోరిన సమాచారాన్ని అందజేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. అటవీ, గిరిజన ప్రాంతం, అత్యంత వెనుకబడిన ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు తుమ్మిడిహెట్టి బ్యారేజ్ నిర్మిస్తున్నామని సీఎం వివరించారు. అదే లక్ష్యాన్ని సాధించే సంకల్పంతో మహారాష్ట్ర ప్రభుత్వంతో సానుకూల చర్చలు, సంప్రదింపులు జరగాలని ముఖ్యమంత్రి తన ఆకాంక్షను వ్యక్తం చేశారు. జల్ జంగిల్ జమీన్ నినాదంతో ఏళ్లకేళ్లు పోరాడిన అటవీ ప్రాంతవాసులందరికీ ఈ ప్రాజెక్టు ద్వారా మేలు జరగాలని అన్నారు. అందుకే తుమ్మడిహెట్టి ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బ్యారేజీ ఎత్తుపై స్పష్టత వచ్చిన తర్వాత.. తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి వరకు నీటిని తెచ్చే ప్రాజెక్టు రూట్ డిజైన్లు, భూసేకరణపై దృష్టి సారించాలని ఇరిగేషన్ ఇంజనీర్లను సీఎం ఆదేశించారు.

**తక్కువ ఎత్తున బ్యారేజీ నిర్మిస్తే..**

గతంలోనే 148 మీటర్ల ఎత్తుకు మహారాష్ట్ర అంగీకరించిందని, అంత తక్కువ ఎత్తున బ్యారేజీ నిర్మిస్తే ఆశించినంత నీటిని తెచ్చుకునే వీల్లేదని సీఎం అన్నారు. అందుకే 152 మీటర్ల ఎత్తున బ్యారేజ్ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు అవసరమైన సాంకేతిక నివేదికలు, నీటి లభ్యత, ముంపు విస్తీర్ణం, ఇతర అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలను సిద్ధంగా ఉంచాలన్నారు. ఇటీవల ఢిల్లీలో కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశాల వివరాలు, అక్కడ చర్చించిన అంశాలు, వాళ్లు కోరిన నివేదికలన్నీ వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. మహారాష్ట్రతో చర్చల సందర్భంగా తెలంగాణ నీటి అవసరాలను తెలియజేసి, మన వాదనను సమర్థంగా వినిపించాలని మంత్రులకు సీఎం సూచించారు. డిండి ప్రాజెక్టుకు ఏదుల రిజర్వాయర్ నుంచి 0.5 టీఎంసీల నీరు, అచ్చంపేట ఎత్తిపోతల పథకానికి 0.1 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ రెండు ప్రాజెక్టులకు అవసరమయ్యే 0.6 టీఎంసీల నీటిని శ్రీశైలం నుంచి అదనంగా సమకూర్చుకునే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. శ్రీశైలం, నార్లాపూర్ నుంచి ఏదుల రిజర్వాయర్ వరకు ఈ అదనపు నీటిని లిఫ్ట్ చేసుకునేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎక్కడెక్కడ పంపులు, పంప్ హౌజ్లు అమర్చాలి.. ఇప్పుడున్న కెనాల్స్, టన్నెల్ సిస్టమ్ సామర్థ్యం సరిపోతుందా.. లేదా ఎక్కడ కాల్వల సామర్థ్యం పెంచుకోవాలనేది ఇరిగేషన్ విభాగం వెంటనే అధ్యయనం చేసి.. అందుకు వీలైన డిజైన్లు తయారు చేసుకోవాలని సీఎం ఆదేశించారు. దీంతో పాలమూరు ప్రాజెక్టు నీటి అవసరాలకు ఎలాంటి కోత పడదని సీఎం స్పష్టం చేశారు. పాలమూరు నీటి కేటాయింపులకు ఆటంకం లేకుండా ఏదుల నుంచి డిండి, అచ్చంపేట ప్రాజెక్టులకు నీటిని అందించేలా ఈ పనులు చేపట్టాలని ఆదేశించారు.

**పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా..**

నార్లాపూర్ నుంచి డిండికి నీటిని తీసుకోవాలా... ఏదుల నుంచి డిండికి నీటిని తీసుకోవాలనే విషయంలో మహబూబ్నగర్, నల్గొండ జిల్లాల ప్రతినిధుల అభ్యంతరాలు, విజ్ఞప్తులపై సమావేశంలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా నార్లాపూర్ నుంచి నీటిని తరలిస్తే ఎంత ఖర్చవుతుంది.. ఏదుల నుంచి నీటిని తీసుకుంటే ఎంత అంచనా వ్యయమవుతుందనే వివరాలన్నీ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనుకూలతలు, ప్రతికూలతలన్నింటినీ వివరించారు. మధ్యేమార్గంగా పాలమూరు ప్రాజెక్టు నీటికి ఢోకా లేకుండా డిండి, అచ్చంపేట ఎత్తిపోతలకు నీటిని లిఫ్ట్ చేసేందుకు వీలుగా అదనపు నీటిని తెచ్చుకునే పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి చేసిన సూచనకు మంత్రులు మద్దతు తెలిపారు. సమావేశంలో ఇరిగేషన్ సలహాదారు ఆదిత్యనాథ్, సీఎంవో సెక్రెటరీ మాణిక్రాజ్ తో పాటు సెక్రెటరీ (టన్నెల్) కల్నల్ పరీక్షిత్ మెహ్రా తో పాటు ఇరిగేషన్ జాయింట్ సెక్రెటరీ శ్రీనివాస్, అన్ని ప్రాజెక్టుల సీఈలు పాల్గొన్నారు.

## రేవంత్రెడ్డి హడావిడి ఏడాది మాత్రమే..

- తర్వాత కేసీఆరే సీఎం : కేటీఆర్
- రాష్ట్ర ప్రయోజనాల కోసం ఒక్క ఎంపీ కూడా పనిచేయడం లేదని విమర్శ



హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 23:

రాష్ట్రంలో రేవంత్రెడ్డి హడావిడి మరో ఏడాది మాత్రమే ఉంటుందని తర్వాత కేసీఆర్ సీఎం అవుతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. అంబర్పేట బీఆర్ఎస్ నేతల సమావేశంలో దేశ రాజకీయాల్లో కేసీఆర్ కీలకమయ్యే రోజులు వస్తున్నాయని కేటీఆర్ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్, బీజేపీయతర పార్టీలు దేశంలో కీలకం అవుతాయని, రాహుల్ ఏం చేసినా లాభం లేదు, మోదీ వల్ల ఏం జరిగిందో చూస్తున్నామని మండిపడ్డారు. కాంగ్రెస్ విఫలమైందని, అందుకే సీజేపీ పేరుతో యువత పోరాటం చేస్తోందని తెలిపారు. రెండు రాజకీయ పార్టీల ఎంపీలు ఏం చేస్తున్నారో చూస్తున్నామని, తెలంగాణ ప్రయోజనాల కోసం ఒక్క ఎంపీ కూడా పనిచేయడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ చేతిలో మోసపోయిన వర్గాలన్నీ బీఆర్ఎస్ వైపు చూస్తున్నాయని కేటీఆర్ స్పష్టం చేశారు.

మరోవైపు రాష్ట్రంలో కరెంట్ లేక రైతులు గోస పడుతున్నారు. కరవు పరిస్థితులకు ఎల్నినో కారణమని ప్రభుత్వం సాకులు చెబుతోందని వాతావరణ నిపుణులు ఎల్నినో ప్రభావం గురించి 10 నెలల ముందే హెచ్చరించినా ప్రభుత్వం ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ సంస్థలకు ఎన్నికలు జరిపే ధైర్యం రేవంత్‌రెడ్డికి లేదని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్కు బుద్ధి చెప్పేందుకు యువత సిద్ధంగా ఉన్నారని కేటీఆర్ స్పష్టం చేశారు.

**ప్రభుత్వానికి ఎన్నికలు నిర్వహించే ధైర్యం లేదు**

మేడిగడ్డ ఆనకట్ట విషయంలో కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందని, రాహుల్ గాంధీని తీసుకొచ్చి అసత్యాలు చెప్పించారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ చేస్తున్న ప్రచారాన్ని ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కేసీఆర్‌ను విమర్శించే విషయంలో కాంగ్రెస్, బీజేపీలు రెండూ ఒక్కటవుతున్నాయని, తెలంగాణ ప్రయోజనాల కోసం పనిచేయకుండా కేసీఆర్, తిట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించే ధైర్యం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి లేదని కేటీఆర్ అన్నారు. ఎన్నికలు నిర్వహిస్తే 2017లో సాధించిన విజయాల తరహాలోనే బీఆర్ఎస్ కార్పొరేషన్లను గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని, ఎన్నికలు వస్తే ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుందని పేర్కొన్నారు.

## కరువుపై సమరశంఖం!

(మొదటిపేజీ తరువాయి)

పనిచేయాలని సూచించారు. కరువు పరిస్థితులను శాస్త్రీయంగా విశ్లేషించి, అర్హత కలిగిన మండలాలను గుర్తించాలని సూచించారు. ఇప్పటికే కరువు తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాలతో పాటు, 20 శాతానికి మించి కరువు ప్రభావం ఉన్న మండలాల పరిస్థితులను కూడా పరిశీలించాలని తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా అర్హత కలిగిన మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించే అంశంపై సిఫార్సులు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. కరువు ప్రభావం వివిధ రంగాలపై ఎలా ఉండబోతోందో ముందుగానే అంచనా వేస్తే, ప్రజలకు అవసరమైన సహాయాన్ని సకాలంలో అందించేందుకు వీలవుతుందని చెప్పారు. అందుకే ప్రతి శాఖ తన పరిధిలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. తాగునీరు, సాగునీటి అవసరాలకు ప్రాధాన్యమిస్తూ అందుబాటులో ఉన్న నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు.

ఎల్నినో పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్ రంగంలో ఎదురయ్యే సవాళ్లను ముందుగానే గుర్తించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు శాఖ సిద్ధంగా ఉండాలని చెప్పారు. ప్రజలకు అవసరమైన సేవలు నిరంతరాయంగా అందించేందుకు అన్ని శాఖలు తమ అవసరాలను ముందుగానే అంచనా వేయాలని, అత్యవసర ఖర్చుల కోసం ఆర్థిక శాఖ తగిన విధంగా సహకరించేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ రంగంపై కరువు ప్రభావాన్ని తగ్గించేందుకు రానున్న పంటల సీజన్‌కు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులకు ముందస్తు సమాచారం అందించాలని అన్నారు. కరువు, ఎల్నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. సమస్యలు తీవ్రరూపం దాల్చిన తర్వాత స్పందించడం కంటే, ముందుగానే వాటిని గుర్తించి నివారణ చర్యలు చేపట్టడం ముఖ్యమని పేర్కొన్నారు.

రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, జిల్లాల్లో ప్రతి వారం సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి చేపట్టిన చర్యలు, కరువు నివారణ చర్యలపై జిల్లా కలెక్టర్లు తగు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రస్తుత నీటి ఎద్దడి నేపథ్యంలో వరి వేయవద్దని, దీనికి ఇప్పటి నుండే చర్యలు చేపట్టాలని సూచించారు. నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులకు ముందస్తు సమాచారం అందించాలని వ్యవసాయ, నీటిపారుదల శాఖలను ఆదేశించారు. గ్రామస్థాయిలో రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, సాగు ప్రణాళికలు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన ప్రభుత్వ పథకాలను సమర్థంగా వినియోగించుకొని, కరువు పరిస్థితుల్లోనూ రైతులకు అండగా నిలిచే విధంగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

**ప్రతీ వారం నివేదిక : మంత్రి తుమ్మల**

వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, వాస్తవ పరిస్థితులపై రైతులు, సాధారణ ప్రజానీకాన్ని చైతన్య పర్చాలని అన్నారు. మండలాల్లో భూ గర్భ జలాల మట్టం, వేసవి తీవ్రత తదితర అంశాలపై గణాంకాలను ప్రతీ వారం నివేదికలను జిల్లాల్లో విడుదల చేయాలని సూచించారు. రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా, మండల, గ్రామ స్థాయి వరకు ప్రజలకు అవసరమైన సమాచారం చేరేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ నిర్ణయాలు, నీటి సంరక్షణ చర్యలు, వ్యవసాయ సలహాలు, అందుబాటులో ఉండే సహాయ కార్యక్రమాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సహకారం తీసుకోవాలని తెలిపారు.

రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ, ప్రస్తుత ఎల్-నినో పరిస్థితుల నేపథ్యంలో ప్రతీ జిల్లా కలెక్టర్లు, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్లకు అత్యవసర ప్రత్యేక నిధులు కేటాయించాలని అన్నారు. ప్రస్తుత ఎల్-నినో, కరువు పరిస్థితులతో రాష్ట్రంలో దాదాపు రూ. 7,000 కోట్లతో కరువు పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు తాగునీరు, రైతులకు అవసరమైన సహాయం, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉండేలా కార్యాచరణను సిద్ధం చేసి, దాని అమలుపై నిరంతరం దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, జిల్లాల్లో రోజు రోజుకు చెరువుల్లో నీరు గణనీయంగా తగ్గిపోతుందని తద్వారా చేపల మనుగడకు కష్టంగా మారిందని అన్నారు. ఈ పరిస్థితుల్లో పెద్ద రిజర్వాయర్లలో చేపలను వదిలేందుకు ప్రాధాన్యత నిస్తున్నామన్నారు. పశువులకు తాగునీటి తొట్లెలను ప్రతీ గ్రామంలో ఏర్పాటు చేయాలని తెలిపారు.

**అత్యవసర నిధుల కింద ఒక కోటి**

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, ఇప్పటికే ప్రతీ జిల్లా కలెక్టర్‌కు అత్యవసర నిధుల కింద ఒక కోటి రూపాయలను విడుదల చేయడం జరిగిందని తెలిపారు. వర్షాపాతం తక్కువగా నమోదు, పంట విస్తీర్ణం 50 శాతం కంటే తక్కువగా ఉండడం తదితర ప్రమాణాలను పరిగణనలో తీసుకొని 358 మండలాలలో కరువు పరిస్థితులు ఉన్నట్టు ప్రాథమికంగా నిర్ధారించమని తెలిపారు.

నియమిత గడువైన, ఈనెల 31 తేదీ లోగా కేంద్ర ప్రభుత్వానికి కరువు మండలాల జాబితా ను సమర్పిస్తామని తెలిపారు. మొత్తం 33 జిల్లాలకు గాను 18 జిల్లాల్లో కనిష్ట వర్షపాతం నమోదుకాగా, 15 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదయిందని తెలిపారు. 324 మండలాల్లో భూగర్భ జలాల మట్టం ఆందోళనకర స్థాయిలో ఉందని వివరించారు.

రాష్ట్రంలోని రిజర్వాయర్లలో మొత్తం 470 టీఎంసిలకు ప్రస్తుతం 170 టి. ఎం.సిల జలాలు మాత్రమే ఉన్నాయన్నారు. సింగూరు జలాశయాన్ని తానూ స్వయంగా పరిశీలించామని,

## జవహర్ ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించిన నాయకులు

మధిర, వెలుతురు అక్టోబర్ 23:



మధిర మండలం వంగవీడు గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారి కృషితో రూ.630.30 కోట్లతో నిర్మితమవుతున్న జవహర్ ఎత్తిపోతల పథకం పనులను కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మధిర నియోజకవర్గ రైతుల సంక్షేమమే లక్ష్యంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారు సాగునీటి ప్రాజెక్టుల ఏర్పాటుకు కృషి చేస్తున్నారని తెలిపారు. జవహర్ ఎత్తిపోతల పథకం పూర్తయితే మధిర, ఎర్రుపాలెం మండలాల్లోని వ్యవసాయ భూములకు సాగునీటి సదుపాయం మెరుగుపడి రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. రైతుల కష్టాలను గుర్తించి, వ్యవసాయానికి సాగునీరు అందించాలనే లక్ష్యంతో భట్టి విక్రమార్క గారు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు రైతాంగానికి అండగా నిలుస్తాయని అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా సాగునీటి సమస్యలు తగ్గి, వ్యవసాయ రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు, మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పారుపల్లి విజయకుమార్, జిల్లా కాంగ్రెస్ నాయకులు వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి పులిబండ్ల చిట్టిబాబు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సూరం శెట్టి కిషోర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐలూరి సత్యనారాయణ రెడ్డి, సర్పంచ్ సిద్దిపోగు ప్రసాద్, కౌన్సిలర్ యన్నం కోటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు తన్నీరు రామకృష్ణ, లక్ష్మారెడ్డి, ఎక్కిటాల కృష్ణారావు, ఓబుల్ లక్ష్మారెడ్డి, బండి వెంకటేశ్వర్లు, గూడెల్లి వెంకటేశ్వర్లు, దర్శీ కిరణ్, సక్రు, బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## హుస్నాబాద్ 'స్టీల్ బ్యాంక్' చొరవకు కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ ప్రశంసలు

**సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే కార్యక్రమంపై మంత్రి పొన్నం ప్రభాకర్‌కు లేఖ**

హైదరాబాద్, వెలుతురు, అక్టోబర్ 23:

హుస్నాబాద్ నియోజకవర్గంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు 'స్టీల్ బ్యాంక్' ఏర్పాటు చేయాలనే రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ చొరవను కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి భూపేందర్ యాదవ్ అభినందించారు. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కేంద్ర మంత్రి లేఖ రాశారు.

గ్రామీణ ప్రాంతాల్లో జరిగే శుభకార్యాలు, వివాహాలు, ఇతర సామూహిక కార్యక్రమాల్లో ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు వంటి ఒక్కసారి వినియోగించే వస్తువుల వాడకాన్ని తగ్గించేందుకు స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రల పూర్తి సెట్లతో 'స్టీల్ బ్యాంక్' ఏర్పాటు చేయాలనే ఆలోచన అభినందనీయమని భూపేందర్ యాదవ్ పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా ప్లాస్టిక్ వినియోగంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలను కూడా క్షేత్రస్థాయిలో తగ్గించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని కేంద్ర మంత్రి తన లేఖలో వివరించారు. అధిక కాలుష్యానికి కారణమయ్యే గుర్తించిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులపై నిషేధం, ప్లాస్టిక్ ప్యాకేజింగ్‌కు సంబంధించి ఉత్పత్తిదారుల విస్తరించిన బాధ్యత (ఈపీఆర్) అమలు, వస్తువుల పునర్వినియోగం, పర్యావరణహిత ప్రత్యామ్నాయాల ప్రోత్సాహం వంటి చర్యలు ఇందులో భాగమని పేర్కొన్నారు.

ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా పర్యావరణ హిత వస్తువుల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ రూపొందించిన 'సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులకు ప్రత్యామ్నాయాల తయారీదారులు, విక్రేతల సంకలనం'ను 2025 ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విడుదల చేసినట్లు తెలిపారు. ఈ సంకలనం కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని వెల్లడించారు.

ప్లాస్టిక్ కాలుష్యాన్ని సమర్థవంతంగా నియంత్రించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని భూపేందర్ యాదవ్ అభిప్రాయపడ్డారు. అందరి భాగస్వామ్యంతోనే పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలను స్థిరమైన పద్ధతుల్లో సాధించవచ్చని పేర్కొన్నారు.

హుస్నాబాద్‌లో 'స్టీల్ బ్యాంక్' ఏర్పాటు ఆలోచన గ్రామీణ స్థాయిలో పర్యావరణ పరిరక్షణకు దోహదపడనుంది. శుభకార్యాలు, సామూహిక వేడుకల్లో స్టీల్ పాత్రలను తిరిగి వినియోగించడం ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించడంతో పాటు పునర్వినియోగ సంస్కృతిని ప్రోత్సహించవచ్చు. మంత్రి పొన్నం ప్రభాకర్ చేపట్టిన ఈ చొరవ పర్యావరణహిత జీవన విధానాలకు ప్రోత్సాహాన్నిచ్చే కార్యక్రమంగా నిలవనుంది.

## సీపీఐ మద్దతు కోరాం



(మొదటిపేజీ తరువాయి)

వెల్లడించారు. ఎన్నికల్లో మద్దతు కోసం సీపీఎం నాయకులతోనూ చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు. రెండు పార్టీల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసుకోవడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలిసి పనిచేయడంపై సమావేశంలో చర్చించినట్లు తెలిసింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వామపక్ష పార్టీల మద్దతు కూడగట్టేందుకు కాంగ్రెస్ నాయకత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ మల్లు రవి పాల్గొన్నారు. సీపీఐ తరపున రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, జాతీయ కార్యవర్గ సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి, చాడ వెంకట్ రెడ్డి హాజరయ్యారు. అలాగే సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీఎస్ బోస్, ఈటీ నరసింహ, తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు, కలవేని శంకర్, బాల నరసింహ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

## అన్యాయం చేస్తున్న రేవంత్ రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. జవహర్ నగర్ డంప్ యార్డ్ తరలింపు కోసం ఆయన ముందుకు రావడం సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందనే నమ్మకాన్ని ప్రజల్లో పెంచుతోందని ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు.

బాధిత ప్రజలకు న్యాయం జరిగి, డంప్యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని, ఈ పోరాటాన్ని కొనసాగిస్తామని ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.

### చాముండేశ్వరి పీఠంలో
## చండీ పారాయణాలు

హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 23:

శ్రీ చాముండేశ్వరి అనుగ్రహ పీఠంలో పీఠాధిపతులు బ్రహ్మశ్రీ కృష్ణ చాముండేశ్వరి మహర్షుల ఆధ్వర్యంలో విశ్వశాంతి కోసం చండీ పారాయణాలు, మంత్రానుష్ఠానాలు, దీక్షలు బంజారాహిల్స్ శ్రీనగర్ కాలనీలో ఘనంగా నిర్వహించారు. సుమారు 1108 వనమూలికలతో చండీ హోమం నిర్వహించి, శ్రీ చాముండేశ్వరి అమ్మవారికి విశేష పూజలు చేశారు.

ఈ సందర్భంగా మహర్షులు మాట్లాడుతూ, భూతాపాన్ని తగ్గించేందుకు ప్రకృతి పరిరక్షణపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని సూచించారు. నీటిని పొదుపుగా వినియోగించాలని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని, పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని ఆకాంక్షించారు.

# మల్లవరం బామ్మ కల నెరవేర్చారు..!!



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 23 :** ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మల్లవరంకు చెందిన 96 సంవత్సరాల బామ్మ దుగ్గిదేవర సామ్రాజ్యం చిరకాల కలను బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర నెరవేర్చారు. మల్లవరం గ్రామ సర్పంచ్ గా 2సార్లు, ఎంపీటీసీగా 2 పర్యాయాలు, సింగిల్ విండో డైరెక్టర్ గా పని చేసిన సామ్రాజ్యం అన్ని వర్గాల ప్రజల గౌరవాభిమానాలకు పాత్రులయ్యారు. అహింసా మార్గంలో మహోద్యమాన్ని నడిపి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిపెట్టి అన్నివిధాలా గొప్పగా అభివృద్ధి చేసిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు అంటే సామ్రాజ్యంకు ఎనలేని అభిమానం. మహానేత కేసీఆర్ ను కలిసి ఫోటో దిగాలనేది ఆమె చిరకాల కోరిక. ఈ విషయాన్ని ఆమె పెద్ద కుమారుడు, బీఆర్ఎస్ నాయకుడు వెంకటలాల్ ఎంపీ రవిచంద్ర దృష్టికి తీసుకురాగా, ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా సామ్రాజ్యంను ఆమె కుమారులు వెంకటలాల్, అజయ్ కుమార్, మనవళ్లు యుధిష్టర్, శ్రీరఘునందన్ లను వెంటబెట్టుకుని రవిచంద్ర శుక్రవారం తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు వద్దకు తీసుకెళ్లారు. సామ్రాజ్యంను కేటీఆర్ ఆప్యాయంగా పలకరించి శాలువాతో సత్కరించి గౌరవించారు. త్వరలో కేసీఆర్ వద్దకు తీసుకెళ్లి ఆమె చిరకాల కోరికను నెరవేర్చుతానని మాటిచ్చారు.

**శ్రీరఘునందన్ ను అభినందించిన కేటీఆర్**

సామ్రాజ్యం మనవడు, అజయ్ కుమార్ కుమారుడు శ్రీరఘునందన్ బెంగళూరులో బీబీఏ చదువుతున్నారు. ఆయనకు చిన్నతనం నుంచే సమాజ సేవ, పరిశుభ్రత, పచ్చదనం పట్ల మక్కువ ఎక్కువ. మహానేత కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా 2016 ఫిబ్రవరి 17న తమ స్వగ్రామం మల్లవరంలోని ప్రాథమిక పాఠశాలను ఆయన దత్తత తీసుకున్నారు. అప్పుడాయన 5వ తరగతి చదువుతున్నారు. వయస్సు 9 ఏళ్లు. తాను దత్తత తీసుకున్న ప్రాథమిక పాఠశాలలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే కాక పరిసరాలలో పచ్చదనాన్ని, పరిశుభ్రతను పెంచారు. చిన్నతనంలోనే శ్రీరఘునందన్ చేస్తున్న సమాజసేవను అభినందిస్తూ 2017లో జాతీయ, 2017,18లలో రాష్ట్రస్థాయి స్వచ్ఛ పాఠశాల పురస్కారాలు లభించాయి. ఈ సందర్భంగా శ్రీరఘునందన్, ఆయన కుటుంబ సభ్యులను కేటీఆర్, రవిచంద్రలు అభినందించారు.

# ఎల్‌నినో ముప్పును ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు

- టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్
- ప్రజా భవన్‌లో కాంగ్రెస్ ముఖ్య నేతల సమావేశం..
- ఎల్ నినో ముప్పు, ఎమ్మెల్సీ ఎన్నికలు, ఇండియా బ్లాక్ మెగా ర్యాలీపై చర్చ




**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 23 :** ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో కరువు పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ సూచించారు. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని, తాగునీటి కొరత రాకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని పేర్కొన్నారు. ప్రజా భవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, డీసీసీ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పలువురు మంత్రులు హాజరయ్యారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే చర్యలతో పాటు ఎమ్మెల్సీ ఎన్నికలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు.

**కరువు నివారణకు సమన్వయ చర్యలు**

ఎల్‌నినో ప్రభావంతో జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో సాగునీటి వినియోగంలో పొదుపు పాటించాలని మహేశ్ కుమార్ గౌడ్ సూచించారు. వ్యవసాయ రంగాన్ని కాపాడేందుకు సమన్వయంతో చర్యలు చేపట్టాలని, యాసంగి సీజన్‌లో ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.నీటి సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, విద్యుత్ పొదుపులో ప్రజలు భాగస్వాములు కావాలని అన్నారు. నిత్యావసర వస్తువుల కృత్రిమ కొరత సృష్టించడం, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడటం వంటి చర్యలను అరికట్టాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం కూడా సహకరించాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా సమష్టి కృషితో కరువు పరిస్థితులను ఎదుర్కోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

**నవంబర్ 1న ఇండియా బ్లాక్ మెగా ర్యాలీ**

ఇండియా బ్లాక్ కూటమి ఆధ్వర్యంలో నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న మెగా ర్యాలీ అంశం కూడా సమావేశంలో చర్చకు వచ్చింది. ఈ ర్యాలీని విజయవంతం చేసే అంశంపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తనతో ఫోన్‌లో సంప్రదింపులు జరిపినట్లు మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. ర్యాలీకి పెద్ద సంఖ్యలో ప్రజలను సమీకరించే అంశంపై మంత్రులు, ఎమ్మెల్యేలు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. ఆయా ప్రాంతాల నాయకులతో చర్చించి జన సమీకరణకు సంబంధించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన అంశాలు, పార్టీ సంస్థాగత వ్యవహారాలు, రాబోయే కార్యక్రమాల నిర్వహణపై నాయకులు చర్చించారు.

# సామాజిక సమస్యలను కళాత్మకంగా మలచిన కేఎల్

- కేఎల్ జీవితాన్ని పాఠ్యాంశాలలో చేర్చాలి
- మిర్యాలగూడ కేఎల్ సభలో జూలూరు



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 23:** సామాజిక సమస్యలను జీవితంలోని బహు ముఖాలను కళాత్మకంగా మలిచి విస్తృత రచనలు చేసినతెలుగు జాతినాటక రంగ జెండాగా నిలిచిన కేఎల్ నరసింహారావు జీవితాన్ని, రచనలను పాఠ్యాంశాల్లో చేర్చి భావితరాలకు అందించాలని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ ప్రముఖ కవి జూలూరు గౌరీ శంకర్ తెలిపారు. కేఎల్ నరసింహారావు రచనల్లో తెలంగాణ మట్టి పౌరుషాన్ని, తెలంగాణ జీవన విధానాన్ని నాటకాల్లో సజీవ పాత్రలుగా చిత్రీకరించారని పేర్కొన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా మునగాల పరగణ రేపాల గ్రామం నుంచి ప్రారంభించిన కేఎల్ నాటక రచన ప్రదర్శనలు ఈ నేలలో జరిగిన అనేక రకాల సామాజిక ఉద్యమాలకు సజీవ తార్కాణంగా నిలుస్తాయని చెప్పారు. మిర్యాలగూడెం లో శుక్రవారం టి యు టి ఎఫ్ కార్యాలయంలో వేముల వెంకటేశ్వర్లు రచించిన"నాటక రంగ శిఖరం" కేఎల్ నరసింహారావు పుస్తకాన్ని జూలూరు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలమే ఆయుధంగా, కళా రంగమే ఊపిరిగా, సమాజ సేవే జీవితం గా జనం కోసం జీవిత కాలాన్ని అంకితం చేసిన రంగస్థలం యోధుడిగా కేఎల్ చరిత్రలో నిలిచిపోతారన్నారు. 150 కి పైగా నాటికలు నాటకాలను రచించిన కేఎల్ కృషిని భావితరాలకు అందించేందుకు పాలకులు కృషి చేయాలని జూలూరు గౌరీ శంకర్ పేర్కొన్నారు. తెలంగాణ మట్టి గర్వించదగ్గ కేఎల్ నరసింహారావు వంటి మహా రచయితపై పుస్తకం రావడం ఆహ్వానించదగిందని మిర్యాలగూడ మున్సిపల్ కౌన్సిలర్ నూకల కవిత వేణుగోపాల రెడ్డి, కౌన్సిలర్ జేసిడి శేఖర్ రెడ్డి, తడకమళ్ళ రామచంద్రరావు, కోదాటి సాయి సుజిత నరసింహారావు రచయిత చకోనా, బోయినపల్లి వెంకటరమణారావు, పులి కృష్ణమూర్తి తదితరులు మాట్లాడారు. పుస్తక రచయిత అధ్యాపకులు వేముల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కే ఎల్ వంటి సుప్రసిద్ధ నాటక రచయిత పుస్తకాన్ని వెలువరించడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. ఈ సభకు మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం అధ్యక్షులు పరిమి రామావతారం అధ్యక్షత వహించారు.

# నేటి నుంచి మహిళా జర్నలిస్టుల జాతీయ సదస్సు

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 23 :** ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ), మీడియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా (ఎంఈఎఫ్ఐ) సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబర్ 24, 25 తేదీల్లో హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు 'జాతీయ మహిళా జర్నలిస్టుల సదస్సు' నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) ఆతిథ్యం ఇస్తోంది. బేగంపేటలోని తెలంగాణ పర్యాటక శాఖ హోటల్ 'ది ప్లాజా'లో ఈ సదస్సు జరగనుంది. 21 రాష్ట్రాల నుంచి మహిళా జర్నలిస్టులు ప్రతినిధులుగా హాజరుకానున్నారు.




**సదస్సును ప్రారంభించనున్న హైకోర్టు జస్టిస్**

శనివారం జరిగే సదస్సు ప్రారంభ సమావేశానికి తెలంగాణ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షురాలు జస్టిస్ జి. రాధారాణి ముఖ్య అతిథిగా హాజరై కీలకోపన్యాసం చేస్తారు. గౌరవ అతిథులుగా రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొంటారు. ప్రత్యేక అతిథులుగా తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి, కర్ణాటక మీడియా అకాడమీ చైర్‌పర్సన్ ఆయేషా ఖానమ్, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి హాజరవుతారు. విశిష్ట అతిథులుగా ఎంఈఎఫ్ఐ మేనేజింగ్ ట్రస్టీ, ఐజేయూ మాజీ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, ఐజేయూ అధ్యక్షుడు బల్విందర్ సింగ్ జమ్ము, సెక్రటరీ జనరల్. సోమసుందర్, ఐజేయూ మాజీ అధ్యక్షుడు ఎస్.ఎన్. సిన్హా పాల్గొంటారు.

**సదస్సు ముఖ్యాంశాలు -- ప్రధాన వక్తలు :**

రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో మొత్తం ఐదు ప్రత్యేక సెషన్లు ఉంటాయి. మీడియా రంగంలో పనిచేస్తున్న మహిళలు ఎదుర్కొంటున్న వృత్తిపరమైన సవాళ్లు, పని ప్రదేశాల్లో భద్రత, లింగ వివక్ష, పని పరిస్థితులు, సమాన అవకాశాలు, సరైన ప్రాతినిధ్యం మరియు జర్నలిజంలో మహిళల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించనున్నారు. ఈ సెషన్లలో సీనియర్ జర్నలిస్ట్, సామాజిక కార్యకర్త గీతా శేషు, న్యూస్‌మీటర్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కనిజా గరారి, సీనియర్ ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ మాలిని సుబ్రమణ్యం, ప్రముఖ జర్నలిస్ట్ ఉమా సుధీర్, ఉస్మానియా విశ్వవిద్యాలయ జర్నలిజం విభాగం మాజీ అధిపతి ప్రొఫెసర్ పద్మజా షా తదితరులు ప్రసంగిస్తారు.

**25న ముగింపు సమావేశం**

అక్టోబర్ 25 మధ్యాహ్నం జరిగే ముగింపు సమావేశానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి.సృజన హాజరవుతారు.

# సుందరంగా సున్నం చెరువు

- పరిశీలించిన హైడ్రా, సీఎంసీ కమిషనర్లు
- ప్రారంభోత్సవ ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో సమీక్ష



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 23 :** హైడ్రా ఎంతో ప్రతిష్టాత్మక పునరుద్ధరించి సున్నం చెరువును హైడ్రా, సీఎంసీ కమిషనర్లు ఏవీ రంగనాథ్, సృజన శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఈ నెల ఆఖరున లేదా వచ్చే నెల ఆరంభంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సున్నం చెరువును ప్రారంభించనున్న నేపథ్యంలో ఇరువురు కమిషనర్లు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను సమీక్షించారు. దాదాపు 20 ఎకరాల మేర ఎఫ్ టీఎల్ హద్దులు నిర్ధారించి పూడికతీయడం నుంచి ఫెన్సింగ్ వేసేవరకు సాగిన పనులను సమీక్షించారు. చెరువు చుట్టూ నిర్మించిన ఎత్తయిన బండ్, వాకింగ్ ట్రాక్స్ నిర్మాణాలను పరిశీలించారు. చెరువు లోపలివైపుతో పాటు పాతవే బయట వేసిన ఫెన్సింగ్ ను చూశారు. ఆక్రమణలు తొలగించి దాదాపు 30 ఎకరాల మేర చెరువుతో పాటు పరిసరాలను అభివృద్ధి చేసిన తీరును పరిశీలించారు. చెరువు చెంతన అభివృద్ధి చేస్తున్న పార్కులు, ఓపెన్ జిమ్ లు, కూర్చునేందుకు ఏర్పాటు చేసిన గజబోలు, బోటింగ్ జెట్టీల నిర్మాణాన్ని పరిశీలించారు. హైడ్రా అడిషనల్ కమిషనర్ ఆనంద్, ఏసీపీ తిరుమల్ తో పాటు సీఎంసీ అధికారులు ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో ఉన్నారు.



# ప్రతిభకు ప్రోత్సాహం.. విద్యకు భరోసా

- బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌కు రూ.40.68 కోట్ల బకాయిల విడుదల
- విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియం విద్య.. 225కుపైగా ప్రైవేటు పాఠశాలలకు ఊరట
- సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహకారంతో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక చొరవ

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 23:** ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన ఇంగ్లిష్ మీడియం విద్యతోపాటు వసతి సౌకర్యాన్ని అందిస్తున్న బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (బీఏఎస్) పథకానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. ఈ పథకం కింద విద్యార్థులకు విద్యనందిస్తున్న రాష్ట్రంలోని 225కుపైగా ప్రైవేటు పాఠశాలలకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రూ. 40.68 కోట్ల బకాయిలను ప్రభుత్వం విడుదల చేసింది. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 32 వేల మంది విద్యార్థులు ప్రైవేటు



పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంలో విద్యను అభ్యసించడంతోపాటు వసతి సౌకర్యాన్ని పొందుతున్నారు. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎలాంటి ఆటంకం కలగకుండా, పాఠశాలలకు చెల్లించాల్సిన బకాయిలను పరిష్కరించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్‌రెడ్డి గారి నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి శ్రీ భట్టి విక్రమార్క గారి సహకారంతో రూ. 40.68 కోట్ల నిధులను విడుదల చేయడం జరిగింది.

**సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి ప్రత్యేక చొరవ**

బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద విద్యార్థులకు అందుతున్న విద్య, వసతి సౌకర్యాల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడటంతో పాటు, పాఠశాలలకు చెల్లించాల్సిన బకాయిల పరిష్కారానికి సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక చొరవ చూపారు. పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పెండింగ్ బకాయిల విడుదలకు అవసరమైన చర్యలను వేగవంతం చేయడంలో మంత్రి కీలకంగా వ్యవహరించారు. ప్రతిభ ఉన్న విద్యార్థులు కేవలం ఆర్థిక పరిస్థితుల కారణంగా నాణ్యమైన విద్యకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకాన్ని అమలు చేస్తోంది. ప్రైవేటు పాఠశాలల్లో విద్య, వసతి, ఇతర అవసరమైన సదుపాయాలను కల్పించడం ద్వారా విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని అందిస్తోంది. పాఠశాలలకు బకాయిల విడుదలతో విద్యార్థుల విద్యాభ్యాసానికి మరింత స్థిరత్వం చేకూరడంతోపాటు, పథకం అమలులో భాగస్వాములైన ప్రైవేటు పాఠశాలలకు కూడా ఆర్థికంగా ఊరట లభించనుంది. ప్రభుత్వం చేపడుతున్న ఈ చర్య ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల విద్యా ప్రగతికి మరింత ఊతమిస్తుందని అధికారులు తెలిపారు. ప్రతిభావంతులైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగానే బకాయిల విడుదల జరిగిందని, విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి అడ్లూరి పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో స్వీట్ల దుకాణాల్లో అపరిశుభ్రత

- గడువు ముగిసిన స్వీట్లతో కొత్త తయారీ
- పురుగులు, బూజు పట్టిన పదార్థాల విక్రయం
- లైసెన్సులు లేకుండానే నిర్వహణ
- కొన్ని దుకాణాల మూసివేత, మరికొన్నింటికి నోటీసులు



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 23 :** పండుగల వేళ ప్రజలు ఎంతో ఇష్టంగా కొనుగోలు చేసే స్వీట్ల విక్రయాల్లో ఆహార భద్రతా నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయి. హైదరాబాద్‌లోని పలు స్వీట్ల దుకాణాల్లో తెలంగాణ ఆహార భద్రతా అధికారులు తనిఖీలు నిర్వహించి, అపరిశుభ్రతతో పాటు పలు ఉల్లంఘనలను గుర్తించారు. మొత్తం 12 బృందాలుగా తనిఖీలు చేపట్టిన అధికారులు, గడువు ముగిసిన స్వీట్లను తిరిగి కొత్త స్వీట్ల తయారీలో కలుపుతున్నట్లు గుర్తించారు. పురుగులు, బూజు పట్టిన పల్లీలు, స్వీట్లను విక్రయానికి ఉంచినట్లు పరిశీలనలో వెల్లడైంది. దుకాణాల్లో స్వీట్ల తయారీకి అపరిశుభ్రమైన పరిసరాలను వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. కొన్ని దుకాణాలు భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) అను మతులు లేకుండానే కొనసాగుతుండగా, మరికొన్ని గడువు ముగిసిన లైసెన్సులతో నిర్వహిస్తున్నట్లు తేలింది. నిబంధనల ఉల్లంఘనలపై కొన్ని దుకాణాలను మూసివేయడంతో పాటు, మరికొన్నింటికి వివరణ కోరుతూ నోటీసులు జారీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇటీవల కూడా హైదరాబాద్‌లో స్వీట్లు, పిండి వంటకాల తయారీ కేంద్రాలపై తనిఖీలు నిర్వహించి, ఆహార భద్రతా ఉల్లంఘనలపై అధికారులు చర్యలు తీసుకున్నారు. పండుగల సమయంలో స్వీట్లు కొనుగోలు చేసేటప్పుడు వాటి నాణ్యత, తయారీ తేదీ, గడువు, పరిశుభ్రతను పరిశీలించాలని అధికారులు సూచిస్తున్నారు.

## స్థానిక ఎన్నికల వేళ పలు చోట్ల ఉద్రిక్తతలు

**తిరుపతి, వెలుతురు అక్టోబరు 23 :** ఏపీలో స్థానిక ఎన్నికల వేళ పలు చోట్ల ఉద్రిక్తతలు చోటుచేసుకుంటున్నాయి. తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పరిధిలోని చిన్నగొట్టిగల్లు మండలం కురవపల్లిలో దారుణ చోటుచేసుకుంది. తెలుగుదేశం పార్టీకి చెందిన సింగిల్ విండో చైర్మన్ ముట్టమ్ ప్రభాకర్‌కు చెందిన కారుకు గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి వేళ నిప్పు పెట్టారు. సీసీ కెమెరాలను పక్కకు తిప్పి మరీ, 4 పెట్రోల్ క్యాన్లతో వచ్చి అత్యంత పగడ్బందీగా కారుకు నిప్పు పెట్టి దగ్ధం చేసినట్లు సమాచారం. ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది. గతంలో మాజీ చైర్మన్ సహదేవ రెడ్డికి సంబంధించిన అవినీతి అక్రమాలను ముట్టమ్ ప్రభాకర్ వెలుగులోకి తీసుకువచ్చారని, ఆ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఈ కారు దగ్ధం చేశారని ఆయన ఆరోపించారు. చంద్రగిరి నియోజకవర్గంలో టీడీపీకి ప్రజల నుంచి పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే ప్రత్యర్థులు ఇలాంటి దారుణాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నేతలు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, పెద్దిరెడ్డి రాంచంద్రారెడ్డి అనుచరులే ఈ పని చేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. నామినేషన్ల సమయంలో తమను, పార్టీ శ్రేణులను భయభ్రాంతులకు గురిచేసే కుట్రలో భాగంగానే ఈ భౌతిక దాడికి పాల్పడ్డారని ప్రభాకర్ పేర్కొన్నారు.

## నియోజకవర్గ ఇబ్బందులు

# పట్టించుకోండి.. నిధులివ్వండి

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 23 :** మల్కాజ్‌గిరి నియోజకవర్గంలోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం ప్రజాభవన్‌లో ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లును మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. సిస్టర్స్ ఆఫ్ చారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశా కిరణ్ చిల్డ్రన్స్ హోమ్స్‌కు గ్రాంటు రూపంలో ఆర్థిక సహాయం అందించాలని కోరారు. టీ-ఫ్రైడ్ ద్వారా అర్హులైన లబ్ధిదారులకు సబ్సిడీలు త్వరగా మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో విద్యుత్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని, అవసరమైన ప్రాంతాల్లో కొత్త సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని కోరారు. సింగిల్ ఫేజ్ నుంచి త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరాకు మార్పులు చేపట్టడంతో పాటు విద్యుత్ స్తంభాలు, బంచ్ కేబుళ్లు ఏర్పాటు చేసి



నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించాలని విజ్ఞప్తి చేశారు. వెంకటాపురం డివిజన్ యాదమ్మనగర్‌లో పేద, బలహీన వర్గాల కుటుంబాలు, ముఖ్యంగా షెడ్యూల్డ్ కులాల ప్రజలు బల్క్ మీటర్ల కారణంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇతర ప్రజా సమస్యలను కూడా ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వినతిపత్రంపై భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించి, సంబంధిత అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిస్టర్స్ ఆఫ్ చారిటీ సభ్యులు సిస్టర్ అనిత, సిస్టర్ క్యాథరిన్, లియోనార్డ్ మీగర్, డేవిడ్ ఫ్రాంక్లిన్, పాస్టర్ విన్సెంట్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీటీసీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన మూలే రామేశ్వర్ రెడ్డి

**కొలిమిగుండ్ల, వెలుతురు :** మండలంలోని తుమ్మలపెంట గ్రామ ఎంపీటీసీ అభ్యర్థిగా మూలే రామేశ్వర్ రెడ్డి ఇవాళ ఎంపీడీవో కార్యాలయంలో నామినేషన్ వేశారు. కొలిమిగుండ్ల మండల టిడిపి అధ్యక్షుడిగా మూలే రామేశ్వర్ రెడ్డి ప్రస్తుతానికి కొనసాగుతున్నారు. త్వరలోనే ఆయనకు పెద్ద ఉన్నత స్థాయి పదవి దక్కనున్నట్లు ఆయన అభిమానులు చర్చించుకుంటున్నారు. రామేశ్వర్ రెడ్డి నామినేషన్ వేస్తున్న సందర్భంగా చివరి రోజు కావడంతో టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీగా తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో తోట అమర్నాథ్ రెడ్డి, నాగ మల్లారెడ్డి, బాయికాటి బ్రదర్స్, రవి ప్రకాష్ రెడ్డి, లోకే పల్లె మధు ప్రసాద్ రెడ్డి, ఇంకా తదితరు నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొండపోచమ్మ నీళ్ల నుంచి కాళేశ్వరం వరకు..

# గులాబీ కోటను టార్గెట్ చేస్తున్న రేవంత్ వ్యూహం

**-నీటి మళ్లింపుపై ఆరోపణలు, అసైన్డ్ భూములపై విచారణ, గత ప్రభుత్వ నిర్ణయాలపై సమరశంఖం**

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ఫామ్‌హౌస్ కేంద్రంగా వివాదం రాజుకుంటోంది. ఒకవైపు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్.. మరోవైపు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి..కొండపోచమ్మ సాగర్ నుంచి ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటిని తరలిస్తున్నారన్న సీఎం ఆరోపణలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపాయి... ఇది కేవలం నీటి సరఫరాకు సంబంధించిన వివాదమేనా..లేక గత పదేళ్ల పాలనలో సాగునీటి ప్రాజెక్టులు, నీటి కేటాయింపులు, ప్రభుత్వ భూముల వినియోగం వంటి అంశాలను మళ్లీ ప్రజల ముందుకు తీసుకొచ్చే రాజకీయ వ్యూహమా.. అనే ప్రశ్నలు ఇప్పుడు ఆసక్తికరంగా మారాయి....కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ మొదలైన ఈ వివాదం క్రమంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ సాగునీటి విధానాలపై చర్చకు దారితీస్తోంది. ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజీ, కృష్ణా జలాల వాటా, పెండింగ్ సాగునీటి ప్రాజెక్టుల అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్‌ను ప్రశ్నిస్తోంది. ఇప్పుడు ఫామ్‌హౌస్‌కు నీటి సరఫరా అంశం కూడా తెరపైకి రావడంతో రాజకీయ పోరు మరో మలుపు తిరిగినట్టయింది.

**కొండపోచమ్మ నీళ్లు..**
**కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు ఎలా...?**

కొండపోచమ్మ సాగర్ నుంచి కాలువ ద్వారా పంచపాండవుల చెరువుకు నీటిని తీసుకెళ్లి, అక్కడి నుంచి పంపుల సాయంతో ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు తరలిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఈ నీటితో వందల ఎకరాలకు ప్రయోజనం కలుగుతోందని పేర్కొంటూ, మాజీ ముఖ్యమంత్రికి మాత్రమే ఇలాంటి ప్రత్యేక సౌకర్యం ఎందుకని ప్రశ్నించారు..ప్రజలకు సాగునీరు అందించాల్సిన ప్రాజెక్టుల నుంచి ఒక వ్యక్తి ప్రైవేట్ భూములకు నీరు వెళ్తోందన్న ఆరోపణ నిజమైతే, అది కేవలం రాజకీయ విమర్శలకే పరిమితమయ్యే అంశం కాదు..ప్రభుత్వ నీటి వనరుల వినియోగం, అధికారిక అనుమతులు, నీటి కేటాయింపులు, ప్రజాధనంతో నిర్మించిన వ్యవస్థల ప్రయోజనాలు ఎవరికి అందుతున్నాయన్న అంశాలపైనా సమగ్ర పరిశీలన అవసరం..అయితే, నీటి మళ్లింపు అక్రమమా.. సంబంధిత శాఖల అనుమతులు ఉన్నాయా.. నీటి వినియోగానికి సంబంధించిన రికార్డులు ఏమి చెబుతున్నాయి? అన్నది అధికారిక విచారణతోనే తేలాల్సి ఉంది. ఆరోపణలు చేయడం ఒక ఎత్తయితే, వాటిని ఆధారాలతో నిరూపించడం మరో ఎత్తు.

**నిజనిర్ధారణకు సిద్ధమన్న సీఎం..**
**బీఆర్ఎస్ స్పందన ఏమిటి...!**

ఈ వ్యవహారంపై నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేయడానికి సిద్ధమని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. పంపుల కనెక్షన్లను పరిశీలించేందుకు బీఆర్ఎస్ నేతలు ముందుకు రావాలని సవాల్ విసరడం ద్వారా ఈ వివాదాన్ని రాజకీయ వేదిక నుంచి వాస్తవాల పరిశీలన వైపు తీసుకెళ్లే ప్రయత్నం చేశారు...ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. నీటి మళ్లింపునకు ఎవరు అనుమతిచ్చారు.. కాలువ నిర్మాణం వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటి.. పంపుల ఏర్పాటుకు అధికారిక అనుమతులు ఉన్నాయా.. ఎంత పరిమాణంలో నీటిని తరలిస్తు న్నారు.. ఆ నీరు సాగునీటి అవసరాలకే వినియోగిస్తు న్నారా? లేక ఇతర అవసరాలకూ ఉపయోగిస్తున్నారా...ఈ ప్రశ్నలకు నీటిపారుదల శాఖ రికార్డులు, క్షేత్రస్థాయి పరిశీలన, నీటి వినియోగ లెక్కలు సమాధానం చెప్పాలి. విచారణ నిష్పక్షపాతంగా జరిగి, ఆధారాలతో కూడిన నివేదిక ప్రజల ముందుకు వస్తేనే వివాదానికి స్పష్టత లభిస్తుంది. రాజకీయ ఆరోపణలతో మొదలైన వ్యవహారం వాస్తవాల వెలికితీతతో ముగుస్తుందా? లేక పరస్పర విమర్శలకే పరిమితమ వుతుందా? అన్నది చూడాలి.

**సామాన్యుడికి ఒక నిబంధన..**
**మాజీ సీఎంకు మరో నిబంధనా....!**

ఈ వివాదంలో రాజకీయంగా అత్యంత కీలకమైన అంశం ఇదే. సాగునీటి కాలువల నుంచి అనుమతులు



లేకుండా నీటిని మళ్లిస్తే సామాన్య రైతులపై అధికారులు చర్యలు తీసుకుంటారా? అలాంటప్పుడు మాజీ ముఖ్యమంత్రి ఫామ్‌హౌస్‌కు నీరు చేరుతోందన్న ఆరోపణలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు? నిబంధనలు అందరికీ సమానంగా వర్తిస్తాయా? అన్న ప్రశ్నలు సహజంగానే ఉత్పన్నమవుతున్నాయి. అయితే, సామాన్య రైతులపై చర్యలు తీసుకున్న సందర్భాలు, ఈ వ్యవహారంలో ఉన్న పరిస్థితులు ఒకేలా ఉన్నాయా అన్నది కూడా పరిశీలించాల్సి ఉంటుంది. సంబంధిత అనుమతులు, భూముల స్వరూపం, నీటి కేటాయింపుల నిబంధనలు పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయానికి రావాలి. ప్రభుత్వ వనరుల వినియోగంలో పారదర్శకత ఉండాలన్నది ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన సూత్రం. మాజీ ముఖ్యమంత్రి అయినా, సామాన్య రైతు అయినా చట్టం, నిబంధనల పరిధిలోనే వ్యవహరిం చాలి. ఈ అంశంలో ప్రభుత్వం ఏ ప్రమాణాలను అనుసరిస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

**ఫామ్‌హౌస్ నుంచి కాళేశ్వరం వరకు..**
**గత పాలనపై ఫోకస్..!**

రేవంత్ రెడ్డి రాజకీయ వ్యూహాన్ని పరిశీలిస్తే, ఈ వివాదం ఒక్క ఫామ్‌హౌస్‌కే పరిమితం కావడం లేదన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, వ్యయాలు, అప్పులు, నీటి కేటాయింపులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే విమర్శలు చేస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజీ పరిస్థితి, కృష్ణా జలాల వాటా, పెండింగ్ ప్రాజెక్టులపై చర్చకు సిద్ధమని సీఎం ప్రకటించడం కూడా ఈ రాజకీయ పోరులో భాగంగా కనిపిస్తోంది..కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించిన సమస్యలు, అంతర్రాష్ట్ర జలాల వివాదాలు, ప్రైవేట్ భూములకు నీటి సరఫరా ఆరోపణలు.. ఇవన్నీ స్వభావరీత్యా వేర్వేరు అంశాలు. ప్రతి అంశానికీ ప్రత్యేకమైన ఆధారాలు, సాంకేతిక వివరాలు, చట్టపరమైన పరిశీలన అవసరం. అయినప్పటికీ, వీటన్నింటినీ గత ప్రభుత్వ పాలనా నిర్ణయాలపై సమగ్ర చర్చలో భాగంగా ముందుకు తీసుకురావడం ద్వారా బీఆర్ఎస్‌ను రాజకీయంగా ఇరకాటంలో పెట్టాలన్న ప్రయత్నం జరుగుతోందనే విశ్లేషణ వినిపిస్తోంది. గతంలో అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల విజయాలనే ప్రధాన అస్త్రంగా చేసుకున్న బీఆర్ఎస్‌కు ఇప్పుడు అదే ప్రాజెక్టుల నిర్వహణ, వ్యయం, ప్రయోజనాల పంపిణీపై ప్రశ్నలు ఎదురవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అంశాలను ప్రజల ముందుకు తీసుకెళ్లగలిగితే, గత పాలనపై రాజకీయ చర్చను తనకు అనుకూలంగా మలుచుకునే అవకాశం ఉంటుంది. అయితే, విమర్శలకు మించి విచారణలు, నివేదికలు, వాస్తవాలు ఎంత బలంగా నిలుస్తాయన్నదే అసలు పరీక్ష.

**అసైన్డ్ భూముల అంశం..**
**మరో రాజకీయ అస్త్రం....!**

కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు సంబంధించిన అసైన్డ్ భూ ముల అంశం కూడా ఈ వివాదానికి మరో కోణాన్ని జోడిస్తోంది. ఆ భూములపై విచారణకు ఆదేశించిన నేపథ్యంలో, అక్కడి నీటి సరఫరాపైనా ఆరోపణలు తెరపైకి రావడం రాజకీయంగా ప్రాధాన్యం సంత రించుకుంది..భూముల యాజమాన్యం, అసైన్డ్ భూ ములకు సంబంధించిన చట్టపరమైన నిబంధనలు, వాటి వినియోగం, నీటి సరఫరాకు ఉన్న అనుమ తులు..ఈ అంశాలన్నింటినీ విడివిడిగా పరిశీలిం చాల్సి ఉంటుంది. భూములపై విచారణలో ఏం తేలింది..నీటి సరఫరాకు అధికారిక అనుమతులు ఉన్నాయా? ప్రభుత్వ వనరులను వినియోగించడంలో నిబంధనలు పాటించారా..అన్నది సంబంధిత శాఖల నివేదికల ద్వారానే స్పష్టమవుతుంది..అయితే, భూముల అంశం, నీటి మళ్లింపు ఆరోపణలు రెండూ ఒకేసారి చర్చలోకి రావడంతో కేసీఆర్ ఫామ్‌హౌస్ ఇప్పుడు రాజకీయ విమర్శలకు కేంద్రంగా మారింది. ఈ పరిణామాలు బీఆర్ఎస్‌పై ఒత్తిడిని పెంచుతాయా.. లేక ఆరోపణలను రాజకీయ కక్షసాధింపుగా ఆ పార్టీ తిప్పికొడుతుందా? అన్నది రానున్న రోజుల్లో తేలనుంది.

**రాజకీయ రణరంగంగా మారుతున్న ఫామ్‌హౌస్...!**

ఈ వ్యవహారంలో మరో ముఖ్యమైన కోణం ప్రజాభిప్రాయం. నీటి కొరత, సాగునీటి అవసరాలు, రైతుల సమస్యలు రాష్ట్రంలో ఎప్పటికప్పుడు చర్చకు వస్తున్నాయి. ఇలాంటి సమయంలో ఒక మాజీ ముఖ్యమంత్రి ఫామ్‌హౌస్‌కు నీటి సరఫరాపై ఆరోపణలు రావడం సహజంగానే ప్రజల్లో ఆసక్తిని రేకెత్తిస్తుంది. ప్రభుత్వం ఈ ఆరోపణలపై ఆధారాలతో కూడిన సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. అదే సమయంలో బీఆర్ఎస్ కూడా తమపై వచ్చిన ఆరోపణలకు వాస్తవాలతో స్పందించాల్సిన పరిస్థితి ఏర్పడవచ్చు. ఆరోపణలు నిరాధారమైతే వాటిని ఖండించడానికి, నిబంధనల ప్రకారం నీటి వినియోగం జరిగితే దాన్ని స్పష్టం చేయడానికి సంబంధిత రికార్డులు కీలకమవుతాయి. మీడియా, రాజకీయ పార్టీలు ఈ అంశాన్ని ఎంతగా ముందుకు తీసుకెళ్లినా, చివరికి ప్రజలు కోరుకునేది స్పష్టతే. ప్రభుత్వ నీటి వనరులు ఎవరి ప్రయోజనాలకు వినియోగమవుతున్నాయి? ప్రజల కోసం నిర్మించిన ప్రాజెక్టుల ప్రయోజనాలు న్యాయంగా అందుతున్నాయా? అధికారంలో ఉన్నవారికి, గతంలో అధికారంలో ఉన్నవారికి ఒకే రకమైన నిబంధనలు వర్తిస్తున్నాయా? అన్న ప్రశ్నలకు సమాధానాలు లభించాలి.

**నీటి వివాదమా.. రాజకీయ వ్యూహమా...!**

కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ మొదలైన వివాదం ఇప్పుడు నీటి సరఫరా ఆరోపణల నుంచి గత ప్రభు త్వ పాలనా నిర్ణయాలపై రాజకీయ సమరానికి విస్తరిస్తోంది. అసైన్డ్ భూముల అంశం, కొండపో చమ్మ సాగర్ నీటి మళ్లింపు ఆరోపణలు, కాళేశ్వరం ప్రాజెక్టుపై విమర్శలు.. ఇవన్నీ కలిపి చూస్తే కేసీఆర్‌ను రాజకీయంగా సమాధానం చెప్పాల్సిన పరిస్థితిలో నిలబెట్టాలన్న వ్యూహం ఉందనే చర్చకు తావిస్తోంది...అయితే, రాజకీయ వ్యూహాలు ఎన్ని ఉన్నా.. నిజానిజాలను తేల్చాల్సింది ఆధారాలు, అధికారిక రికార్డులు, నిష్పక్షపాత విచారణ మాత్రమే. నీటిని అక్రమంగా మళ్లించారన్న ఆరోపణ నిజమైతే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. ఆరోపణల్లో వాస్తవం లేకపోతే అవి కూడా స్పష్టంగా తేలాలి. ఫామ్‌హౌస్‌లోకి చేరిన నీటి దారి ఎక్కడ మొదలైంది. ఆ నీటి వినియోగానికి అనుమతులు న్నాయా..గత ప్రభుత్వ నిర్ణయాల్లో తప్పులున్నాయా.. లేక ఈ వివాదం రాజకీయ ప్రత్యర్థుల మధ్య మరో అస్త్రంగా మారిందా..ఈ ప్రశ్నలకు సమాధానాలు దొరికే వరకు కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ రాజకీయ దుమారం చల్లారే సూచనలు కనిపించడం లేదు. నీటి ప్రవాహం ఎటు సాగిందన్నది ఒక ప్రశ్న అయితే.. ఈ వివాదం తెలంగాణ రాజకీయాలను ఎటు తీసుకెళు ఎందన్నది మరో ఆసక్తికరమైన ప్రశ్న.



**-గాడిపల్లి సునీల్ గౌడ్**
**సీనియర్ జర్నలిస్ట్**
**9502022333**

# ప్రపంచ పోలియో దినోత్సవం

**పోలియో రహిత ప్రపంచంకోసం నిరంతర పోరాటం**

**అక్టోబర్ 24... ప్రపంచ పోలియో దినోత్సవం**

ప్రతి సంవత్సరం అక్టోబర్ 24న ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచ పోలియో దినోత్సవంను జరుపుకుంటారు. ఈ దినోత్సవం ఉద్దేశం – పోలియో నిర్మూలన కోసం జరుగుతున్న ప్రపంచవ్యాప్త పోరాటంలో ప్రజల్లో అవగాహన కల్పించడం, ఇప్పటివరకు సాధించిన విజయాలను గుర్తుచేయడం, ఇంకా మిగిలిన సవాళ్లను ఎదుర్కొనే కర్తవ్యాన్ని పునరుద్ఘాటించడం. పోలియో నిర్మూలనలో మానవజాతి చేసిన కృషి వైద్య చరిత్రలో ఒక అద్భుత ఘట్టంగా నిలిచింది.పోలియో లేదా పోలియో మైలిటిస్ అనే ఈ వ్యాధి ఒకప్పుడు ప్రపంచ వ్యాప్తంగా భయానకంగా విస్తరించి, లక్షలాది పిల్లలను పక్షవాతం బారిన పడేలా చేసింది. కలుషిత నీరు, ఆహారం లేదా మలిన వాతావరణం ద్వారా వ్యాప్తి చెందే ఈ వైరస్ నాడీ వ్యవస్థను దెబ్బతీసి, శాశ్వత అంగ వైకల్యాన్ని కలిగిస్తుంది. ముఖ్యంగా ఐదేళ్ల లోపు పిల్లల్లో ఈ వ్యాధి ఎక్కువగా ప్రభావితం చేస్తుంది. దీనికి నేరుగా చికిత్స లేకపోయినా, టీకా ద్వారా మాత్రమే దీనిని అడ్డుకోవచ్చు.ఈ వ్యాధిని నియంత్రించేందుకు శాస్త్రవేత్తలు ఎంతో కాలం కృషి చేశారు. అందులో ప్రధాన పాత్ర పోషించినవారు అమెరికాకు చెందిన డా. జోనస్ సాక్ . ఆయన 1955లో తొలి సమర్థమైన పోలియో వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేశారు. ఆయన పుట్టినరోజు అయిన అక్టోబర్ 24నే ప్రపంచ పోలియో దినోత్సవంగా జరుపుకుంటారు. తరువాత డా. అల్బర్ట్ సాబిన్ మౌఖిక పోలియో వ్యాక్సిన్ ను అభివృద్ధి చేసి ప్రపంచ వ్యాప్తంగా వినియోగంలోకి తెచ్చారు. వీరి కృషి వల్ల కోట్లాది చిన్నారుల జీవితాలు మారిపోయాయి.




1988లో గ్లోబల్ పోలియో ఎరాడికేషన్ ఇనిషియేటివ్ స్థాపించ బడింది. ఇందులో ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ), యునిసెఫ్, రోటరీ ఇంటర్నేషనల్, సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (జణజ) వంటి సంస్థలు భాగస్వాములయ్యాయి. ఆ సమయంలో ప్రపంచ వ్యాప్తంగా 125 దేశాలలో 3.5 లక్షలకు పైగా కేసులు నమోదయ్యేవి. కానీ అంతర్జాతీయ స్థాయిలో టీకా కార్యక్రమాలు, ప్రజల్లో అవగాహన, వైద్య సదుపాయాల పెంపు వంటి చర్యలతో పోలియో కేసులు 99 శాతం కంటే ఎక్కువగా తగ్గాయి. భారతదేశం వంటి విస్తృత జనాభా గల దేశంలో పోలియో నిర్మూలన ఒక మహత్తర విజయంగా నిలిచింది. 1995లో ప్రారంభమైన 'పల్స్ పోలియో ప్రోగ్రాం' దేశవ్యాప్తంగా అద్భుత ఫలితాలు ఇచ్చింది. "రెండు చుక్కలు జీవన రక్షణ" అనే నినాదం ప్రతి ఇంటికీ చేరింది. కోటికి పైగా ఆరోగ్య కార్యకర్తలు ప్రతి గ్రామం, ప్రతి బస్తీని చుట్టి పిల్లలకు మౌఖిక పోలియో వ్యాక్సిన్ అందించారు. 2011లో భారతదేశంలో చివరి పోలియో కేసు నమోదైంది. దీని అనంతరం 2014 మార్చి 27న ఔనూ భారతదేశాన్ని పోలియో రహిత దేశంగా అధికారికంగా ప్రకటించింది. అయితే ప్రపంచ వ్యాప్తంగా పోలియో పూర్తిగా నిర్మూలించబడిందని చెప్పడం త్వరిత నిర్ణయం అవుతుంది. ప్రస్తుతం పోలియో వైరస్ స్థానికంగా ఉన్న దేశాలు అఫ్ఘానిస్తాన్, పాకిస్తాన్ మాత్రమే. అయినప్పటికీ వైరస్ ఇంకా సజీవంగా ఉండటం వల్ల, టీకాలు సరిగ్గా అందని ప్రాంతాలకు వ్యాధి మళ్లీ వ్యాపించే ప్రమాదం ఉంది. అందుకే నిరంతర టీకా కార్యక్రమాలు, నిఘా వ్యవస్థలు, పరిశుభ్రత, ప్రజల్లో అవగాహన --- ఇవన్నీ కొనసాగించాల్సిన అత్యవసర చర్యలు. పోలియో నిర్మూలనలో ప్రపంచం సాధించిన పురోగతి నిజంగా ఆశ్చర్యకరమైనది. 1988లో ప్రతి సంవత్సరం 3.5 లక్షల కేసులు నమోదు అయితే, 2024 నాటికి ఈ సంఖ్య కొద్ది డజన్లకు మాత్రమే తగ్గిపోయింది. ఇది వైద్యశాస్త్ర విజయమే కాదు, మానవ సంకల్పానికి నిదర్శనం. ప్రపంచ పోలియో దినోత్సవం మనకు ఒక స్ఫూర్తి సందేశం ఇస్తుంది. ప్రతి బిడ్డకు టీకా అందించేవరకు మన కర్తవ్యము ముగియదు. పోలియో రహిత ప్రపంచం అంటే కేవలం వైద్య విజయం కాదు ---అది మానవ సహకారం, సామాజిక బాధ్యత, సాంకేతికత, నిబద్ధతల సమ్మేళనం. మానవ చరిత్రలో మహమ్మారులను జయించిన ఎన్నో ఘట్టాలు ఉన్నప్పటికీ, పోలియో నిర్మూలన యాత్ర మాత్రం అత్యంత ప్రేరణాత్మకం. ప్రపంచ దేశాల సమిష్టి కృషి, శాస్త్రవేత్తల ప్రతిభ, ఆరోగ్య కార్యకర్తల అంకితభావం, ప్రజల విశ్వాసం --- ఇవన్నీ కలిపి ఒక గొప్ప అద్భుతం సృష్టించాయి.

**-రామ కిష్టయ్య సంగన భట్ల**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్,**
**కాలమిస్ట్ 9440595494**

# సేవా నిరతికి ప్రతిరూపం లక్ష్మీ సెహగల్

**అక్టోబర్ 24... కెప్టెన్ లక్ష్మీ సెహగల్ జయంతి**

కెప్టెన్ లక్ష్మీ సెహగల్ (అక్టోబర్ 24, 1914... జూలై 23, 2012) ప్రముఖ సంఘ సేవకురాలు, రాజ్యసభ సభ్యురాలు. ఆమె భారత రాష్ట్రపతి పదవికి పోటీ చేసిన తొలి మహిళ. ఆమె తండ్రి స్వామినాథన్ మద్రాసులో ప్రముఖ న్యాయవాది. ఆమె బ్రిటిష్ ఇండియాలోని మలబార్, మద్రాస్ ప్రెసిడెన్సీలో 1914 అక్టోబర్ 24న జన్మించారు. ఆమె తండ్రి స్వామి నాథన్, తల్లి అమ్ముకుట్టి/ అమ్ము. తల్లి ఎ.వి. అమ్ము కుట్టి సామాజిక సేవా కార్యకర్త. చిన్నతనం లోనే సెహగల్ విదేశీ వస్తు బహిష్కరణ, మధ్య నిషేధం వంటి జాతీయ పోరాటాలలో పాల్గొన్నారు. 1938 లో మద్రాసు వైద్య కళాశాలలో ఎం.బి., బి.ఎస్. గైనకాలజీ పూర్తయిన తరువాత 1940లో సింగపూర్ వెళ్లడానికి ముందు చెన్నైలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్‌గా పని చేశారు. అక్కడ భారతీయ నిరుపేదల వాడలో వైద్యశాల స్థాపించి, స్థానికంగా ఉన్న భారతీయ కార్మికులకు సేవలందించారు. అక్కడ ఆమె ఉన్న సమయంలో, భారత జాతీయ సైన్యం సభ్యులను కలిసే అవకాశం లభించింది. భారత స్వాతంత్ర్య పోరాటంలో చురుకైన పాత్ర పోషించడం ప్రారంభించారు. ఆమె 1941లో ప్రముఖ స్వాతంత్ర్య సమరయ యోధుడు రాష్ బెహారీ బోస్ ఏర్పాటు చేసిన ఇండియన్ ఇండిపెండెన్స్ లీగ్‌లో చేరారు. 1943 లో సుభాష్ చంద్రబోస్ సింగపూర్ వచ్చినప్పుడు భారత స్వాతంత్ర్యం కోసం పోరాడటానికి ఒక మహిళా రెజిమెంట్ ప్రారంభిం చడం గురించి మాట్లాడారు. ఆ సమయంలో లక్ష్మీ సెహగల్ సుభాష్‌తో సమావేశ మయ్యారు. నేతాజీ నుండి 'రాణి ఆఫ్ ఝాన్సీ' రెజిమెంట్‌ను స్థాపించడానికి ఆదేశాన్ని పొందారు. ఆయన స్థాపించిన ఇండియన్ నేషనల్ ఆర్మీ ఆధ్వర్యంలోని ఝాన్సీ రెజిమెంట్ కు ప్రాతినిధ్యం



వహించారు. అలా ఆమె కెప్టెన్ లక్ష్మిగా మారి సేవలు అందించారు. డాక్టర్‌గా వైద్య సేవలు కూడా అంద జేశారు. ఆమెను 1945 లో బ్రిటిష్ సైన్యం అరెస్టు చేసింది. 1946 వరకు బర్మాలో ఉంచింది. ఆ తర్వాత ఆమెను ఇండియన్ నేషనల్ ఆర్మీ ట్రయల్స్ జరుగుతున్న సమయం లోనే ఇండియాకు పంపించారు. లక్ష్మీ సెహగల్ 1947లో లాహోర్ కు చెందిన కర్నల్ ప్రేమ్ కుమార్ సెహగల్ ను లాహోర్‌లో వివాహం చేసుకొని కాన్పూర్ లో స్థిరపడి కాన్పూర్ ప్రజలకు వైద్య సేవలం దించారు. స్వాతంత్ర్యా నంతరం ఆల్ ఇండియా డెమొక్రటిక్ ఉమెన్స్ అసోషియేషన్ (ఐద్వా) ఉపాధ్యక్షు రాలిగా వివిధ స్థాయిలలో సమాజ సేవకు అంకిత మయ్యారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, 1971లో లక్ష్మీ సెహగల్ కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్)... సిపిఎంలో చేరిన ఆమె జీవితాంతం వరకు క్రియాశీలక సభ్యురాలిగా కొనసాగారు. 1971లో, సీపీఎం పక్షాన లక్ష్మీ సెహగల్ రాజ్యసభ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. బంగ్లాదేశ్ సంక్షోభ సమయంలో, ఆమె బంగ్లాదేశ్ నుండి భారత దేశానికి వచ్చిన శరణార్థుల సంరక్షణలో సహాయ పడ్డారు. 1981లో ఏర్పాటైన ఆల్ ఇండియా డెమొక్రటిక్ ఉమెన్స్ అసోసియేషన్ వ్యవస్థాపకుల్లో ఆమె కూడా ఒకరు. అక్టోబరు శ్రీ984లో, శ్రీమతి ఇందిరా గాంధీ హత్య నేపథ్యంలో నగరంలో సిక్కు వ్యతిరేక అల్లర్లు చెలరేగినప్పుడు, ఆమె సిక్కు కుటుంబాలకు రక్షణగా నిలిచారు. తన ఆసుపత్రి సమీపంలో ఉన్న దుకాణాలకు, దుకాణదారులకు హాని జరగనివ్వలేదు.

1984 లో, గ్యాస్ విషాదం తర్వాత ఆమె వైద్య బృందంతో భోపాల్‌కు వెళ్లి సేవలు అందించారు.

1998లో ఆమెకు పద్మ విభూషణ్ పురస్కారం ప్రదానం చేయబడింది. 2002 లో జరిగిన రాష్ట్రపతి ఎన్నికల్లో ఎపిజె అబ్దుల్ కలాంకు వ్యతి రేకంగా వామపక్షాల మద్దతుతో వామపక్షాల అభ్యర్థిగా బరిలోకి దిగారు. అయితే కలాం ఎన్నికల్లో విజయం సాధించారు. సామ్యవాదం, సామ్రాజ్య వాద వ్యతిరేకత, సమానత్వం, లౌకికవాదం, సామాజిక న్యాయం, మహిళా సాధికారత వంటి ఆదర్శాలకు ఆమె జీవితాంతం కట్టుబడి ఉన్నారు. 97 సంవత్సరాల వయసులో లక్ష్మీ సెహగల్ 2012, జూలై 23న కాన్పూర్‌లో మరణించారు. ఆమె మృతదేహాన్ని కాన్పూర్ మెడికల్ కాలేజీకి దానం చేశారు.

**-రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్**
**ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

# మరో ప్రపంచ యుద్ధాన్ని ఐరాస ఆపగలదా?

- **మరో ప్రపంచ యుద్ధాన్ని ఐరాస నివారించాలి**
- **అక్టోబర్ 24 ఐక్యరాజ్య సమితి దినోత్సవం**

ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ చట్టం, భద్రత, ఆర్థిక అభివృద్ధి, సామాజిక అభివృద్ధి , మానవ హక్కులపై సమష్టి కృషి చేసేందుకు ప్రపంచ దేశాలు ఏర్పాటు చేసుకున్న ఒక అంతర్జాతీయ సంస్థ. 20వ శతాబ్దం మానవాళిని అతలాకుతలం చేసింది. 1930 నాటి మహామాంద్యం వల్ల ఐరోపాలో నియంతలు అధికార పీఠాలు అధిరోహించారు. ఆపై సంభవించిన రెండో ప్రపంచ యుద్ధం, మానవాళి చరిత్రనే రక్తాక్షరాలతో లిఖించింది. అలాంటి పరిస్థితుల్లో ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఒక బహుముఖీన అంతర్జాతీయ సంస్థ అవసరమని ప్రపంచ నాయకులు భావించారు. ఆ భావనకు ఒక రూపం కల్పించారు. తరవాత అదే ఐక్యరాజ్య సమితిగా ఆవిర్భ వించింది. నానాజాతి సమితి (లీగ్ ఆఫ్ నేషన్స్) రెండవ ప్రపంచ యుద్ధాన్ని నివారించుటలో విఫల మగుటచే దానికి ప్రత్యామ్నా యంగా 1945లో ఐక్యరాజ్య సమితి స్థాపించ బడింది. ప్రతి సభ్య దేశమూ ఐ.రా.స.



సాధారణ సభలో సభ్యత్వం కలిగి ఉంటుంది. ఐ.రా.స. చార్టర్ 2వ ఛాప్టర్ 4వ ఆర్టికిల్ ప్రకారం ఏదైనా దేశానికి ఐ.రా.స. సభ్యత్వం రావాలంటే ఐ.రా.స. భద్రతా సభ ఆమోదంపై, ఐ.రా.స. సాధారణ సభ తీర్మానం జరగాలి. నియమాల ప్రకారం సంపూర్ణ స్వాధిపత్యం ఉన్న దేశాలు మాత్రమే సభ్యత్వానికి అర్హత కలిగి ఉంటాయి. కాని ఐ.రా.స. ఏర్పాటు సమయంలో చేరిన నాలుగు ఆరంభ సభ్య దేశాలకు (బెలారస్, భారత దేశం, ఫిలిప్పీన్స్, ఉక్రెయిన్) అప్పటికి సంపూర్ణ స్వాతంత్ర్యం లేదు. అంతే కాకుండా భద్రతా సభ ఆమోదం ఉండాలన్న నిబంధన కారణంగా మాంటివిడియో కన్వెన్షన్ ప్రకారం స్వాధిపత్యం కలిగిన కొన్న దేశాలు కూడా, మరి కొన్ని ఐ.రా.స. సభ్య దేశాలు వ్యతిరేకించిన కారణంగా ఐ.రా.స. సభ్యత్వం కలిగి లేవు. 1945లో ఐ.రా.స. ఏర్పడినప్పుడు 51మంది సభ్య దేశాలున్నాయి. వాటిలో 49 దేశాలు ఇప్పటికీ సభ్యులుగా ఉన్నాయి. లేదా వారి సభ్యత్వం వేరే దేశాలకు సంక్రమిం చింది. ఉదాహరణకు సోవియట్ యూనియన్ సభ్యత్వం రష్యాకు సంక్రమించింది. ప్రస్తుతము 193 దేశాలు ఐక్యరాజ్య సమితిలో సభ్య దేశాలుగా ఉన్నాయి. ఐక్యరాజ్య సమితిలో ప్రధానంగా 6 అంగాలు ఉన్నాయి. సర్వప్రతినిధి సభలో ఐక్యరాజ్య సమితిలో ప్రవేశించిన అన్ని దేశాలకు సభ్యత్వం ఉండగా, భద్రతా మండలిలో 15 దేశాలకు మాత్రమే సభ్యత్వం ఉంటుంది. అందులో 10 దేశాలు రెండేళ్ళ కోసారి ఎన్నిక ద్వారా సభ్యత్వం పొందగా, మరో 5 దేశాలు శాశ్వత సభ్య దేశాలు. అవి: అమెరికా, రష్యా, బ్రిటన్, చైనా, ఫ్రాన్స్. ప్రధాన కార్యాలయం న్యూయార్క్ నగరంలో ఉంది. దీని ప్రస్తుత ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుట్టెర్స్. ఐక్యరాజ్య సమితి స్థాపించబడిన అక్టోబరు 24వ తేదీని ప్రతి సంవత్సరం ఐక్యరాజ్య సమితి దినోత్సవంగా పాటిస్తారు. రెండవ ప్రపంచ యుద్ధం జరుగు తున్న సమయంలోనే 1941 ఆగస్టులో అమెరికా అధ్యక్షుడు థియోడార్ రూజ్‌వెల్ట్ , బ్రిటిష్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ అట్లాంటిక్ సముద్రంలో ఒక ఓడలో సమావే శమై కుదుర్చుకొన్న ఒప్పందాన్ని అట్లాంటిక్ ఛార్టర్ అంటారు. ప్రాదేశిక సమగ్రత కాపాడడం, యుద్ధభయాన్ని తొలగించడం, శాంతిని నెలకొల్పడం, నిరాయుధీ కరణ వంటి ఎనిమిది అంశాలు ఈ ఒప్పందంలో ఉన్నాయి. ఈ ఒప్పందమే తరువాత ఐక్య రాజ్య సమితి సిద్ధాంతాలకు మౌలిక సూత్రాలుగా గుర్తింపు పొందినది. శాన్ ఫ్రాన్సిస్కో నగరంలో 1945 ఏప్రిల్ 25నుండి జూన్ 26 వరకు జరిగిన అంతర్జాతీయ సమా వేశంలో 51 దేశాల ప్రతినిధులు పాల్గొని ఐక్య రాజ్య సమితి ఛార్టర్‌పై సంతకాలు చేశారు. 1945 అక్టోబరు 24న న్యూయార్క్ నగరంలో ఐక్య రాజ్య సమితి లాంఛనంగా ప్రారంభ మైంది. యుద్ధాలు జరగకుండా చూడటం, అంతర్జా తీయ తగాదాలను శాంతి యుతంగా పరిష్కరించడం, దేశాల మధ్య స్నేహ సంబంధాలను పెంపొందించడం, అంతర్జాతీయ బాధ్యతలను అన్ని దేశాలు గౌరవించేటట్లు చేయడం, సాంఘిక అభివృద్ధి సాధించి, మానవ జీవితాలను సుఖమయం చేయడం తదితరాలు సమితి ఆశయాలు. అప్పటి అమెరికా అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ 'యునైటెడ్ నేషన్స్' అనే పదాన్ని తొలిసారి ప్రవేశ పెట్టాడు. ఐరాస పతాకాన్ని 1947 అక్టోబరు 20న ఆమోదించారు. ఈ పతాకం లేత నీలం, తెలుపు రంగుల్లో ఉంటుంది. పతాకం మధ్యలో ఐరాస చిహ్నమైన ప్రపంచ పటం రెండు ఆలివ్ కొమ్మల మధ్య ఉంటుంది. ఆలివ్ కొమ్మలు శాంతికి చిహ్నం. ఐరాసకు ఆరు అధికారిక భాషలున్నాయి అవి చైనీస్, ఇంగ్లిష్, ఫ్రెంచ్, రష్యన్, స్పానిష్, అరబిక్. ఐక్యరాజ్య సమితికి 6 ప్రధానాంగాలు ఉన్నాయి.

**సర్వ ప్రతినిధి సభ :** సభలో సభ్యదేశాలన్నింటికీ ప్రాతినిధ్యం ఉంటుంది. ప్రతి దేశానికి సమానంగా ఒక్క ఓటు ఉంటుంది. సమావేశాలకు ప్రతి సభ్యదేశం గరిష్ఠంగా 5 గురు సభ్యులను పంపవచ్చు. ఈ సభ సంవత్సరానికి ఒక పర్యాయం, సాధారణంగా సెప్టెంబరు మాసంలో, సమావేశ మౌతుంది.

**భద్రతా మండలి:** సమితి ప్రారంభమయ్యేనాటికి ఇందులో సభ్యదేశాల సంఖ్య 11. ప్రస్తుతం 15 సభ్యదేశాలు ఉన్నాయి. అందులో 5 శాశ్వత సభ్యదేశాలు కాగా 10 రెండేళ్ళ కాలవ్యవధి కొరకు ఎన్నిక కాబడు తాత్కాలిక సభ్యదేశాలు. అమెరి కా, రష్యా, ఇంగ్లాండు, చైనా, ఫ్రాన్సులు ఇందులో శాశ్వత సభ్యదేశాలు. ఈ శాశ్వత సభ్యదేశాలకు వీటో అధికారం కూడా ఉంది. **సచివాలయం:** ఇది ఐ.రా.స. వ్యవహారాలు నిర్వహించే కార్యనిర్వాహక విభాగం. దీని ప్రధాన కార్యాలయం న్యూయార్క్ నగరంలో ఉంది. ఇందులో పది వేలకు పైగా ఉద్యోగులు పనిచేస్తారు. సచివాలయానికి ప్రధానాధికారిని సెక్రటరీ జనరల్ అంటారు. ధర్మకర్తృత్వ మండలి: కొన్ని పాశ్చాత్య దేశాల వలస పాలన క్రింద కొనసాగిన భూభాగాల ప్రయోజనాలను కాపాడడం ఈ మండలి లక్ష్యం. ఇక్కడి ప్రజలను స్వీయ ప్రతిపత్తికి లేదా స్వయం పాలనకు లేదా స్వాతంత్ర్యానికి సిద్ధం చేయడం ఈ మండలి బాధ్యత.

**ఆర్థిక, సాంఘిక మండలి:** ఇది సాధారణ సభ అధ్వర్యంలో పనిచేస్తుంది. ఇందులో 54 మంది సభ్యులుంటారు. ప్రజల జీవన స్థాయిని మెరుగు పరచడం, విద్య, సాంస్కృతిక, ఆరోగ్య రంగాలలో అంతర్జాతీయ సహకారానికి కృషి చేయడం, మానవ హక్కులను సమర్ధించడం వంటివి ఆశయాలు.

**అంతర్జాతీయ న్యాయస్థానం:** ఇది "ప్రపంచ న్యాయస్థానం"గా పిలువ బడుతుంది. ఐక్యరాజ్యసమితి యొక్క ప్రాథమిక తీర్పులను ప్రకటించే అంగము. దీని కేంద్రం నెదర్లాండ్ లోని హేగ్ నగరంలోగల, శాంతి సౌధంలో యున్నది. అంతర్జాతీయ న్యాయస్థానంలో న్యాయమూర్తి పదవిని నలుగురు భారతీయులు చేపట్టారు.

1.బెనగళ్ నరసింగరావు, 2. కె.నాగేంద్రసింగ్, . రఘునందన్ స్వరూప్ పాఠక్, 4. దల్వీర్ భండారీ

**-రామ కిష్టయ్య సంగన భట్ల**
**9440595494**

# రైతులే శాస్త్రవేత్తలుగా మారాలి

### ఇబ్రహీంపట్నం ఏడిఏ శశిధర్ రెడ్డి



**మంచాల వెలుతురు అక్టోబర్ 23:** మంచాల మండలం నోముల గ్రామ పరిధిలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా రైతులకు అవ గాహన సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ఇబ్రహీంపట్నం ఏ డిఏ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు సమగ్ర వ్యవసాయ మెలకువలు పాటించాలని రైతుల శాస్త్రవేత్తలుగా మారాలని కోరారు. ప్రతి రైతు తమపొలానికి వెళ్ళినప్పుడు నిశితంగా పరిశీలించి పోషక లోపల క్షణాలు పురుగు నష్టపరిచే లక్షణాలు గుర్తించాలన్నారు రోగాలను కలిగించే కార కాలను ముందస్తుగా గుర్తించి వాటికి నివారకచర్యలు చేపట్టాలన్నారు ప్రస్తుతం వరి పంట గింజ పాలు పోసుకునే దశ నుండి కోత దశలో ఉంది ఈదశలో వచ్చే కంకినల్లి సుడిదోమ అగ్గితెగులు ల క్షణాలు నివారక చర్యలను వివరించారు తెగుళ్ల నివారణకు విత్తనశుద్ధి ముఖ్యమనివిత్తనా లు ఎంపిక చేసుకున్నప్పుడు విత్తన శుద్ధి ప్రతిరైతు చేసుకోవాలని కోరారు ప్రత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించబడ్డాయని ప్రత్తి అమ్మేరైతులు కపాస్ కిసాన్ యాప్ ద్వారా జిల్లాలోని ఏసిసి సెంటర్లో అయిన స్లాట్ బుక్ చేసుకొని అమ్ముకోవచ్చు అని తెలిపారు ఎల్ నినో ప్రభావం రబీలో తీవ్రస్థాయిలో ఉండే అవకాశం ఉన్నందున రైతులందరూ తప్పకుండా ఆరుతడి పంటలు వేసు కోవాలని కోరారు ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకటేష్ విస్తరణ అధికారి సాయి సిరి, రైతులు తదితరులు పాల్గొన్నారు

# వేణుగోపాల స్వామి భజన మండలి దుర్గమాత శోభా యాత్ర





**మంచాల వెలుతురుఅక్టోబర్ 23:** మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వేణుగోపాల స్వా మి భజన మండలి ఆధ్వర్యంలో ప్రతిష్టించిన దుర్గామాత శోభయాత్ర సందర్భంగా తొమ్మిది రోజులు పూజలు అందుకున్న దుర్గమాత ముక్కుపుడక చేరే కలశం వేలంపాట జరిగింది ఈ వేలంపాటలో అమ్మవారి ముక్కుపుడక 2 లక్షల రూపాయలకు దక్కించుకున్న సాతిరి పరమేష్ అమ్మవారి పెద్దచీర తవిటి యాదగిరి ముదిరాజ్ 38వేల రూపాయలకు దక్కించుకున్నారు అ మ్మవారి కుంకుమార్చన చీర 45వేల రూపాయలకు దక్కించుకున్న గోనిశెట్టి అక్షయ్ అమ్మవారి కలశం 51వేయి రూపాయలకు దక్కించుకున్న సిద్దగోని యాదయ్య



గౌడ్ అనంతరం అమ్మవారి కి ప్రత్యేక పూజలు చేసిన ఆరుట్ల గ్రామసర్పంచ్ మానిపాటి శోభాకు మార్ ఉపసర్పంచ్ నూకం రాజు ముదిరాజ్ మంచాల సహకార సంఘం మాజీ చైర్మన్ మొద్దు సికిందర్ రెడ్డి మాజీ ఎంపిటి సి చీరాల రమేష్ ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరిఎల్లేష్ వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ గ్రామపంచాయతీ పాలక మండలి సభ్యులు గ్రామ పెద్దలు వివిధ కులసంఘాల పెద్ద లు అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి శోభాయాత్ర ప్రారంభించారు అనంత రం మహిళల బతుకమ్మ ఆటలతో చిన్నారుల నృత్యాలతో వీధి బాగోతాలకళాకారు తోయువకుల డిజె డ్యా న్సులతో. వివిధ కళాకారుల డిజె డ్యాన్సులతోదుర్గాదేవి శోభయాత్ర అంగరంగ వైభవంగా పెద్ద ఎత్తున ఘనంగా నిర్వహించారు ఈ శోభాయాత్ర కార్యక్రమానికి



గ్రామంలోని పెద్దలు వివిధ పా ర్టీల నాయకులు కులసంఘాల పెద్దలు పెద్దఎత్తున హాజరై అమ్మవారి శోభయాత్ర ఘనంగానిర్వహించి విజయవంతం చేశారు

# రైతులకు పీఏసీఎస్ భరోసా..

### పంట, దీర్ఘకాలిక రుణాల మంజూరుకు తీర్మానం



**శంకర్ పల్లి, వెలుతురు అక్టోబర్ 23 :** రైతు సంక్షేమమే ధ్యేయం అని ప్రాథమిక వ్యవసాయ పిఏసిఎస్ అధ్యక్షులు బొల్లారం వెంకటరెడ్డి అన్నారు. సహకార పరపతి సంఘం పాలకవర్గ సమావేశం శుక్రవారం ఆయన అధ్యక్షతన అత్యంత ప్రాముఖ్యంగా నిర్వహించారు. ఈ సమావేశంలో రైతులకు అండగా నిలిచేలా, వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడేలా పలు కీలక నిర్ణయాలు తీసుకుంటూ తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందించడానికి పీఏసీఎస్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో అర్హులైన ప్రతి రైతుకూ కింది రుణ సదుపాయాలు కల్పించాలని బోర్డు ఏకగ్రీవంగా నిర్ణయించిందని ఆయన తెలిపారు. సాగు అవసరాల కోసం రైతులకు సకాలంలో పంట రుణాలు మంజూరు చేయడం, దీర్ఘకాలిక రుణాలు: వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధి కొరకు దీర్ఘకాలిక రుణ సదుపాయం కల్పించడం, తక్కువ వడ్డీకే బంగారు నగలపై (గోల్డ్ లోన్స్) రుణాలు ఇవ్వడం, రైతులు తీసుకున్న పంట రుణాలను సకాలంలో రెన్యువల్ చేసుకునేలా అవగాహన కల్పించి, ప్రక్రియను వేగవంతం చేస్తామని తీర్మానంలో పేర్కొన్నట్టు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ పార్శి బాల కృష్ణ, సెక్రటరీ రాం రెడ్డి, పాలకవర్గ సభ్యులు మాణిక్యరెడ్డి, జనార్ధన్ రెడ్డి, ఇందిరమ్మ, శ్రీనివాస్ రెడ్డి, లచ్చి రెడ్డి, మల్లిఖార్జున్, ప్రశాంత్ రెడ్డి, సామయ్య, శంకర్, చంద్రకళ, మరియు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- **ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో భద్రతా చర్యలు చేపట్టాలి**
- **జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి**



**రంగారెడ్డి జిల్లా వెలుతురు అక్టోబర్ 23:** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ప్రజల్లో అవగాహన పెంపొందించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కె. కిరణ్మయి తెలిపారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కె.కిరణ్మయి ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలు, భద్రతా ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాల వివరాలను పరిశీలించి, ప్రమాదాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.

ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్, మున్సిపల్, జాతీయ రహదారులు, రోడ్లు భవనాల శాఖ, రవాణా, ట్రాఫిక్, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి, అక్కడ అవసరమైన రహదారి భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ సక్రమంగా పనిచేసేలా ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని, అవసరమైన చోట అదనపు భద్రతా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన పనులను గుర్తించి ప్రతిపాదనలు సమర్పిస్తే, నిబంధనల మేరకు అనుమతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలకు అతివేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం ప్రధాన కారణాలని ఆమె తెలిపారు. వాహనదారులు అనుమతించిన వేగ పరిమితిలోనే వాహనాలు నడపాలని, రాంగ్ రూట్‌లో ప్రయాణించడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. రక్షణాత్మక డ్రైవింగ్ (డిఫెన్సివ్ డ్రైవింగ్) అలవర్చుకోవాలని, వాహనం నడిపేటప్పుడు పరిసరాలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండటం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. రోడ్డు భద్రతపై పాఠశాల విద్యార్థులు, కళాశాల యువతకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. పాదచారులు రోడ్డు దాటేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని, వాహనదారులు పాదచారుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ ఏడాది జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకొని, ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. రంగారెడ్డి జిల్లాను రోడ్డు ప్రమాదాలు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. ఈ సమావేశంలో రోడ్లు భవనాల శాఖ, రవాణా శాఖ, జాతీయ రహదారుల శాఖ, పోలీస్, ట్రాఫిక్, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ఆరుతడి పంటలకే ప్రాధాన్యత

ఆరుతడి పంటలకే ప్రాధాన్యత ఇవ్వాలి అని పాలకుర్తి వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ అన్నారు. ప్రస్తుతం ఎల్-నినో ప్రభావం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయి, రాబోయే యాసంగి (రబి) సీజన్ లో తీవ్ర నీటి కొరత ఏర్పడే అవకాశం ఉంది అని తెలిపారు. పాలకుర్తిమండలంలోని కన్నాల గ్రామ శివారులోని రైతు పుప్పాల దయానంద్ కు చెందిన పామాయిల్ తోటను మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్, ఉద్యాన విస్తరణ అధికారి బోడుకల రాము సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అధిక నీరు అవసరమయ్యే వరి పంట సాగును తగ్గించి, అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. వరి సాగుకు వినియోగించే నీటితో ఇతర ప్రత్యామ్నాయ పంటలైన ఆయిల్ పామ్, కూరగాయలు, అపరాల పంటలైన పెసర, మినుము, బబ్బెర, ఉలవలు, నూనెగింజల పంటలైన నువ్వులు, వేరుశనగ, పొద్దుతిరుగుడు, కుసుమ వంటి పంటలను సాగు చేసుకోవాలని తెలిపారు. నీటిని పొదుపుగా వినియోగించేందుకు బిందు సేద్యం, తుంపర సేద్యం పద్ధతులను పాటించాలని, ఇంకుడు గుంతలను నిర్మించడం ద్వారా భూగర్భ జలాల పెంపునకు కృషి చేయాలని సూచించారు. అలాగే రాబోయే కాలంలో పశుగ్రాస కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున, రైతులు వానాకాలం వరి పంట కోత అనంతరం వరి గడ్డిని తగలబెట్టకుండా గడ్డి చుట్టలుగా కట్టి నిల్వ చేసుకోవాలని సూచించారు. పచ్చి పశుగ్రాసం కోసం జొన్న, సూపర్ నేపియర్, హెడ్జ్ లూసర్న్, బర్సీమ్, అలసంద, మొక్కజొన్న వంటి పశుగ్రాస పంటలను సాగు చేసుకోవాలని తెలిపారు. రాబోయే రోజుల్లో నీటి కొరతను దృష్టిలో ఉంచుకొని ఉద్యానవన శాఖ నుండి రాయితీపై బిందు సేద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయని, కావలసిన రైతులు హెచ్ ఈ ఓ కు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు

# హుస్నాబాద్ మండల స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

### మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్




హుస్నాబాద్ పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన హుస్నాబాద్ మండల స్థాయి బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశానికి హుస్నాబాద్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్ హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పార్టీ సంస్థాగత బలోపేతం, గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేయడం, పార్టీ నాయకులు మరియు కార్యకర్తల మధ్య సమన్వయాన్ని పెంపొందించడం వంటి అంశాలపై చర్చించారు. బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేయాలని సతీష్ కుమార్ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతిని ధులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామశాఖ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ హుస్నాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో హుస్నాబాద్ మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రమణీయ శ్రీ మాళ మల్లేశ్వరుని రథోత్సవం



మండల పరిధిలో దేవరగట్టు కొండ గుహలో 800 అడుగుల ఎత్తుల్లో స్వయంభువుగా వెలసిన శ్రీ మాళ సహిత మల్లేశ్వర స్వామి రథోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ముందుగా ఉదయం నుంచి స్వామివారి సన్నిధిలో జలాభిషేకం, రుద్రాభిషేకం, బండరార్చన, బిల్వార్చన, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ వంటి విశేష పూజలు నిర్వహించి పెద్ద ఎత్తున పూలమలలతో స్వామివారిని అలంకరించారు. అలాగే సాయంత్రం బిలెహల్ గ్రామం నుంచి మేటి కుంభాన్ని సకల వాయిద్యాల నడుమ ఊరేగింపుగా దేవరగట్టుకు చేరుకున్నారు. అనంతరం రథోత్సవానికి విశేష పూజలు అందించారు. అదేవిధంగా రథోత్సవం అశేష భక్తుల జయ జయ ధ్వనులు, గొరవయ్యల ఢమరుక నాదం, సకల వాయిద్యాల నడుమ స్వామి వారి రథోత్సవం రమణీయంగా ముందుకు సాగింది. రథోత్సవంల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆలూరు సిఐ రవిశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో హోళగుంద ఎస్ఐ దిలీప్ కుమార్ మరియు పోలీస్ సిబ్బందితో కలిసి గట్టి బందోబస్తు నిర్వహించారు.



# గిరిజన ప్రాంతాలలో అభివృద్ధి పనులు

గిరిజన ప్రాంతాలలో అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా అటవీ శాఖాధికారి వికాస్ మీనా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజన ప్రాంతాలలో సోలార్ లైట్ల ఏర్పాటు, బోర్ల తవ్వకం, రహదారుల నిర్మాణం తదితర అభివృద్ధి పనులకు అవసరమైన అటవీ శాఖ అనుమతులపై చర్చించారు. పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని, అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి అనుమతుల కోసం పూర్తి వివరాలతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# మందమర్రి ఆయుష్మాన్ ఆరోగ్య ఉపకేంద్రమును అకస్మిక తనిఖీ



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్, ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్ తో కలిసి మందమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఊరు మందమర్రి ఆయుష్మాన్ ఆరోగ్య ఉపకేంద్రమును అకస్మికంగా సందర్శించి వైద్యాధికారికి వైద్యులకు సిబ్బందికి తగు సూచనలు ఆదేశాలు ఇవ్వడం జరిగినది జిల్లాలో క్యాచప్ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో ఈరోజు నుండి 31 తేదీ వరకు వ్యాక్సినేషన్ కార్యక్రమంలో భాగంగా పిల్లలందరికీ టీకాలు ఇప్పించడంలో భాగంగా కొత్తగా వచ్చిన పిల్లలు గానీ తప్పిపోయిన పిల్లలు కానీ వ్యాక్సినేషన్ ఇప్పించడం జరుగుతుంది. జిల్లాలోని అన్ని ఉపకేంద్రముల పరిధిలోని ఆరోగ్య కార్యకర్తల ద్వారా ఈ కార్యక్రమాన్ని చేపట్టుతున్నట్టు తెలియజేయడం జరిగినది ముఖ్యంగా వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించడము ఇవి పిల్లలకు ఆరోగ్య వరాలు ఇందులో భాగంగా జిల్లాలోని పిల్లలందరికీ వాక్సినేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేయడానికి చర్యలు చేపట్టడం జరుగుతుంది కావున ఆరోగ్య కార్యకర్తలు తమ పరిధిలోని పిల్లల వివరములను దగ్గర ఉంచుకొని వాక్సినేషన్ చేయాలని వ్యాక్సినేషన్ను సరైన రీతిలో సరైన పద్ధతిలో చేయాలని ఆదేశించినారు అదేవిధంగా కుష్టు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా సర్వే కార్యక్రమంలో ఉదయం సందర్శించి వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమంలో ముమ్మరంగా పాల్గొనాలని ఆదేశించినారు అదేవిధంగా వాతావరణ మార్పులతో వచ్చే వ్యాధులు దగ్గు జలుబు జ్వరము వైరల్ జ్వరాలు కీటకజనిత వ్యాధులు దోమల ద్వారా వచ్చే వ్యాధులు మలేరియా డెంగ్యూ చికెన్ గునియా లాంటివి ప్రబలకుండా చర్యలు చేపట్టాలని స్థానిక సర్పంచులు గ్రామపంచాయతీ సహకారంతో మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ సిబ్బంది కార్పోరేటర్లు సహాయంతో పరిసరాల పరిశుభ్రత చేయించాలని కోరినారు అదేవిధంగా మనమందరము వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలి గోరువెచ్చని నీటిని త్రాగడం వల్ల జలుబు దగ్గును దూరం చేయవచ్చును ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు సమయపాలన పాటిస్తూ అందుబాటులో ఉండాలని ఆదేశించినారు ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యులు డాక్టర్ లక్ష్మీప్రసన్న జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ సిహెచ్ వోలు నామదేవ్ పుట్ట సత్తయ్య శ్రీనివాస్ అల్లాడి శ్రీనివాస్ విజయ ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు ఊరు మందమరి ఉప కేంద్రంలో అందించిన వైద్య సేవలను పరిశీలించడం జరిగినది అదేవిధంగా అంగన్వాడీ కేంద్రంలో గర్భవతులకు పిల్లలకు అందిస్తున్న పౌష్టికారాన్ని పరిశీలించడం జరిగినది. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఉపకేంద్రం పరిధిలో శుభ్రత పాటించాలని ఆదేశించినారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నమోదు చేస్తున్న వివరములను పరిశీలించి తగు సూచనలు ఇవ్వడం జరిగినది జిల్లాలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు సమయపాలన పాటించాలని సమన్వయంతో వైద్య ఆరోగ్య సేవలు అందించాలని ఆదేశించినారు.

# స్పెషల్ ప్రొడక్షన్ ఫోర్స్ సేవలు అభినందనీయం



, అమీన్ పూర్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలకు పటిష్టమైన రక్షణ భద్రత కల్పించడంలో తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (టీజీఎస్పీఎఫ్)సేవలు మరువలేని అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. శుక్రవారం అమీన్పూర్ లోని టీజీఎస్పీఎఫ్ సెక్యూరిటీ అకాడమీ లో నిర్వహించిన 36వ రైజింగ్ పరేడ్ డే కు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, డీజీ స్వాతి లక్రాలు పాల్గొన్నారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. 67వ ప్రభుత్వ సంస్థలకు భద్రత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకి చెందిన 67 మంది 67 సంస్థల్లో రెండు వేల మంది పైగా టీజీఎస్పీఎఫ్ సిబ్బంది భద్రత సేవలను అందిస్తున్నారని పేర్కొన్నారు. గత 35 ఏళ్ల భద్రత రంగంలో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయని పేర్కొన్నారు. కృత్రిమ మేధ ఏఐ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నట్లు వివరించారు. సమాజానికి టీజీఎస్పీఎఫ్ భద్రత కల్పించడంలో ప్రత్యేకమైన పాత్ర పోషిస్తుందని, అందుకు వారికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తున్నానని పేర్కొన్నారు. దేశానికి రాష్ట్రానికి భద్రత కల్పిస్తున్న సిబ్బందికి వారి వెంట ఉండి అందిస్తున్న కుటుంబ సభ్యుల ప్రోత్సాహం మనోధైర్యం ఎంతో కీలకమని అన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తున్న సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యుల సేవలను కూడా గుర్తించాలని, ఆధునిక ఆయుధాలు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ఆలోచనాత్మక విధానాలు అవలంబిస్తూ భద్రత వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిజిఎస్పిఎఫ్ ఉన్నతాధికారులు సిబ్బంది శిక్షణ పొందుతున్న సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కిశోర బాలికలకు అక్రమ రవాణా పై అవగాహన



గుండాల మండలనీ కాచన పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని జగ్గు తండా గ్రామం అంగన్వాడి లో కిశోర బాలికలకు అంగన్వాడీ టీచర్స్ జరుపుల నీలిమ, కుంజ మంజుల వివిధ అంశాల పైన అవగాహన కల్పించారు ముఖ్యంగా తెలియని వ్యక్తులు ఇచ్చిన ఆహార పదార్థాలు తినవద్దని వారితో సంభాషించకూడదని ఆధార్, మొబైల్ నంబర్లను మన వ్యక్తిగత వివరాలను వారికి ఇవ్వకూడదని అపరిచితులతో మేలుకోగా జాగ్రత్తగా ఉండాలని సైబర్ నేరా ల పట్ల జాగ్రత్తగా ఉండాలని పాఠశాల వివరాలు చదువుకునే స్థల వివరాలు పరిచయం లేనటువంటి వ్యక్తులకు తెలియజేయకూడదని కిశోర బాలికలు వ్యక్తిగత శుభ్రత పాటించాలని 18 సంవత్సరాలు నిండిన తరువాత మాత్రమే వివాహం చేసుకోవాలని చదువు పైన ఎక్కువ శ్రద్ధ చూపించాలని జీవితంలో స్థిరపడే విధంగా ఉపయోగకరమైనటువంటి విద్యను అభ్యసించాలని కష్టపడి చదివితే జీవితంలో కచ్చితంగా స్థిర పడతారని రోజురోజుకు బాలికల పైన అత్యాచారాలు, హత్యలు అక్రమ రవాణా, సైబర్ నేరాలు జరుగుతున్నందున ఒంటరిగా ఉన్న సమయంలో కూడా మెలకువగా జాగ్రత్తగా ఉండాలని ఎవరి మీదనైనా అనుమానం కలిగితే వెంటనే పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేయాలని పలు అంశాలపై వారికి తగిన అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో జగ్గు తండా పాఠశాల ఉపాధ్యాయులు బానోత్ రవి, భూక్య శ్రీను అంగన్వాడీ సిబ్బంది ఇస్లావత్ బు లి బానోత్ చాందిని మరియు కిశోర బాలికలు అందరూ పాల్గొన్నారు.

# తుమ్మనపల్లిలో భూభారతి రీ-సర్వేపై అవగాహన సదస్సు

మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలో భూభారతి రీ-సర్వేపై శుక్రవారం ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఏడీ కిషన్ రావు, ఆర్డీవో జలకుమారి రీ-సర్వే ప్రక్రియ, దానికి సంబంధించిన నిబంధనలు, భూముల వివరాల నమోదు తదితర అంశాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు .భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడంతో పాటు భూ రికార్డుల్లో ఉన్న లోపాలను గుర్తించేందుకు రీ-సర్వే ఉపయోగపడుతుందని అధికారులు వివరించారు. భూముల సర్వే సమయంలో రైతులు, భూయజమానులు తమ భూములకు సంబంధించిన పత్రాలు, వివరాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రీ-సర్వే ప్రక్రియపై ప్రజలకు అవగాహన కలిగి ఉండటం ద్వారా భవిష్యత్తులో భూ వివాదాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. భూభారతి రీ-సర్వేకు సంబంధించి గ్రామస్థులకు ఉన్న సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు. ఈ సదస్సులో తహశీల్దార్ నరేందర్, సర్పంచులు మాధవి, విజయ, పంచాయతీ కార్యదర్శి బుర్ర విజయ్ కుమార్, జీపీవో అనూష తదితరులు పాల్గొన్నారు.

## దుర్గా యూత్ అసోసియేషన్ సభ్యులకు ఘన సన్మానం





**జనగాం వెలుతురు అక్టోబర్ 23:**
నారాయణపురం మండలం జనగాం గ్రామంలో దుర్గా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 30వ వార్షిక దేవి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని, గ్రామ పెద్దలు, ప్రముఖ టీఆర్ఎస్ నాయకులు బెల్లంకొండ నర్సింహా గౌడ్ దంపతులు దుర్గా యూత్ అసోసియేషన్ సభ్యులను ఘనంగా సన్మానించారు. గత 30 సంవత్సరాలుగా గ్రామంలో దేవి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ, గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించడంలో దుర్గా యూత్ అసోసియేషన్ సభ్యులు చేస్తున్న సేవలను ఈ సందర్భంగా వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో దుర్గా యూత్ అసోసియేషన్ సభ్యులు నేపతి శ్రీనివాసులు, బొంగు రఘు గౌడ్, సుభాష్ రెడ్డి, బొడపట్ల భాస్కర్ రెడ్డి, తండ నర్సింహా గౌడ్, వెన్ రెడ్డి రమేష్, గుంటోజు తోటయ్య చారి, గజవెల్లి భాస్కర్ గుప్తా, సుధాకర్ గుప్తా, రవి గుప్తా, మాజీ ఉపసర్పంచ్ బెలిద చంద్రశేఖర్ గుప్తా, తండ శ్రీనివాసులు గౌడ్, నోముల వెంకట్ రెడ్డి, పాత్రికేయులు తడకమల శ్రీధర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రామ పెద్దలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఖ

## డిండి ప్రాజెక్టుకు ఏదుల రిజర్వాయర్ నుండి నీళ్లు ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయం పట్ల హర్షం

### కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జక్కలి ఐలయ్య యాదవ్

**నారాయణపురం వెలుతురు అక్టోబర్ 23:**



డిండి ఎత్తిపోతల ప్రాజెక్టు కు ఏదుల రిజర్వాయర్ నుండి నీళ్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం పట్ల కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జక్కలి ఐలయ్యా యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. పాలమూరు జిల్లా వాసులు డిండి ప్రాజెక్టుపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలతో మునుగోడు దేవరకొండ నియోజకవర్గ ప్రజలు ఫ్లోరోసిస్ బాధితులు ఎంతో ఆందోళన చెందారని తెలిపారు. సాగు నీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన సమీక్ష సమావేశంలో గతంలో క్యాబినెట్ లో చేసిన తీర్మానం అనుగుణంగా పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులోని ఏదుల రిజర్వాయర్ నుంచి డిండి ఎత్తిపోతల ప్రాజెక్టుకు 0.5 టిఎంసి చొప్పున 60 రోజులపాటు 30 టీఎంసీలు ఇవ్వాలని మరోసారి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టమైన నిర్ణయం తీసుకోవడం .పంప్ హౌస్ .టన్నెల్ ఇతర పనులు ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఆదేశించడం ప్రభుత్వ నిబద్ధతను తెలియజేస్తుందన్నారు. ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా పనులు పూర్తయితే చర్లగూడెం ప్రాజెక్ట్ వరకు నీళ్లు వస్తాయని దీంతో జిల్లాలో 3 లక్షల పైగా ఎకరాలకు సాగునీరు వస్తుందని దాంతో పాటు తాగునీరు వస్తుందని పేర్కొన్నారు . ఫ్లోరిన్ ఎక్కువ శాతం ఉన్న ప్రాంతానికి సాగునీరు వస్తేనే శాశ్వతంగా ఫ్లోరోసిస్ మాయమవుతుందన్నారు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఏదుల రిజర్వాయర్ నుండి డిండి ప్రాజెక్టు నీళ్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు . అందుకు కృషి చేసిన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కి జిల్లా మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డికి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి మునుగోడు దేవరకొండ శాసనసభ్యులు రాజగోపాల్ రెడ్డి. బాలు నాయక్ లకు ఐలయ్య యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై కాంగ్రెస్ గురి

- గుండాలలో బీర్ల ఐలయ్య సమక్షంలో సన్నాహక సమావేశం
- అభ్యర్థి గెలుపే లక్ష్యంగా శ్రేణులకు దిశానిర్దేశం

**గుండాల, అక్టోబర్ 23(వెలుతురు):**
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమరానికి సిద్ధమవుతోంది. పార్టీ అభ్యర్థి గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ, పట్టభద్రులను నేరుగా కలిసి మద్దతు కూడగట్టాలని పార్టీ నాయకత్వం దిశానిర్దేశం చేస్తోంది. ఇందులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నల్గొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హాజరై పార్టీ శ్రేణులకు పలు సూచనలు చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీర్ల ఐలయ్య పిలుపునిచ్చారు. పట్టభద్రులను వ్యక్తిగతంగా కలిసి కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు కోరాలని, ప్రచార కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు.

### అనంతరంలో ఇందిరమ్మ ఇంటికి భూమిపూజ





ఎన్నికల సన్నాహక సమావేశం అనంతరం గుండాల మండలంలోని అనంతరం గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి బీర్ల ఐలయ్య భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటి నిర్మాణ పనులకు ముగ్గు పోశారు. అర్హులైన పేదలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు.

### సుద్దాలలో మృతుడి కుటుంబానికి పరామర్శ

అనంతరం సుద్దాల గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన బండ శ్రీశైలం కుటుంబాన్ని బీర్ల ఐలయ్య పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. శ్రీశైలం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

### పలువురు కాంగ్రెస్ నాయకుల హాజరు

ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పొడిచేటి వెంకన్న, జిల్లా ఉపాధ్యక్షుడు ఏలూరు రాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నూనమంతుల విమల వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇమ్మడి దశరథ గుప్తా, వివిధ గ్రామాల సర్పంచులు పెండ్యాల వినోద్ కుమార్, దేవనబోయిన ఐలయ్య, గూడెపు కుమార్, మచ్చ నాగిరెడ్డి, లింగాల అనిల్ కుమార్ గౌడ్, వల్లాల రమేష్, గద్వాల ఉపేందర్, కాలి మంజుల, ఆంజనేయులు, సింగిల్ విండో డైరెక్టర్లు నూనమంతుల యాదయ్య, పొన్నగాని నారాయణ, అన్నెపర్తి యాదగిరితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



## సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

**చౌటుప్పల్ వెలుతురు అక్టోబర్ 23:**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం చౌటుప్పల ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సుని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి స్టేషన్ హౌస్ ఆఫీసర్ జి మన్మథ కుమార్ విచ్చేసి అవగాహన కల్పించారు. సైబర్ నేరాలలో ముఖ్యమైనవి ఫిషింగ్, ఆన్లైన్ మోసాలు, సోషల్ మీడియా మోసాలు, డిజిటల్ మోసాలు, లోన్ యాప్ మోసాలు అదేవిధంగా గుర్తింపు మోసాలు జరుగుతున్నది. కావున తెలియని నెంబర్ ల నుంచి ఫోన్స్ వచ్చిన, వీడియో కాల్స్ వచ్చిన, ఆన్లైన్ లింకులు వచ్చిన, వాటిని ఓ పెన్ చేయకుండా ఉండాలని., మీకు ఇలాంటి మోసాలు తటస్తించినట్లయితే వెంటనే 1930 కు ఫోన్ చేయాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ సైబర్ నేరాల విభాగము పరిశీలిస్తున్న మమత ఉదాహరణలతో నేరాలు జరుగుతున్నా తీరు వివరించారు.
ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు భీమిడి మోహన్ రెడ్డి అధ్యక్షత వహించారు. ప్రధాన కార్యదర్శి కానుగుల వెంకటయ్య స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా సంఘసభ్యులు బాతరాజు ఆగయ్య , కోశాధికారిబడుగు శ్రీరాములు , నారగోని కృష్ణయ్య గౌడ్, బిక్కు నాయక్ , చొల్లేటి రాజయ్య , సీనియర్ సిటిజన్ ప్రధాన కార్యదర్శి గోశిక లక్ష్మయ్య , బొల్లారం లక్ష్మీనారాయణ బొమ్మిడి సత్తిరెడ్డి, సిలివేరు కృష్ణ, కోణం వినోద, గోశిక మురళి , అదేవిధంగా ప్రాంత సీనియర్ సిటిజన్స్ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





## విజయవంతంగా ముగిసిన అమ్మవారి 8వ నవరాత్రి ఉత్సవాలు

**చండూరు వెలుతురు అక్టోబర్ 23:**
శ్రీశ్రీశ్రీ కనకదుర్గ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 8వ వార్షికోత్సవ సందర్భంగా ప్రత్యక్షంగా పరోక్షంగా సహకరించిన దాతలకు స్వాములకు ఇట్టి కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన అమ్మవారి భక్తులకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు. అదేవిధంగా ప్రతిరోజూ అమ్మవారి దగ్గర భజన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన మహిళలకు ప్రత్యేక ధన్యవాదాలు శ్రీ శ్రీ శ్రీ కనకదుర్గ యూత్ అసోసియేషన్ అంగడిపేట (కోటముండల) చండూరు మున్సిపాలిటీ

## నీటి వనరుల పరిరక్షణకు ప్రాధాన్యం



**గుండాల, అక్టోబర్ 23(వెలుతురు):**
వాతావరణ పరిస్థితుల్లో చోటుచేసుకుంటున్న మార్పుల నేపథ్యంలో నీటి వనరుల వినియోగం, వ్యవసాయ ప్రణాళికలపై ముందస్తు అప్రమత్తత అవసరమని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. వర్షపాతం తగ్గే పరిస్థితులు ఏర్పడితే తాగునీరు, సాగునీటి అవసరాలపై ప్రభావం పడే అవకాశం ఉన్నందున ప్రజలు, అధికారులు ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు.
శుక్రవారం గుండాల మండలం పాచిల్ల గ్రామంలో నిర్వహించిన సర్పంచ్ అల్లంశెట్టి మహేష్ అధ్యక్షతన గ్రామసభలో కలెక్టర్ పాల్గొని వాతావరణ మార్పులు, ఎల్‌నినోకు సంబంధించిన పరిస్థితులు, నీటి లభ్యత, వ్యవసాయ రంగంపై పడే ప్రభావం, విద్యుత్ వినియోగం తదితర అంశాలపై గ్రామస్థులతో చర్చించారు.

**"నీటి పొదుపే భవిష్యత్తుకు భరోసా"!**
వర్షాలు ఆశించిన స్థాయిలో కురవని పరిస్థితులు ఎదురైతే తాగునీరు, సాగునీటి సరఫరాపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని కలెక్టర్ వివరించారు. ఇలాంటి పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సూచించారు. ఇళ్లలో, వ్యవసాయ క్షేత్రాల్లో, ప్రజా అవసరాల కోసం వినియోగించే నీటిని వృథా చేయకుండా పొదుపుగా ఉపయోగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**"పంటల ఎంపికలో రైతులు అప్రమత్తంగా ఉండాలి"**
వర్షాభావ పరిస్థితులు వ్యవసాయ రంగంపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున రైతులు పంటల ఎంపిక విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ ప్రణాళికలు రూపొందించుకోవడం అవసరమని పేర్కొన్నారు. విద్యుత్‌ను కూడా అవసరానికి అనుగుణంగా వినియోగిస్తూ వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.

**"ముందస్తు ప్రణాళికతోనే సవాళ్లను ఎదుర్కోవాలి"**
వాతావరణ పరిస్థితులపై నిర్దిష్ట అంచనాలు, అందుబాటులో ఉన్న నీటి వనరుల వివరాలను పరిగణనలోకి తీసుకుని అధికారులు తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవడం కీలకం. నీటి పొదుపుపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందులను తగ్గించుకోవచ్చనే అంశాన్ని గ్రామసభలో ప్రస్తావించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రెడ్డి, చేనేత మరియు జౌళి శాఖ అధికారి శ్రీనివాస్, ఎంపీడీవో, తహసీల్దార్, సంబంధిత అధికారులు, గ్రామ సర్పంచ్ అల్లంశెట్టి మహేష్ ఉపసర్పంచ్ పందుల రమేష్‌వాడు సభ్యులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



## రాజకీయ లబ్ధి కోసమే ఎస్ఐఆర్‌పై అపోహలు

### బీజేపీ మండల అధ్యక్షుడు పెంబల్ల జానయ్య.

**మునుగోడు, అక్టోబర్ 23 (వెలుతురు ):**



ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై కొన్ని రాజకీయ పార్టీలు అనవసరంగా కలవరం సృష్టిస్తున్నాయని బీజేపీ మండల అధ్యక్షుడు పెంబల్ల జానయ్య ఆరోపించారు. రాజకీయ లబ్ధి కోసమే ఈ అంశాన్ని వివాదాస్పదం చేస్తున్నారని విమర్శించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. మృతులు, శాశ్వతంగా వలస వెళ్లినవారు, డూప్లికేట్ నమోదులు తొలగించడం, అర్హులైన ప్రతి పౌరుడి పేరు జాబితాలో ఉండేలా చూడటమే ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశమన్నారు. ఇంటింటి స్థాయిలో బీఎల్‌వోలు వివరాలు సేకరిస్తూ, అభ్యంతరాలు, క్లెయిమ్‌లకు అవకాశం కల్పిస్తున్నారని పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రక్షాళనకు ఎన్నికల సంఘానికి పూర్తి అధికారం ఉందని న్యాయస్థానాలు స్పష్టం చేశాయని జానయ్య తెలిపారు. ప్రక్రియలో తప్పులు జరిగితే వాటిని సరిదిద్దుకునేందుకు తగిన అవకాశాలు ఉన్నాయన్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు ఎస్ఐఆర్‌పై ప్రజల్లో అపోహలు, అయోమయం సృష్టిస్తూ రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. నిష్పక్షపాత ఎన్నికలకు కచ్చితమైన ఓటర్ల జాబితా పునాది అని, అర్హులైన ప్రతి ఓటరుకు న్యాయం జరిగేలా ప్రక్రియను రాజకీయాలకు అతీతంగా నిర్వహించాలని జానయ్య కోరారు.

## మున్సిపాలిటీలో వివిధ వార్డులలో వార్డు సభలు

**మోత్కూర్, అక్టోబర్ 23,వెలుతురు న్యూస్ :**



శుక్రవారం నాడు మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని 1, 2, 7, 8, 9వ వార్డులలో వార్డు సభల కార్యక్రమాలు నిర్వహించారు . ఈ కార్యక్రమాలకు మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం స్వప్న. సోమనర్సయ్య , వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న, మున్సిపల్ కమిషనర్ జి. నర్సయ్య , 2వ వార్డు కౌన్సిలర్ కుర్మిల ప్రమీల , 8వ వార్డు కౌన్సిలర్ పన్నాల శ్రీ విద్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరత ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని, ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని, తాగునీటిని వృథా చేయకుండా అవసరమైన మేరకే ఉపయోగించాలని అధికారులు ప్రజలకు సూచించారు. అదేవిధంగా వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని, వర్షపు నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమాలకు వివిధ వార్డులలో ఆయా వార్డుల ప్రజలు పాల్గొన్నారు

## దాచరంకాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షునిగా ఎడమ శ్రీనివాస్ రెడ్డి



**మోత్కూర్, అక్టోబర్ 23,వెలుతురు న్యూస్.**
కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడంలో భాగంగా, పార్టీ అధిష్ఠానం మరియు సంబంధిత పార్టీ కమిటీ మార్గదర్శకాలకు అనుగుణంగా యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీర్ల అవిలయ్య ఆదేశానుసారం, తుంగతుర్తి శాసనసభ్యులు శ్రీ మందుల సామెలు సూచన మేరకు ఎడమ శ్రీనివాస్ రెడ్డిని గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షునిగా మోత్కూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాచకొండ బాలరాజు గౌడ్ నియమిస్తున్నట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా రాచకొండ బాలరాజు గౌడ్ మాట్లాడుతూ ఎడమ శ్రీనివాస్ రెడ్డిని గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలను సమన్వయం చేస్తూ, పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, పార్టీ సిద్ధాంతాలు, నియమ నిబంధనలు, క్రమశిక్షణకు అనుగుణంగా వ్యవహరిస్తూ, ప్రజలకు మరియు పార్టీకి మధ్య సమన్వయ కర్తగా బాధ్యతలు నిర్వహించాలని కోరారు . ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మెన్ పేలపూడి వెంకటేశ్వర్లు,పట్టణ అధ్యక్షులు బద్దం నాగార్జున రెడ్డి,జిల్లా నాయకులు బొడ్డుపల్లి కళ్యాణ్ చక్రవర్తి,గడ్డం సోమనర్సయ్యా ,బండ విజయ్ రెడ్డి,మార్కెట్ డైరెక్టర్ పన్నాల శ్రీనివాస్ రెడ్డి,పాక్స్ డైరెక్టర్ ఆకుల వెంకటేష్,మాజీ సర్పంచ్ జినుకల మల్లయ్య,మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు పామునుగుల్ల రవి, బొనిగ నరేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, దొంతరబోయిన రవి,ముంత పరిమేష్, కప్పల లింగయ్య, సాదుల అంజయ్య, చిల్లర మల్లేష్, భీమనబోయిన మల్లయ్య, ఆకుల దయాకర్, అండెం రామ్ రెడ్డి, శ్రీరాముల నవీన్, బట్ట మేకల గంగమల్లు, అండం సంతోష్ రెడ్డి, సాదుల సత్తయ్య తదితరులు పాల్గొన్నారు

## కోతుల భయంతో పరుగులు.. బాలుడు మృతి

: కోతుల వెంబడింపు ఓ బాలుడి ప్రాణం తీసింది. కోతుల నుంచి తప్పించుకునేందుకు పరుగులు తీసిన బాలుడు కిందపడి మృతి చెందిన విషాద ఘటన మండలంలోని వల్లాపురంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఈ ఘటన స్థానికంగా స్థానికంగా విషాదాన్ని నింపింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మొక్క వీరబాబు దంపతులు హైదరాబాద్‌లో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు సంతానం. కుమారుడు మొక్క నిశాంత్ గౌడ్(12) దసరా సెలవుల్లో అమ్మమ్మ ఇంటికి వచ్చాడు. కాగా అమ్మమ్మ ఇంటి వద్ద నుంచి స్నేహితుడితో కలిసి అదే గ్రామంలో ఉన్న తమ సొంత ఇంటికి వెళ్తున్న క్రమంలో కోతులు వెంబడించడంతో భయాందోళనకు గురైన నిశాంత్ వాటి నుంచి తప్పించుకునేందుకు పరుగెత్తాడు. ఈ క్రమంలో అదుపుతప్పి కింద పడిపోగా బాలుడి కుడికాలి బొటనవేలుకు గాయమైంది. గమనించిన స్థానికులు వెంటనే నిశాంత్‌ను స్థానిక ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. అయితే ఆర్ఎంపి అందుబాటులో లేకపోవడంతో 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి ఆటోలో ఖమ్మం తీసుకెళ్లేందుకు ఖమ్మం తీసుకెళ్తుండగా మార్గమధ్యలో పెరకసింగారం ప్రాంతంలో 108 ఎదురుగా రావడం వెంటనే బాలుడిని అందులోకి ఎక్కించారు. బాలుడిని పరీక్షించిన వైద్య సిబ్బంది అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించి పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించారు. అయితే అప్పటికే తీవ్ర భయాందోళనకు గురైన బాలుడు గుండె ఆగిపోయి మృతి చెంది ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని నడిగూడెం ఎస్సై తేజస్విని తెలిపారు.

## 'డిండి ఆయకట్టును ఆదుకోండి'..

దేవరకొండ: తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల డిండి రిజర్వాయర్‌లో నీటి నిల్వలు పూర్తిగా అడుగంటిపోయాయని, ఆయకట్టు పరిధిలోని పంటలను కాపాడేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా డిండి రిజర్వాయర్‌కు వెంటనే నీటిని విడుదల చేసి, పంటలు ఎండిపోకుండా రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు.
వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం కారణంగా డిండి ప్రాజెక్టు పరిధిలో నీటి కొరత తీవ్రంగా ఉందని ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సాగునీరు అందక ఆయకట్టు కింద సాగు చేసిన పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయని, ఇప్పటికే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ తరుణంలో నీటి విడుదల ఆలస్యమైతే రైతాంగం కోలుకోలేని విధంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.
రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా డిండి రిజర్వాయర్‌కు అత్యవసర ప్రాతిపదికన నీటిని విడుదల చేసేలా సంబంధిత అధికారులకు తక్షణమే ఆదేశాలు జారీ చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ఎమ్మెల్యే కోరారు. ప్రభుత్వం సత్వర నిర్ణయం తీసుకుని, ఆయకట్టు రైతులకు సాగునీరు అందించి పంట నష్టాన్ని నివారించాలని బాలు నాయక్ విజ్ఞప్తి చేశారు.

## ఛాయా సోమేశ్వరాలయం అభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరు

జిల్లాలోని పానగల్ శ్రీ ఛాయా సోమేశ్వర స్వామి ఆలయం, పరిసర ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 20 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు యువజనాభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ జీవో ఆర్టీ నంబర్ 311ను ఈ నెల 19న జారీ చేసింది. ఆలయంతో పాటు సమీపంలోని జలవనరులు, పరిసర ప్రాంతాలను సుందరీకరించి అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పానగల్‌ను ప్రముఖ వారసత్వ, ఆధ్యాత్మిక, పర్యావరణ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఇంజినీరింగ్ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించి, అభివృద్ధి పనులకు సంబంధించి రూ. 20 కోట్ల అంచనాలు సిద్ధం చేసింది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సమర్పించిన ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం పనులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. తదుపరి చర్యలు చేపట్టాలని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌ను ఆదేశించింది.

## హరీష్‌రావును మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే మాణిక్‌రావు

**దసరా శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు**



**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 23:** విజయదశమి పండుగను పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు హైదరాబాద్‌లోని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే, అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్‌రావు నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరీష్‌రావుకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండప్ప, మాజీ సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, మాజీ ఆత్మ చైర్మన్ పెంటారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ తంజిం, జహీరాబాద్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తట్టు నారాయణ, ఝరాసంగం మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశం, కోహీర్ మండల పార్టీ అధ్యక్షుడు నర్సింలు పాల్గొన్నారు. అలాగే జహీరాబాద్, కోహీర్ పట్టణాలకు చెందిన మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు శంకుస్థాపన

- ముఖ్య అతిథిగా పాల్గొన్న డిఎల్‌పిఓ సురేష్ బాబు
- పాల్గొన్న ఎంపీడీవో శ్రీనివాస్



**కౌడిపల్లి వెలుతురు అక్టోబర్ 23:** కౌడిపల్లి మండల పరిధిలోని పీర్యా తాండ గ్రామపంచాయతీ పరిధిలో ఈరోజు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొరకు ముగ్గు పోసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న డి ఎల్ పి ఓ సురేష్ బాబు మాట్లాడుతూ పేదవాడి ఇంటి నిర్మాణ కళ సాకారం చేసుకోవడానికి ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇల్లు ను ఇల్లు లేని వారు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు వచ్చినవారు అందరూ కూడా సకాలంలో నిర్మాణాలు చేపట్టి తొందరగా గృహప్రవేశాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈ అభిషేక్, గ్రామ సర్పంచ్ నెనావత్ రవళిక రమేష్, ఏపీవో పుణ్యదాస్, పంచాయతీ కార్యదర్శి రత్నం, టి ఏ హర్య, లబ్ధిదారులు అజ్మీర సునీత, మాలోత్ బుజ్జి, గ్రామ పెద్దలు అజ్మీర పెంట్యా, నెనావత్ హరి సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

**నూతన పాలక మండలికి ఎంపీ సురేష్ షెట్కర్, మాజీ మంత్రి డా. ఎ. చంద్రశేఖర్ శుభాకాంక్షలు**



**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 23:** సంగారెడ్డి జిల్లా ఝరాసంగంలోని ప్రసిద్ధ శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి దేవస్థానం నూతన పాలక మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎంపీ సురేష్ షెట్కర్, మాజీ మంత్రి, జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి డా. ఎ. చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ పాటిల్‌తో పాటు పాలక మండలి సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామివారి ఆశీస్సులతో ఆలయ అభివృద్ధి మరింత ముందుకు సాగాలని, ఆధ్యాత్మిక కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తూ భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆకాంక్షించారు. నూతన పాలక మండలి ఆలయ అభివృద్ధికి అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ శంకర్ పాటిల్, హుగ్గెల్లి రాములు, భాస్కర్ రెడ్డి, సువర్ణ--మల్లన్న పాటిల్, పవన్ రాథోడ్, మాజీ మండల అధ్యక్షుడు హన్మంత్ రావు పాటిల్, శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్షద్ అలీ, బడంపేట్ రాచన్న స్వామి ఆలయ కమిటీ చైర్మన్ జగదీష్ స్వామి, కాంగ్రెస్ నాయకుడు ముల్తానీ, ఆలయ కమిటీ సభ్యులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## సహకార సంఘాలు రైతులకు మెరుగైన సేవలు అందించాలి



కథలాపూర్: సహకార సంఘాలు రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ, వారి అభ్యున్నతికి కృషి చేయాలని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం భూషణ్ రావు పేట గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) పాలకమండలి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం చైర్మన్‌గా గడ్డం స్వామి రెడ్డితో పాటు పాలకమండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేపించారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలుపుతూ.. రైతులకు అవసరమైన సహకార సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, సంఘం అభివృద్ధికి పాలకమండలి సభ్యులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సూచించారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా సహకార సంఘాలు పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ పాలకమండలి సభ్యులు,పీసీసీ కార్యవర్గ సభ్యులు తోట్ల అంజయ్య,ఏ ఎం సి చైర్మన్ పుంద్ర నారాయణ రెడ్డి,అధ్యక్షులు వెల్చాల సత్యనారాయణ,కట్ట శంకర్,బైరా దేవా, రెండ్ల లచ్చన్న,జవ్వాజి రవీందర్, వంగ మహేష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపునకు కుట్ర

- ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి
- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి. రాంచందర్ డిమాండ్



**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 23:** ఎస్ఐఆర్ (ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ) పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓటు చోరీకి పాల్పడుతోందని వ్యవసాయ కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బి. రాంచందర్ ఆరోపించారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని, లేదంటే ఆయనను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని, అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించవద్దని కోరుతూ శుక్రవారం జహీరాబాద్‌లో వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిరంకుశ పాలన సాగిస్తోందని విమర్శించారు. రాజ్యాంగబద్ధంగా, నిష్పక్షపాతంగా పనిచేయాల్సిన ఎన్నికల కమిషన్‌ను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తనకు అనుకూలంగా మార్చుకుంటోందని ఆరోపించారు. ఎస్ఐఆర్ పేరుతో ఓటర్ల జాబితా నుంచి అర్హులైన వారి పేర్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లు తొలగించినట్లు లెక్కలు వెలువడ్డాయని పేర్కొన్నారు. ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందని రాంచందర్ అన్నారు. ఓటర్ల హక్కులకు భంగం కలిగించే చర్యలను ప్రజాస్వామ్యవాదులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, డీవైఎఫ్ఐ, ఆవాజ్, కేవీపీఎస్ తదితర ప్రజాసంఘాల నాయకులు ఎస్. మహిపాల్, సలీం, తుల్జారాం, నరేష్, కిరణ్, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఝరాసంగం ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం

**నారాయణఖేడ్ నుంచి ఎన్నికైన బీఎస్‌వీర్ శెట్టికి ప్రత్యేక సన్మానం**



**వెలుతురు నారాయణఖేడ్ అక్టోబర్ 23:** సంగారెడ్డి జిల్లా :- ఝరాసంగంలోని ప్రసిద్ధ శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి దేవస్థాన నూతన పాలక మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్, మాజీ మంత్రి, జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ ఏ. చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన ఆలయ పాలక మండలి చైర్మన్ చంద్రశేఖర్ పాటిల్‌తో పాటు సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి వారి ఆశీస్సులతో ఆలయ అభివృద్ధి మరింత వేగవంతం కావాలని, ఆధ్యాత్మిక కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. అనంతరం నారాయణఖేడ్ నియోజకవర్గం నుంచి ఆలయ పాలక మండలి సభ్యుడిగా ఎన్నికైన బీఎస్ వీర్ శెట్టిని ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్, పీసీసీ సభ్యుడు శంకరయ్య స్వామి ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్ శంకర్ పాటిల్, హుగ్గెల్లి రాములు, భాస్కర్ రెడ్డి, సువర్ణ--మల్లన్న పాటిల్, పవన్ రాథోడ్, మాజీ మండల అధ్యక్షులు హన్మంత్ రావు పాటిల్, శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆర్షద్ అలీ, బడంపేట్ రాచన్న స్వామి ఆలయ కమిటీ చైర్మన్ జగదీష్ స్వామి, కాంగ్రెస్ నాయకులు ముల్తానీ, ఆలయ పాలక మండలి సభ్యులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



## మల్లన్నసాగర్‌ను నింపి.. కూడవెల్లి వాగులో నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించాలి

దుబ్బాక నియోజకవర్గంలో ఉన్న మల్లన్న సాగర్ ప్రాజెక్టు నింపి, కూడవెల్లి వాగులో నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించి రైతుల పంటలను కాపాడాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం దుబ్బాక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో లలిత కుమారి ఆధ్వర్యంలో, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన మండల స్థాయి అధికారుల సమీక్ష సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై వివిధ శాఖల పనితీరును సమీక్షించారు. మండలంలోని పంటల వివరాలపై వ్యవసాయ శాఖ అధికారి ప్రవీణ్‌ను ప్రశ్నించగా, సరైన సమాచారం ఇవ్వకపోవడంపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏఈఓలు సమావేశానికి హాజరుకాకపోవడంపై కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు తమ శాఖలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతుల సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి వనరులను పొదుపుగా వినియోగించాలని, మిషన్ భగీరథ తాగునీరు వృథా కాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గ్రామ కార్యదర్శులు నీటి సరఫరాను పర్యవేక్షిస్తూ లీకేజీలను అరికట్టాలని, ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. నీటి సంరక్షణ, తాగునీటి వృథా నివారణపై సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానాలు చేశారు. రైతులకు సాగునీరు అందించడంతో పాటు ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

## సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

- ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజాసేవ చేయడం ప్రశంసనీయం
- జర్నలిస్టు వృత్తి కత్తిమీద సాములాంటిది
- టీడబ్ల్యూజేఎఫ్ కార్యవర్గ సమావేశంలో గుబ్బపు మచ్చేందర్





**వెలుతురు నారాయణఖేడ్ అక్టోబర్ 23:** సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ పట్టణంలో సమాజంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తున్న జర్నలిస్టుల సేవలు ప్రశంసనీయమని జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు గుబ్బపు మచ్చేందర్ అన్నారు. శుక్రవారం నారాయణఖేడ్ పట్టణంలోని స్వర్ణకార భవనంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) నారాయణఖేడ్ డివిజన్ తొలి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గుబ్బపు మచ్చేందర్ కార్యవర్గ సభ్యులను సత్కరించి, బ్యాగులు పంపిణీ చేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తూ, ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ జర్నలిస్టులు అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. జర్నలిస్టు వృత్తి కత్తిమీద సాములాంటిదని అభివర్ణించారు. సమాజంలో జరిగే అన్యాయాలు, అక్రమాలు, అవినీతి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ధైర్యంగా వెలుగులోకి తీసుకురావడం జర్నలిస్టుల బాధ్యత అన్నారు. ప్రజల గొంతుకగా నిలుస్తూ, పాలకులకు ప్రజల కష్టాలను తెలియజేసి సమస్యల పరిష్కారానికి మార్గం చూపడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు.

ఎండ, వాన, రాత్రింబవళ్లు అనే తేడా లేకుండా ప్రజలకు సమాచారాన్ని అందించేందుకు జర్నలిస్టులు నిరంతరం శ్రమిస్తున్నారని, విధి నిర్వహణలో అనేక ఒత్తిళ్లు, సవాళ్లు ఎదురైనా ప్రజాహితం కోసం పనిచేయడం గొప్ప విషయమని అన్నారు. కొన్ని సందర్భాల్లో ప్రాణాలకు సైతం తెగించి వార్తా సేకరణ చేయడం వారి వృత్తి నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. జర్నలిస్టులు సమాజ అభివృద్ధిలో భాగస్వాములుగా ఉంటూ ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేస్తున్నారని, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని సూచించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ప్లాట్లు, ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన బిల్లులు, ఇతర సంక్షేమ సదుపాయాలు కల్పించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడుతూ, వృత్తిపరమైన హక్కుల సాధనకు కృషి చేయాలని ఆకాంక్షించారు. సమాజానికి మేలు చేసే వార్తలకు ప్రాధాన్యతనిస్తూ, వాస్తవాలను ప్రజల ముందుంచడమే జర్నలిజం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీఎంఆర్ ఫౌండేషన్ బాద్యులు గంగారాం, మారుతి, బస్వరాజ్ పాటిల్, తుకరాం, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మునిగాల మానిక్ ప్రభు, నారాయణఖేడ్ డివిజన్ అధ్యక్షుడు పుట్టి సంజీవ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రతాప్, ప్రధాన కార్యదర్శి యం.ఏ ఖైసర్, కోశాధికారి ఇబ్రహీం, గౌరవ అధ్యక్షుడు వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్‌ను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా




: విద్యార్థులు, యువత భవిష్యత్తును మత్తు పదార్థాలు ఛిద్రం చేయకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా స్పష్టం చేశారు. కరీంనగర్ జిల్లాను డ్రగ్స్, గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ, నిరంతర నిఘా, విస్తృత తనిఖీలు, అవగాహన కార్యక్రమాలతో పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మత్తు పదార్థాల సరఫరా, విక్రయం, వినియోగంపై ఏమాత్రం నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, డీఆర్వో స్వామి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు నమోదైన కేసులు, నిర్వహించిన తనిఖీలు, మత్తు పదార్థాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, బాధితులకు అందిస్తున్న వైద్య సేవలపై కలెక్టర్ సమీక్షించారు.

డ్రగ్స్‌కు అలవాటుపడితే ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా ఆలోచనా శక్తి క్షీణించి, వ్యక్తిగత జీవితం, కుటుంబం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత మత్తు పదార్థాల ఆకర్షణకు లోనుకాకుండా విద్యాసంస్థల స్థాయి నుంచే నిరంతర అవగాహన కల్పించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి మాదకద్రవ్యాల దుష్పరిణామాలను వివరించాలన్నారు. విద్యార్థుల్లో చైతన్యం పెంచేందుకు పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌ల ఏర్పాటు చేస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు సమావేశంలో వివరించారు.

డ్రగ్స్ సరఫరా చేసే వ్యక్తులు, విక్రయదారులు, వినియోగదారులను గుర్తించేందుకు పోలీసులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యాసంస్థలు, మెడికల్ షాపులు, బస్టాండ్ల పరిసరాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి జిల్లాలోకి మత్తు పదార్థాలు చేరకుండా తనిఖీలు ముమ్మరం చేయాలని, అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం సేకరించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

సాధారణ చాక్లెట్ల ముసుగులో గంజాయి చాక్లెట్లను విక్రయించే ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని అధికారులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఇటీవల కరీంనగర్ టవర్ సర్కిల్ వద్ద బీహార్ కార్మికులకు అందించేందుకు తీసుకొచ్చిన 168 గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ స్క్వాడ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాభవాని వివరించారు. ఈ కేసు వివరాలను కలెక్టర్, పోలీస్ కమిషనర్‌కు తెలియజేశారు.

చాక్లెట్ల పేరుతో గంజాయి విక్రయించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ పోలీసు అధికారులను ఆదేశించారు. పిల్లలు, యువతకు తెలియకుండా ఇలాంటి మత్తు పదార్థాలు చేరే ప్రమాదం ఉన్నందున తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా మత్తు పదార్థాల విక్రయాల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు లేదా ఎక్సైజ్ అధికారులకు తెలియజేయాలని అధికారులు కోరారు.

మత్తు పదార్థాలకు బానిసైన వారిని గుర్తించి, వారిని నేరస్థులుగా చూడకుండా అవసరమైన వైద్య చికిత్స, కౌన్సెలింగ్ అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. డ్రగ్స్ అడిక్షన్ సెంటర్లు, పునరావాస కేంద్రాల్లో అందుబాటులో ఉన్న సదుపాయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించడంతో పాటు, ఇప్పటికే వాటికి బానిసైన వారు సాధారణ జీవనంలోకి తిరిగి వచ్చేలా సహకరించాలని సూచించారు. డ్రగ్స్ రహిత కరీంనగర్ లక్ష్యాన్ని సాధించేందుకు పోలీసు, ఎక్సైజ్, విద్యా, వైద్య ఆరోగ్యశాఖలతో పాటు అన్ని ప్రభుత్వ విభాగాలు బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. యువత భవిష్యత్తును కాపాడటమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేసి, మత్తు పదార్థాల నియంత్రణకు చేపట్టిన చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

## రామగుండం ఎన్‌టీపీసీకి జాతీయ భద్రతా పురస్కారం



గోదావరిఖని: పారిశ్రామికంగా కీలకమైన రామగుండం ప్రాంతానికి మరో జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. రామగుండంలోని ఎన్‌టిపిసి తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టుకు ప్రతిష్ఠాత్మక సేఫ్టీ ఇన్నోవేషన్ అవార్డు--2026 దక్కింది. విద్యుత్ ఉత్పత్తి కార్యకలాపాల్లో భద్రతా ప్రమాణాలు, వినూత్న భద్రతా విధానాలు, సురక్షిత పని వాతావరణం కల్పించడంలో సంస్థ చూపుతున్న నిబద్ధతకు ఈ పురస్కారం గుర్తింపుగా నిలిచింది. న్యూఢిల్లీలోని ఇండియా హ్యాబిటాట్ సెంటర్‌లో శుక్రవారం (అక్టోబర్ 23) ఐఈఐ--ఎస్‌క్యూఎఫ్ నిర్వహించిన 23వ అంతర్జాతీయ భద్రతా సదస్సు--2026 లో ఈ అవార్డును ప్రదానం చేశారు. ఎన్‌టిపిసి తెలంగాణ తరపున ఏజీఎం (ఈఎండీ) రజనీష్ చంద్ర సన్యాల్, సీనియర్ మేనేజర్ (సేఫ్టీ) ఎ.వి.ఎన్. రెడ్డి పురస్కారాన్ని అందుకున్నారు. రామగుండం ప్రాంతంలో విద్యుత్ ఉత్పత్తి రంగానికి ఎన్‌టిపిసి కీలక కేంద్రంగా ఉంది. ఇలాంటి భారీ విద్యుత్ ప్రాజెక్టుల్లో ఉద్యోగులు, సాంకేతిక సిబ్బంది భద్రతతో పాటు కార్యకలాపాలను సురక్షితంగా నిర్వహించడం అత్యంత ప్రాధాన్యమైన అంశం. ఈ నేపథ్యంలో ఎన్‌టిపిసి తెలంగాణకు జాతీయ స్థాయిలో లభించిన అవార్డు స్థానిక పారిశ్రామిక రంగానికి ప్రత్యేక గుర్తింపు గా నిలుస్తోంది. భద్రతా ప్రమాణాలను మరింత బలోపేతం చేయడం, వినూత్న పద్ధతులను అమలు చేయడం, ఉద్యోగుల్లో భద్రతా సంస్కృతిని పెంపొందించడం ద్వారా సురక్షితమైన పని వాతావరణాన్ని కొనసాగించేందుకు కృషి చేస్తున్నట్లు సంస్థ పేర్కొంది. "భద్రతే ప్రథమం.. ఎల్లప్పుడూ, ప్రతిచోటా" అనే నినాదానికి అనుగుణంగా పనిచేస్తున్న ఎన్‌టీపీసీ తెలంగాణకు ఈ అవార్డు మరింత ప్రోత్సాహాన్నిస్తుందని అధికారులు తెలిపారు.

## ఆందోల్ అభివృద్ధికి రూ.3 వేల కోట్లకు పైగా నిధులు



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే అలయ్--బలాయ్ వేడుక ఆందోల్ నియోజకవర్గంలో ఘనంగా జరిగింది. విజయదశమి పండుగను పురస్కరించుకుని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో చౌటకూరు మండలం తాడ్దాన్‌పల్లిలోని ఎం.ఎస్. ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పండుగ సంబరాల మధ్య నియోజకవర్గ అభివృద్ధి ప్రగతిని మంత్రి వివరించడంతో పాటు, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పార్టీ నాయకులు, కార్యకర్తలకు తెలియజేశారు.

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆందోల్ నియోజకవర్గంలో సుమారు రూ. 3 వేల కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడించారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని వివరించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రహదారులు, విద్య, వైద్యం, రవాణా రంగాల్లో పలు కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు.

# వారసత్వ సంపదను భావితరాలకు అందించాలి

- సమ్మక్క-సారలమ్మ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ ఉపకులపతి శ్రీనివాస్
- రామప్పలో ప్రారంభమైన ప్రపంచ వారసత్వ స్వచ్ఛంద సేవా శిబిరం




**వెంకటాపూర్, వెలుతురు అక్టోబర్ 23 :** చరిత్ర, సంస్కృతి, వారసత్వ సంపదపై యువత అవగాహన పెంచుకొని, వాటి ప్రాధాన్యాన్ని ఇతరులకు తెలియజేయాలని సమ్మక్క-సారలమ్మ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ ఉపకులపతి శ్రీనివాస్ సూచించారు.తెలంగాణ పర్యాటక శాఖ సౌజన్యంతో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రామప్పలో నిర్వహిస్తున్న ప్రపంచ వారసత్వ స్వచ్ఛంద సేవా శిబిరం-2026 ప్రారంభోత్సవ కార్యక్రమానికి శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా పర్యాటక నోడల్ అధికారి డాక్టర్ ఎ. ధర్మానాయక్ విశిష్ట అతిథిగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో దేశంలోని 10 రాష్ట్రాలకు చెందిన 35 మంది స్వచ్ఛంద సేవకులు ఈ 12 రోజుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొనున్నారు.ఈ సందర్భంగా ఉపకులపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. పర్యాటకం, సంస్కృతి, వారసత్వం, భూగర్భ శాస్త్రం వంటి పలు అంశాలను తెలుసుకునేందుకు ఈ శిబిరం విద్యార్థులకు ఉపయోగపడుతుందని అన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, నేర్చుకున్న విషయాలను ఇతరులతో పంచుకోవాలని సూచించారు.అదేవిధంగా జిల్లా పర్యాటక నోడల్ అధికారి డాక్టర్ ఎ. ధర్మానాయక్ మాట్లాడుతూ.. శిబిరం నిర్వహణకు పర్యాటక శాఖ తరఫున అన్ని విధాలా సహకారం అందిస్తామని, పర్యాటక పోలీసుల ద్వారా భద్రత కల్పిస్తామని పేర్కొన్నారు.రామప్పకు ప్రపంచ వారసత్వ గుర్తింపు లభించినప్పటి నుంచి వరుసగా ఐదో ఏడాది ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ప్రతినిధి ప్రొఫెసర్ పాండురంగారావు, శిబిర సమన్వయకర్త శ్రీధర్ రావు, భారత పురావస్తు సర్వేక్షణ శాఖ పరిరక్షణ సహాయకుడు భార్గవ్, పర్యాటక శాఖ సహాయ పర్యాటక ప్రోత్సాహక అధికారి డాక్టర్ కుసుమ సూర్యకిరణ్, ఆలయ పూజారులు ఉమాశంకర్, హరిశంకర్, పర్యాటక శాఖ సిబ్బంది, పర్యాటక పోలీసులు, దేవస్థానం సిబ్బంది, పర్యాటక మార్గదర్శకులు, వివిధ రాష్ట్రాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# సందీప్‌కు నివాళులర్పించిన మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి




- అంత్యక్రియలలో పాల్గొని పాడె మోసిన మాజీ మార్కెట్ చైర్మన్ నీలం దుర్గేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సమ్మి గౌడ్
- సందీప్ మరణం బాధాకరం



**కేసముద్రం వెలుతురు అక్టోబర్ 23:** మండల పరిధిలోని అర్పణపల్లి గ్రామానికి చెందిన సందీప్ బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడుకక్కడే మృతి చెందగా,సందీప్ భార్య భవాని పరిస్థితి విషమంగా ఉంది..ఖమ్మం హాస్పిటల్ లో చావు బ్రతుకుల మధ్య కొట్లాడుతుంది..సందీప్ మరణం తో గ్రామంలో తీవ్ర శోకసంద్రం అలుముకుంది.?శుక్రవారం నాడు మార్కెట్ చైర్మన్ గంటా సంజీవరెడ్డి సందీప్ నివాసానికి చేరుకుని పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సందీప్ అంత్యక్రియలు నిర్వహించగా... మాజీ మార్కెట్ చైర్మన్ నీలం దుర్గేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మి గౌడ్ హాజరై పాడె మోశారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సానుభూతిని తెలిపి అంత్యక్రియలు పూర్తయ్యేవరకు ఉండి సందీప్ కుటుంబానికి ధైర్యం చెప్పారు .?ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... సందీప్‌కు వివాహమై కేవలం రెండు నెలలే అవుతోందని, దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా ఉప్పరపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. సందీప్ మరణం ఆ కుటుంబానికి తీరని లోటని విచారం వ్యక్తం చేశారు. సందీప్ తక్కువ సమయం లో అందరి దగ్గర మంచి మన్ననలు పొందాడని,తన మరణం మాకు ఎంతోకలంగా కలిసి ఉన్న ఆప్తుడిని కోల్పోయినట్టు ఉందని,పండుగ రోజు మమ్మల్ని కన్నీటి శోకం లో పడేసినట్టు అయ్యిందని విచారణ వ్యక్తం చేశారు ..సందీప్ కుటుంబానికి కాంగ్రెస్ మండల పార్టీ అండగా ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజా వైస్ చైర్మన్ అంబటి మహేందర్ రెడ్డి,మాజీ రాజా చైర్మన్ బండారు వెంకన్న, సర్పంచ్ కుమారస్వామి,చిన్న వెంకన్న, వల్లందాసు రవి, తరాల వీరేష్, కమకుటం శ్రీనివాస్,మాజీ సర్పంచ్ కొండ్రెడ్డి రవీందర్,తండ సంపత్,బిర్రు వెంకన్న,తదితరులు పాల్గొన్నారు...

# ఆందోల్ అభివృద్ధికి రూ.3 వేల కోట్లకుపైగా నిధులు

- అభివృద్ధి పనులను ప్రజలకు వివరించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ
- తడ్డాన్‌పల్లిలో ఘనంగా అలయ్ బలయ్..
- వేలాదిగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు




**ఆందోల్, వెలుతురు అక్టోబర్ 23 :** ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆందోల్ నియోజకవర్గంలో రూ.3 వేల కోట్లకు పైగా నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని చౌటుకూరు మండలం తడ్డాన్‌పల్లిలోని ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో మంత్రి ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి అలయ్ బలయ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు మంత్రి వివరించారు.రోడ్లు, ఆసుపత్రులు, నర్సింగ్ కళాశాల, వసతిగృహాలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల అభివృద్ధితో పాటు వివిధ విద్యాసంస్థల్లో సీఎస్ఆర్ నిధులతో మౌలిక వసతుల కల్పన, కంప్యూటర్ ప్రయోగశాలలు, బస్సుల ఏర్పాటు వంటి పనులను వివరించారు. సంక్షేమ వసతిగృహాల అభివృద్ధి, ఆందోల్ స్టేడియం, ప్రతిష్ఠాత్మక గిరిజన న్యాయ కళాశాల నిర్మాణం, పాఠశాల భవనాలు, అదనపు తరగతి గదుల నిర్మాణం తదితర అంశాలను ప్రస్తావించారు. జోగిపేట--ఆందోల్ పట్టణాల పరిసర ప్రాంతాలను అనుసంధానిస్తూ చేపట్టిన వంతెనలు, సింగూర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ పరిసర గ్రామాల అభివృద్ధికి అంతర్గత రహదారులు, రవాణా, పర్యాటక రంగాల అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్, పీసీసీ సభ్యుడు కిషన్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు జగన్‌మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, లక్ష్మీ శేషారెడ్డి, ఆందోల్--జోగిపేట మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ చిట్టిబాబు, మాజీ చైర్మన్ సురేందర్‌గౌడ్ పాల్గొన్నారు. వివిధ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు పిల్లోడి సతీష్, దిగంబర్‌రావు, శేషారెడ్డి, దుర్గారెడ్డి, గణేష్, కేదారనాథ్, వెంకటేశం, విశ్వాస్, విష్ణువర్ధన్‌రెడ్డి, అశోక్, ఆత్మ కమిటీ చైర్మన్లు కచ్చూరురావు, మల్లారెడ్డి తదితరులు హాజరయ్యారు. అలాగే సర్పంచులు, కౌన్సిలర్లు, సేవాదళ్, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్, కార్మిక సంఘాలు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, మాజీ జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, సహకార సంఘాల మాజీ చైర్మన్లు, డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. అలయ్ బలయ్ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహకు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు.

## జోగి రమేశ్ కోడలు ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు..

**విజయవాడ, వెలుతురు అక్టోబరు 23 :** మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత జోగి రమేశ్ కుటుంబ వివాదం మరో కీలక మలుపు తిరిగింది. తన కుమార్తె మేఘనతో కలిసి ప్రయాణిస్తుండగా జరిగిన కారు ప్రమాదంపై ఆమె తండ్రి కృష్ణ అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం వెనుక జోగి రమేశ్ హస్తం ఉండొచ్చని ఆరోపిస్తూ ఆయన పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.అక్టోబర్ 15న జోగి రమేశ్ కోడలు మేఘన, ఆమె తండ్రి కృష్ణ విజయవాడ నుంచి తెలంగాణలోని కోదాడకు కారులో బయలుదేరారు. ఈ క్రమంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు వీరి కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు పాక్షికంగా దెబ్బతింది. అయితే, ఇది సాధారణ ప్రమాదం కాదని, తమను లక్ష్యంగా చేసుకుని జరిపిన దాడిగా కృష్ణ భావిస్తున్నారు.ఈ మేరకు అక్టోబర్ 16న ఆయన ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమకు ప్రాణహాని ఉందని, ఈ ప్రమాదం వెనుక జోగి రమేశ్ హస్తం ఉండే అవకాశం ఉందని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. బస్సు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు, ఈ ఘటనపై లోతుగా దర్యాప్తు జరపాలని పోలీసులను కోరారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే, ప్రాథమికంగా ఇది ప్రమాదమేనని, ఉద్దేశపూర్వకంగా జరిగినట్లు ఆధారాలు లేవని పోలీసులు తెలిపినట్లు సమాచారం.జోగి రమేశ్ కుటుంబంపై ఆయన కోడలు మేఘన గతంలోనే సంచలన ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. వరకట్న వేధింపులు, గృహహింస, హత్యాయత్నం వంటి తీవ్రమైన ఆరోపణలతో ఈ ఏడాది జులైలో తన భర్త జోగి రాజీవ్, మామ జోగి రమేశ్, అత్త శకుంతల సహా 11 మందిపై ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు ఎఫ్ఐఆర్ (326/2026) నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.2025 మేలో జరిగిన తమ వివాహానికి తన తల్లిదండ్రులు సుమారు రూ.5 కోట్లు ఖర్చు చేశారని, అయినప్పటికీ అదనంగా మరో రూ.5 కోట్లు, కారు, నగలు తీసుకురావాలంటూ వేధించారని మేఘన తన ఫిర్యాదులో ఆరోపించారు. గోవా, ఘట్‌కేసర్ వంటి ప్రాంతాల్లో తనపై హత్యాయత్నాలు కూడా జరిగాయని ఆమె పేర్కొన్నారు. తనకు రక్షణ కల్పించాలని కోరుతూ ఆమె గవర్నర్, మహిళా కమిషన్‌ను కూడా ఆశ్రయించారు.ఈ ఆరోపణలను జోగి రమేశ్ కుటుంబం మొదటి నుంచి ఖండిస్తోంది. ఇదంతా తమపై జరుగుతున్న రాజకీయ కుట్ర అని వారు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం పాత కేసుతో పాటు, ఈ కొత్త ప్రమాదం కేసుపైనా పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# అధికారం కోసం రాజ్యాంగ వ్యవస్థల నిర్వీర్యం

- సర్‌ను వెనక్కి తీసుకోవాల్సిందే.. జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాల్సిందే
- అణచివేసేకొద్దీ యువత పోరాటాలు తీవ్రతరం
- సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు విజయరాఘవన్
- దేశ సమైక్యతకు భంగం కలిగిస్తున్నది కేంద్ర పాలకులే: బీవీ రాఘవులు
- కరువుపై తెలంగాణకు రూ.50 వేల కోట్ల ప్యాకేజీ ప్రకటించాలి: జాన్ వెస్లీ




**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 23 :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక, రాజ్యాంగ విరుద్ధ విధానాలను నిరసిస్తూ విపక్షాలను ఏకం చేసి ప్రజాపోరాటాలను ఉధృతం చేయాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ఎ. విజయ రాఘవన్ పిలుపునిచ్చారు. ప్రజాస్వామిక హక్కులు, ప్రజల జీవనోపాధిని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. శుక్రవారం హైదరా బాద్‌లోని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయంలో పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు టి. జ్యోతితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో మైనార్టీలు, దళితులు, బీసీల మద్దతు కోల్పోయి సంపూర్ణ మెజారిటీని కోల్పోయిన బీజేపీ.. అధికారాన్ని సుస్థిరం చేసుకునేందుకు ఎస్ఐఆర్ పేరుతో దేశవ్యాప్తంగా నిజమైన ఓటర్లను జాబితా నుంచి తొలగించే ప్రయత్నం చేస్తోందని విజయ రాఘవన్ విమర్శించారు. ఓటర్ల పేర్ల తొలగింపు ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే కాకుండా, ప్రభుత్వ పథకాలకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో యువజన, విద్యార్థి సంఘాలు చేస్తున్న శాంతియుత నిరసనలపై దాడులు చేయడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. అణచివేత పెరిగేకొద్దీ యువత పోరాటాలు మరింత తీవ్రతరం అవుతాయని హెచ్చరించారు. నిత్యావసర ధరల పెరుగుదలతో సామాన్యులు ఇబ్బందులు పడుతుంటే, జీడీపీ వృద్ధి పేరుతో కేంద్రం గొప్పలు చెప్పుకుంటోందని విమర్శించారు. వృద్ధి ప్రయోజనాలు కార్పొరేట్ సంస్థలకే దక్కుతున్నాయని, ప్రజల కొనుగోలు శక్తి పడిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పనులను కుదించడం ప్రజల జీవన ప్రమాణాలపై ప్రభావం చూపుతోందన్నారు. ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను ప్రతిపక్షాలపై అక్రమ కేసులు పెట్టేందుకు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. ఢిల్లీ, కోల్‌కతా, ముంబై వంటి నగరాల్లో విపక్షాల భాగస్వామ్యంతో పోరాట కేంద్రాలను ఏర్పాటు చేశామని, కేంద్ర ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను తిప్పికొట్టే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

**దేశ సమైక్యతకు భంగం కలిగిస్తున్నది కేంద్ర పాలకులే: బీవీ రాఘవులు**

దేశ సమైక్యత కోసం కృషి చేయాలని ప్రధాని మోదీ పిలుపునివ్వడం విడ్డూరమని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు విమర్శించారు. డీలిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యాన్ని తగ్గించడం, మణిపూర్‌లో ఘర్షణలు, రాజ్యాంగ వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లేలా చేయడం దేశ సమైక్యతకు ముప్పుగా మారుతున్నాయని అన్నారు. ఎన్నికల సంఘం ప్రధానాధికారి జ్ఞానేశ్‌కు మార్ ఏకపక్ష నిర్ణయాలపై మిగతా ఇద్దరు కమిషనర్లు అభ్యంతరాలు తెలిపిన విషయాన్ని ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా ఓటర్ల పేర్ల తొలగింపు ప్రజాస్వామ్యంపై దాడి అని విమర్శించారు. సుప్రీంకోర్టు ఆదేశాలను పక్కనపెట్టి, నిబంధనలకు విరుద్ధంగా ఓటర్ల నమోదు ప్రక్రియలో మార్పులు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ విధానాలపై ఎన్డీఏ భాగస్వామ్య పార్టీల్లోనూ ఆందోళన ఉందన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రాంతీయ పార్టీలతో సహా అన్ని రాజకీయ శక్తులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ కూడా ఓటర్ల తొలగింపుపై ఉద్యమించాలని కోరారు. ఎన్నికల నిర్వహణలో ఎన్నికల సంఘం విఫలమవుతోందని, ఆంధ్రప్రదేశ్‌లో నామినేషన్ల అడ్డగింతలపై సీపీఐ(ఎం) శ్రేణులు క్షేత్రస్థాయిలో ప్రతిఘటించాయని తెలిపారు.

**కరువు నివారణకు రూ. 50 వేల కోట్ల ప్యాకేజీ ఇవ్వాలి : జాన్ వెస్లీ**

ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో కరువు పరిస్థితులు ఏర్పడుతున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే నష్ట నివారణ చర్యలు చేపట్టాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. కేంద్రం రూ. 50 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని కోరారు. ఆరుతడి పంటలకు గిట్టుబాటు కల్పించడం తో పాటు, ఇప్పటికే సాగు చేసిన పంటలను కాపాడేందుకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. రేషన్ కార్డుపై ఒక్కొక్కరికి 12 కిలోల బియ్యంతో పాటు 14 రకాల నిత్యావసర సరుకులు అందించాలని, ధరలను నియంత్రించాలని కోరారు. ఉపాధి హామీ పనులను 200 రోజులకు పెంచాలని, రైతు భరోసాను రెట్టింపు చేసి రైతు రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో భూ ఆక్రమణలను అరికట్టి సమగ్ర భూ సర్వే చేపట్టాలని, ప్రభుత్వ భూములను గుర్తించి పేదలకు పంచాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. దసరా ఉత్సవాల్లో కుల దురహంకార చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, పేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలు కేటాయించాలని జాన్ వెస్లీ డిమాండ్ చేశారు.

# ప్రియుడి వేధింపులు తట్టుకోలేక సూసైడ్

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 23 :** హైదరాబాద్‌లోని ఉప్పల్ పోలీసు స్టేషన్ పరిధిలో విషాదం చోటుచేసుకుంది. రామంతాపూర్ ఇందిరా నగర్‌కు చెందిన 23 ఏళ్ల గండమల్ల చందన అనే యువతి ప్రియుడి వేధింపులు భరించలేక తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మేడిపల్లిలోని ఒక కంటి ఆసుపత్రిలో పనిచేస్తున్న చందనకు, అదే హాస్పిటల్‌లో పనిచేస్తున్న బొమ్మలరామారానికి చెందిన తుడుము శివ (23) అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారింది. గత ఏడాదిన్నర నుంచి వీరిద్దరూ ప్రేమించుకుంటున్నారు.అయితే గత కొంతకాలంగా వీరిద్దరి మధ్య మనస్పర్ధలు తలెత్తడంతో శివ ఆ యువతిని మానసికంగా, శారీరకంగా హింసించడం ప్రారంభించాడు. ప్రియుడి నుంచి ఎదురవుతున్న వేధింపుల గురించి ఈ నెల 21న చందన తన అక్కతో పంచుకుని తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ప్రేమ పేరుతో జరుగుతున్న వేధింపులు, మనస్తాపం భరించలేక మరుసటి రోజు ఇంట్లో ఎవరూ లేని సమయంలో చందన ఉరివేసుకుని ప్రాణాలు తీసుకోవడంతో విషాదం నెలకొంది.యువతి అకాల మరణంతో ఆమె కుటుంబంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఆత్మహత్యకు దారితీసిన పూర్తి పరిస్థితులపై, నిందితుడు తుడుము శివ పాత్రపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామిక వాడలో'సరాక' రసాయన పరిశ్రమలో ప్రమాదవశాత్తు తీవ్ర విషపూరితమైన క్లోరోఫామ్ గ్యాస్ లీక్ అయింది. దాన్ని పీల్చి ఇద్దరు కార్మికులు ప్రాణాలు కోల్పోగా మరికొందరు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన వారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సుదర్శనరావు (27), బాలాజీ (44)లుగా పోలీసులు గుర్తించారు. క్లోరోఫామ్ ఘాటైన వాసనను పీల్చడంతో అస్వస్థతకు గురైన కార్మికులను గమనించిన తోటి సిబ్బంది వెంటనే స్పందించి చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఘటన పై సమాచారం అందుకున్న జిన్నారం సీఐ నాగార్జునగౌడ్ తమ సిబ్బందితో కలిసి వెంటనే ప్రమాద స్థలానికి చేరుకుని పరిశీలించారు. పరిశ్రమ ప్రాంగణాన్ని పరిశీలించి క్లోరోఫామ్ లీకేజీకి గల కారణాలపై విచారణ చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఈ జంట చాలా కాలంగా ప్రేమలో ఉన్నారు. పెద్దలను ఒప్పించి లేదా స్వయంగా పెళ్లి చేసుకోవాలని నిశ్చయించుకున్న వీరు, హైదరాబాద్‌కు వచ్చి ఉద్యోగం వెతుక్కుని , పెళ్లి ఖర్చుల నిమిత్తం అత్యవసరంగా డబ్బు సమకూర్చుకోవాలని ప్లాన్ చేశారు. అయితే నగరంలో సరైన ఉద్యోగం లభించక పోవడంతో వనస్థలిపురం పరిధిలోని రాజరాజేశ్వరి దేవాలయాన్ని తమ నేరానికి వేదికగా ఎంచుకున్నారు. దేవుడి సన్నిధిలో సేవ చేసుకుంటున్న ఓ వృద్ధురాలిని టార్గెట్ చేసి, ఆమె మెడలోని 3 తులాల బంగారు గొలుసును బలవంతంగా తెంచుకుని పరారయ్యారు. నేరం జరిగిన వెంటనే బాధితురాలి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన వనస్థలిపురం పోలీ సులు, రాచకొండ, మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్ ఉన్నతాధికారుల మార్గదర్శకత్వంలో కేసు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఆలయ పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలను విశ్లేషించి నిందితుల కదలికలను క్షుణ్ణంగా పరిశీలించారు. పక్కా సమాచా రంతో వారు ప్రయాణించిన మార్గాలను ఛేదిస్తూ.. చోరీ జరిగిన కేవలం 24 గంటల వ్యవధిలోనే కమలానగర్ సమీపంలో నిందితులను వలపన్ని అదుపులోకి తీసుకున్నారు.అదుపులోకి తీసుకున్న నిందితుల నుంచి చోరీకి గురైన 3 తులాల బంగారు గొలుసుతో పాటు రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో ఆ జంట విస్తుపోయే నిజాలను వెల్లడించింది.

# బంగాళాఖాతంలో బలపడుతున్న అల్పపీడనం

- తుపానుగా మారే అవకాశం
- ఉత్తరాంధ్ర తీరానికి వాతావరణ హెచ్చరిక
- మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచన



**విశాఖపట్నం, వెలుతురు అక్టోబర్ 23 :** తూర్పుమధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఇది క్రమంగా బలపడి రాగల రోజుల్లో తుపానుగా రూపాంతరం చెందే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతున్న ఈ వాతావరణ వ్యవస్థ సోమవారం నాటికి పశ్చిమమధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా మారి, ఆ తర్వాత ఉత్తరాంధ్ర -- దక్షిణ ఒడిశా తీరాల వైపు కదిలే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో తీర ప్రాంత ప్రజలు, మత్స్యకారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.సముద్రంలో వేటకు వెళ్లిన మత్స్యకారులు వెంటనే తీరానికి తిరిగి రావాలని స్పష్టం చేశారు. తుపాను ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా రానున్న ఐదు రోజుల పాటు పలు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. కోస్తాంధ్ర , రాయలసీమ వ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, కొన్ని ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే ఛాన్స్ ఉంది. ముఖ్యంగా మంగళ, బుధవారాల్లో విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ, పశ్చిమగోదావరి , అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేశారు.గడిచిన కొద్ది గంటల్లో కర్నూలు, నంద్యాల, తిరుపతి, పల్నాడు , ప్రకాశం జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షపాతం నమోదైంది. రైతులు తమ వ్యవసాయ పనుల్లో తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, కోసిన పంటలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులు కోరారు. ప్రజలు అత్యవసర సహాయం లేదా తుపాను సమాచారం కోసం రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థకు చెందిన స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ టోల్ ఫ్రీ నంబర్లు 112, 1070 , 18004250 101 సంప్రదించాలని సూచించారు.

# పారా ఆసియా గేమ్స్‌లో సరికొత్త చరిత్ర

- రికార్డు స్థాయిలో భారత్‌కు పతకాలు

**నగోయా(జపాన్), వెలుతురు అక్టోబర్ 23 :** 2026 ఆసియా పారా గేమ్స్లో భారత పారా అథ్లెట్లు సరికొత్త చరిత్ర సృష్టించారు. ఈ క్రీడల్లో రికార్డు స్థాయిలో మన అథ్లెట్లు 114 పతకాలతో సత్తా చాటారు. ఇందులో 30 పసిడి, 35 రజతం, 49 కాంస్య పతకాలు ఉన్నాయి. ఇక పతకాల పట్టికలో భారత్ నాలుగో స్థానంతో ఈ క్రీడలను ముగించింది. దీంతో పారా ఆసియా క్రీడల హిస్టరీలో భారత్కు అత్యధిక పతకాలు వచ్చిన అత్యుత్తమమైన సీజన్గా ఇది నిలిచింది. 2022తో పోలిస్తే ఈసారి మూడు మెడల్స్ ఎక్కువగా వచ్చాయి. ఈ క్రీడల్లో భారత్కు అథ్లెటిక్స్ (ట్రాక్ అండ్ ఫీల్డ్) విభాగంలోనే అత్యధిక పతకాలు వచ్చాయి. ఈ విభాగంలో మన అథ్లెట్లు తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించారు. జావెలన్ త్రో, క్లబ్ త్రో, డిస్కస్ త్రో లో సత్తా చాటారు. దీంతో ఒక్క అథ్లెటిక్స్ విభాగంలోనే భారత్కు 65 మెడల్స్ వచ్చాయి. ఆ తర్వాత పారా



షూటింగ్, పారా స్విమ్మింగ్, పారా పవర్‌లిఫ్టింగ్లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చారు. ఇక ఓవరాల్గా పతకాల పట్టికలో చైనా అగ్రస్థానంతో ముగించింది. చైనా పారా అథ్లెట్లు మొత్తం 404 మెడల్స్ సాధించారు. ఇందులో 193 గోల్డ్ మెడల్స్ ఉండడం విశేషం. ఆ తర్వాత జపాన్ (171), ఉజ్బె కిస్థాన్ (139) వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి.

### పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య

# ముగిసిన ఎంపీటీసీ నామినేషన్ల పర్వం

- పోటాపోటీగా నామినేషన్లు వేసిన ఎంపీటీసీ అభ్యర్థులు.
- మండల వ్యాప్తంగా 77 నామినేషన్లు దాఖలు

**తుగ్గలి వెలుతురు :** తుగ్గలి మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ మూడవ రోజు పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా ప్రారంభమైంది. నామినేషన్లకు చివరి రోజు అయిన మూడవ రోజున మండల వ్యాప్తంగా మొత్తం 19 మంది అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి శేషయ్య తెలిపారు. ఇందులో తెలుగుదేశం పార్టీ మద్దతుదారులు 05 మంది, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు 10 మంది, ఒక జనసేన అభ్యర్థి, 03 సిపిఐ అభ్యర్థులు ఉన్నారనీ రిటర్నింగ్ అధికారి తెలియజేశారు. ఉదయం నుంచే నామినేషన్ కేంద్రానికి అభ్యర్థులు తమ అనుచరులతో తరలివచ్చి నామినేషన్లు వేశారు. ప్రధాన పార్టీల మద్దతుదారుల మధ్య పోటీ నువ్వా




నేనా అన్నట్లుగా నామినేషన్లు కొనసాగాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. 300 మీటర్ల పరిధిలోపు ఎంపీటీసీ అభ్యర్థులను మరియు బలపరిచే వ్యక్తులను తప్ప ఎవరిని అనుమతించలేదు. నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఎన్నికల నిబంధనల ప్రకారం నామినేషన్లను పరిశీలిస్తామని రిటర్నింగ్ అధికారి శేషయ్య తెలిపారు. నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కర్నూలు అడిషనల్ ఎస్పి కృష్ణమోహన్ అటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పత్తికొండ రూరల్ సీఐ పెద్దయ్య నాయుడు, తుగ్గలి ఎస్సై బాల నరసింహులు, జొన్నగిరి ఎస్సై మల్లికార్జున లు తమ పోలీస్ సిబ్బందితో కలిసి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఓ విశ్వ మోహన్, రవి తదితరులు పాల్గొన్నారు.

### ఎల్‌నినో ప్రభావంపై ముందస్తు చర్యలు తీసుకోవడంలో

# ప్రభుత్వం పూర్తిగా విఫలం

- పొలాలు ఎండిపోయిన రైతులను ఆదుకోవాలి.
- మిగిలిన పంటలను కాపాడాలి.
- ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేపట్టాలి




**కరీంనగర్, వెలుతురు :** రానున్న ఎల్‌నినో ప్రభావాన్ని అంచనా వేయడంలో ప్రజలకు మరియు రైతులకు ముందస్తు జాగ్రత్తలు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ ఈరోజు జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో అన్నారు. గత ఆరు నెలలుగా శాస్త్రవేత్తలు వాతావరణ పరిస్థితులపై హెచ్చరిస్తున్నప్పటికీ ప్రభుత్వం సకాలంలో స్పందించలేదని, ఇప్పుడు నీటిని పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు సూచించడం చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లుగా ఉందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో నీటి కొరత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని, తాగునీటికి ఇబ్బందులు ఏర్పడకుండా ప్రభుత్వం ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణ రూపొందించాలని గతంలో నిపుణులు హెచ్చరిక చేసినప్పటికీ నీటిని వృథా చేయవద్దని ఇప్పుడు ప్రజలకు సూచిస్తుంది. కానీ ప్రభుత్వం గోదావరి జలాలు సముద్రంలో కలవకుండా అవసరమైన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు అని ప్రశ్నించారు. ప్రతిరోజు రెండు టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉన్న అలాంటి చర్యలు చెయ్యకుండా సముద్రం పాలు చేస్తుంది ఈ ప్రభుత్వం. గోదావరి నీటిని సద్వినియోగం చేసుకుని ఉంటే రైతులకు ఎంతో ప్రయోజనం కలిగేదని అన్నారు. అందుబాటులో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు నింపి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదని వారు అన్నారు. తెలంగాణ రక్షణ సేన రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీమతి కల్వకుంట్ల కవితమ్మ హైదరాబాద్ నుంచి వచ్చి కరీంనగర్ సమీపంలోని మొగ్ధంపూర్ గ్రామంలో ఎండిపోయిన పంట పొలాలను పరిశీలించి రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం జరిగిందని. కవితమ్మ క్షేత్రస్థాయికి వెళ్లే వరకు కూడ సంబంధిత శాఖ అధికారి ఎవరు కూడ పంట పొలాల పరిస్థితిని గుర్తించక పోవడం అంటే ప్రభుత్వం తీరు ఏ విధంగా ఉందో తెలుస్తుంది. రైతులు ఇబ్బందులు పడుతుంటే అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదికలు అందించి రైతులకు సకాలంలో సహాయం అందించే దిశగా చర్యలు తీసుకోలేదని వారు అన్నారు. కవితమ్మ పర్యటన అనంతరం అధికారులు ఎండిపోయిన పంట పొలాలకు వెళ్లి పరిస్థితిని అంచనా వేయడం ప్రారంభించారు. జిల్లా స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఎండిపోతున్న పంటలను, రైతుల కష్టాలను పరిశీలించాలి తెలంగాణ రక్షణ సేన కోరుతుంది. ఇప్పటికైనా పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తాగునీటి కొరత ఏర్పడకుండా ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకుని ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తే వారిని అనుసరిస్తూ మండల, గ్రామస్థాయి అధికారులు కూడా అప్రమత్తమై ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారు. ప్రజలు ఇబ్బందులు పడుతుంటే అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చెయ్యాలని వారు కోరారు. కరీంనగర్ జిల్లాలో విషజ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ ఆసుపత్రులలో తగిన సౌకర్యాలు లేకపోవడంతో వలన చాలామంది రోగులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది మందులు అందుబాటులో ఉండాలి. పారిశుద్ధ్యం నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. ఎక్స్‌రే వంటి వైద్య పరీక్షలకు అవసరమైన సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేవు. ప్రభుత్వ ఆసుపత్రులలో శస్త్రచికిత్సలు జరగడం లేవు. గత్యంతరం లేక ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు పోతున్నారు. కరీంనగర్ నగరంలో డంపింగ్ యార్డు సమస్య కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పడుతున్నారు. డంపింగ్ యార్డు నిర్వహణ, పారిశుద్ధ్యం, ప్రజారోగ్యంపై అధికారులు ప్రత్యేకమైన దృష్టి సారించాలి. నగరపాలక సంస్థలో డీజిల్ వినియోగానికి సంబంధించి వచ్చిన ఆరోపణలపై పారదర్శకంగా విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. గుండ్లపల్లి నుంచి పోత్తూరు వరకు రహదారి నిర్మాణం చేపట్టాలన్న ప్రజల డిమాండ్‌ను పరిశీలించాలి. మానకొండూరు నుంచి జమ్మికుంట వరకు రహదారిలో కల్వర్టుల మరమ్మతులు చేపట్టి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలి. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నాణ్యమైన వైద్యం, మెరుగైన విద్య, రైతులకు సాగునీరు వంటి ప్రాథమిక అవసరాలను అందించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. అధికారులు ఎప్పటికప్పుడు ఎల్‌నినో ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి చెబుతున్నాట్లు తాగునీటి కొరత రాకుండా సమగ్ర నీటి నిర్వహణకు ప్రణాళిక రూపొందించాలి. ఎండిపోతున్న పంట పొలాలను తక్షణమే పరిశీలించి నష్టాన్ని అంచనా వేయాలి. నష్టపోయిన అర్హులైన రైతులకు పరిహారం అందించాలని తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ అన్నారు.

# నామినేషన్ కేంద్రాల్లో పటిష్ట చర్యలు

**విశాఖపట్నం, వెలుతురు :** రాయచోటి, అన్నమయ్య జిల్లా పరిధిలోని కలకడ, సంబేపల్లి, ఎల్.ఆర్.పల్లి, రామాపురం, గాలివీడు మండలాల్లో శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి సంబంధిత అధికారులు, పోలీసు అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించి నామినేషన్ల స్వీకరణకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఎంపీటీసీ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నేటితో ముగియనున్న నేపథ్యంలో రామాపురం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్, ఎస్పీ క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. అభ్యర్థులకు అందుబాటులో ఉన్న సదుపాయాలు, నామినేషన్ల స్వీకరణకు చేపట్టిన ఏర్పాట్లు, కేంద్రం వద్ద భద్రతా చర్యలను సమీక్షించారు. నామినేషన్ల స్వీకరణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ నిబంధనల ప్రకారం, పూర్తి పారదర్శకతతో, ప్రశాంత వాతావరణంలో జరిగేలా



అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు కొనసాగించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని పోలీసు సిబ్బందికి సూచించారు. ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు ప్రజలు, అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు అధికారులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు. అన్నమయ్య జిల్లాలో రెండో సాధారణ ఎంపీటీసీ జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి, నామినేషన్లు దాఖలు చేయకుండా ఎవరైనా తమను అడ్డుకున్నట్లు భావించే వ్యక్తులు, తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదులను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ శుక్రవారం కోరారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నేడు జారీ చేసిన ఉత్తర్వుల మేరకు. నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నట్లు ఎవరైనా ఫిర్యాదు చేసినట్లయితే, సంబంధిత అధికారులు ఆ ఫిర్యాదులను పరిశీలించి, ఫిర్యాదుదారులను వెంటనే ఫోన్ ద్వారా సంప్రదించి, నిర్దేశిత గడువు సాయంత్రం 5.00 గంటలలోపు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవసరమైన సహకారం అందించాల్సి ఉంటుందని తెలిపారు. కంట్రోల్ రూమ్ నెంబర్ 08571-293001చేయాలన్నారు.

### ఎన్నికల కమిషనర్

# జ్ఞానేశ్‌కుమార్‌ను వెంటనే తొలగించాలి

**పెద్దపల్లి, వెలుతురు :** భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను వెంటనే తొలగించాలని ఏఐకేఎంఎస్ నాయకులు డిమాండ్ చేశారు. పెద్దపెల్లి జిల్లా ఏఐకేఎంఎస్ కమిటీ ఆధ్వర్యంలో సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కళ్లకు నల్లగుడ్డలతో నిరసన కార్య క్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష,



ఉపాధ్యక్షులు గుండేటి మల్లేశం, మేరుగు చంద్రయ్యలు మాట్లాడుతూ ఓటర్ల జాబితాలోని అక్రమ ఎస్ఐఆర్ కు వ్యతిరేకంగా విద్యార్థులు, యువతులు పోరాటం చేస్తుంటే పోలీసులు, కూటమికి చెందిన నేరపూరిత శక్తులు జరిపిన దాడులకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజా పోరాటాలకు మద్దతుగా శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఎస్ఐఆర్ను తక్షణమే రద్దు చేయాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే తొలగించి, ఆయనపై విచారణ జరపాలని, పారదర్శకత లేకుండా ఓటర్ల జాబితా నుండి తొలగించబడిన13.41 కోట్ల మంది పౌరులందరికీ ఓటు హక్కును పునరుద్ధరించా లని వారు డిమాండ్ చేశారు. అలాగే ఎంపిక ప్యానెల్‌లో క్యాబినెట్ మంత్రి స్థానంలో భారత ప్రధాన న్యాయమూర్తిని నియమించేలా ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామకం పారదర్శకంగా చేపట్టాలన్నారు. యువ విద్యార్థినులతో సహా నిరసనకారులపై జరుగుతున్న క్రూరమైన దాడులు, హింసలను ఖండించాలని, అలాగే దేశంలోని ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించడానికి రైతు- కూలీలు, సాధారణ ప్రజలు క్రియాశీలంగా ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో ఎ.ఐ.కె.ఎం.ఎస్ జిల్లా నాయకులు మేరుగు చంద్రయ్య, గుండేటి మల్లేశం, కె లింగమూర్తి, బోనాల లింగయ్య, యం.డి బాబా, తిర్రి బాలక్రిష్ణ, తూల్ల గట్టయ్య, ఎల్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి

**జయశంకర్ భూపాలపల్లి, వెలుతురు :** ఎల్‌నినో ప్రభావాల వల్ల భవిష్యత్తులో తలెత్తే వాతావరణ మార్పులు, వర్షపాత లోటు, ఉష్ణోగ్రతల పెరుగుదల తదితర పరిస్థితులపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు సమాచార పౌర సంబంధాల శాఖ, భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాష్ట్రస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన జిల్లా పౌర సంబంధాల అధికారులు, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు పాల్గొన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి డీపీఆర్వో శీలం శ్రీనివాస్‌తో పాటు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు హాజరయ్యారు. ఈ అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హాజరై ఎల్‌నినో ప్రభావాలు, వాటిని ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన ముందస్తు జాగ్రత్తలు,



ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకతపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో డీపీఆర్వోల పాత్రతో పాటు, కళాకారుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాల్సిన ప్రాధాన్యతను వివరించారు. కళాజాతాలు, పాటలు, నాటికలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ఎల్‌నినో ప్రభావాలు, నీటి సంరక్షణ, విద్యుత్ పొదుపు, ప్రత్యామ్నాయ పంటల సాగు, తాగునీటి వినియోగంలో జాగ్రత్తలు వంటి అంశాలపై ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుంద రెడ్డి, తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్మన్ డా. జి. వెన్నెల, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. ఏనుగు రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎల్‌నినో ప్రభావాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వ శాఖలతో పాటు ప్రజలు కూడా భాగస్వాములై నీరు, విద్యుత్ పొదుపును దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని, కళాకారుల ద్వారా గ్రామగ్రామాన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని విద్యుత్, మిషన భగీరథ, వ్యవసాయ, పశు సంవర్ధ క శాఖల అధికారులు ఎల్ నినో వల్ల ఆయా రంగాలలో ఏర్పడే విపత్తు ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రజలకు అవగాహన కల్పనపై అవగాహన కల్పించారు.

# ఓట్ల తొలగింపును వెంటనే ఆపాలి

**తాండూర్ వెలుతురు :** ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పేరుతో ఓట్ల తొలగింపును వెంటనే నిలిపివేయాలని, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తాండూర్ మండల కేంద్రంలోని ఐబీ జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారిపై నిర్బంధ చర్యలు నిలిపివేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారాం, వ్యవసాయ కార్మిక సంఘం తాండూర్ మండల అధ్యక్షుడు వేల్పుల శంకర్ మాట్లాడుతూ.. ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ పేరుతో దేశవ్యాప్తంగా 13 కోట్ల మందికి పైగా ఓటర్ల పేర్లను ఏకపక్షంగా తొలగించారంటూ ఆందోళన వ్యక్తం చేశారు.

ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపును తక్షణమే నిలిపివేయాలని, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని వెంటనే రద్దు చేయాలని వారు కోరారు. అర్హులైన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించడం ప్రజాస్వామ్య హక్కులకు భంగం కలిగించే చర్య అని పేర్కొన్నారు. ఓటు హక్కును పరిరక్షించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించే వరకు పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శాంతియు తంగా నిరసన తెలుపుతున్న వారిపై నిర్బంధ చర్యలు తీసుకోవడం సరికాదని, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును గౌరవిం చాలని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సువర్ణ, లీలారాణి, కె. విజయలక్ష్మి, ఎం. విజయలక్ష్మి, రాజేశ్వరి, సుజాత, తిరుమలేశ్వరి, జైనేని లక్ష్మి, కామెర బాబు, మొగిలి, బొల్లం రాజేశం, కె. సూరితో పాటు పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# చిన్న వయసులోనే సేవాభావం..

### రఘునందన్‌ను అభినందించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

### కేసీఆర్ తాతయ్య జన్మదినం సందర్భంగా పదేళ్ల క్రితం పాఠశాల దత్తత

**హైదరాబాద్, వెలుతురు :** చిన్న వయసులోనే సామాజిక బాధ్యతను గుర్తించి, ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మల్లారం గ్రామానికి చెందిన దుగ్గిదేవర రఘునందన్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌ను కలిసిన రఘునందన్.. తన స్వగ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి గత పదేళ్లుగా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

**కేసీఆర్ తాతయ్య జన్మదినం సందర్భంగా పాఠశాల దత్తత**

దాదాపు పదేళ్ల క్రితం కేసీఆర్ తాతయ్య జన్మదినం సందర్భంగా తన స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకొని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు రఘునందన్ తెలిపారు. మహేశ్‌బాబు నటించిన 'శ్రీమంతుడు' సినిమా తనకు స్ఫూర్తినిచ్చిందని, గ్రామానికి, అక్కడి పాఠశాలకు తన వంతుగా ఏదైనా చేయాలనే ఆలోచనతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వివరించారు. తల్లిదండ్రులు అజయ్ కుమార్, విజయలక్ష్మిల సహకారంతో 2016లో ఆరో తరగతి చదువుతున్నప్పుడే మల్లారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి కృషి చేయడం ప్రారంభించారు.

**ప్లాస్టిక్ రహిత పాఠశాలగా తీర్చిదిద్దేలా**

పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన, పరిశుభ్రత, పచ్చదనం, నీటి సంరక్షణకు ప్రాధాన్యమిస్తూ రఘునందన్ పలు కార్యక్రమాలు చేపట్టారు. తాజాగా పాఠశాలలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించేందుకు ప్రత్యామ్నాయ వస్తువులను సమకూర్చారు. ప్రస్తుతం పాఠశాలలో చదువుతున్న 51 మంది విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్లు, మధ్యాహ్న భోజనం కోసం స్టీల్ ప్లేట్లు అందించారు. ప్రతి తరగతి గదిలో తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించేందుకు స్టీల్ డస్ట్‌బిన్లు, చేతులు శుభ్రం చేసుకునేందుకు స్టీల్ సబ్బు పెట్టెలు, పాఠశాల రికార్డుల కోసం స్టీల్ ట్రేలు ఏర్పాటు చేశారు. మరుగుదొడ్లలో అల్యూమినియం బకెట్లు, మగ్గులు, ప్రయోగశాల సామగ్రి నిల్వ చేసేందుకు గాజు సీసాలు సమకూర్చారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలపై అవగాహన కల్పించడమే కాకుండా, విద్యార్థులు చిన్నప్పటి నుంచే పర్యావరణ హిత అలవాట్లను ఆచరించేలా చేయడమే తన లక్ష్యమని రఘునందన్ తెలిపారు. ప్రస్తుతం బెంగళూరులో బీబీఏ చదువుతున్నప్పటికీ, తన స్వగ్రామంలోని పాఠశాల అభివృద్ధి కోసం కృషిని కొనసాగిస్తున్నారు.

**జాతీయ, రాష్ట్ర స్థాయిలో పాఠశాలకు గుర్తింపు**

రఘునందన్ కృషితో మల్లారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల స్వచ్ఛ విద్యాలయ కార్యక్రమంలో పలు అవార్డులు సాధించింది. 2016?17 విద్యా సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ జాతీయ స్థాయి స్వచ్ఛ విద్యాలయ అవార్డుతో పాటు రాష్ట్ర, జిల్లా స్థాయి అవార్డులు అందుకుంది. 2017?18లోనూ రాష్ట్ర, జిల్లా స్థాయిలో గుర్తింపు పొందింది. తాజాగా 2025?26 విద్యా సంవత్సరంలో జిల్లా స్థాయిలో స్వచ్ఛ విద్యాలయ అవార్డును సాధించింది. ప్లాస్టిక్ రహిత పాఠశాలగా రూపుదిద్దుకున్న మల్లారం బడి.. ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తోంది.

# జవహార్ నగర్ డంపింగ్ యార్డ్‌ను తరలించాలి

## రేవంత్ రెడ్డి ఈ ప్రాంతం వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు: ఎంపి ఈటల

**సికింద్రాబాద్, వెలుతురు అక్టోబర్ 23 :**

ప్రపంచంలోనే నాలుగవ అతిపెద్దదైన జవహర్ నగర్ డంపింగ్ యార్డ్‌ను తరలించాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో చేపట్టబోయే నిరసన కార్యక్రమాలపై దమ్మాయిగూడలోని సాయి భవాని ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులుశ్రీ ఈటల రాజేందర్ అధ్యక్షతన సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షతన వహించిన ఎంపీ ఈటల రాజేందర్ హాజరై వారికి, మీడియా మిత్రులకు దిశా నిర్దేశం చేశారు. ముఖ్య అతిథిగా బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ బాధితుల సమస్యపై పత్రికలు, మీడియా సంపూర్ణ మద్దతునివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాంతంలో నివసించేవారంతా అత్యంత పేదరికంలో ఉన్నవారని, కీసర, ఘట్కేసర్, దమ్మాయిగూడ ప్రాంతాల్లో ఇంకా వ్యవసాయం సాగుతోందని గుర్తుచేశారు. సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి మాట్లాడుతూ.. "మీరు ఇక్కడి ఎంపీగా గెలిచారు, కానీ మీరు చూపిస్తున్న పవర్ పాయింట్ ప్రజెంటేషన్ బూటకం" అని మండిపడ్డారు.డంప్ యార్డ్ నుంచి వెలువడుతున్న లీచాట్ (కలుషిత నీరు) కారణంగా చెరువుల్లో చేపలు చచ్చిపోతున్నాయని, గర్భిణీలకు గర్భస్రావాలు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇక్కడ ప్రతిరోజూ 12 మిలియన్ టన్నుల మిథేన్ గ్యాస్ విడుదలవుతోందని, ఇది 12 లక్షల కార్లు విడుదల చేసే కాలుష్యం కంటే ఎక్కువని తెలిపారు. కార్బన్ డై ఆక్సైడ్ కంటే 80 రెట్లు అధిక కాలుష్యం వెలువడటం వల్లే హైదరాబాద్ నగర ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని నిపుణుల రిపోర్టులు చెబుతున్నాయని పేర్కొన్నారు.

తాను ఈ సమస్యను పార్లమెంట్‌లోనూ లేవనెత్తానని, కేంద్రమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ని కలిసినప్పుడు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక రిపోర్ట్‌తో రావాలని సూచించారన్నారు. "నా పుట్టుకే పోరాటం కోసం.. ఇందులో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదు" అని స్పష్టం చేశారు.ప్రశ్నించే గొంతు కనంటూ అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ఈ ప్రాంతం వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని విమర్శించారు. కేవలం ఓట్ల రాజకీయాల కోసం బీఆర్ఎస్ భ్రమపడుతుంటే, ప్రజలు మాత్రం ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న బీజేపీ వైపే మొగ్గు చూపుతున్నారని అన్నారు.

కాంగ్రెస్ హైడ్రా పేరిట పేదల ఇళ్లను కూల్చివేసి, సామాన్లను డోజర్లతో తొక్కించారని ఆరోపించారు. తాము చేసిన పోరాటాల వల్లే ఆ కూల్చివేతలు కొంతమేర ఆగాయని చెప్పారు. మూసీలో కొబ్బరి నీళ్లలాంటి నీళ్లు పారిస్తే తమకేం అభ్యంతరం లేదని, కానీ దానికోసం పేదల ఇళ్లను కూల్చవద్దని అక్కడే పడుకుని అడ్డుకున్నామని గుర్తుచేశారు. 22ఏ తెచ్చి పాత అపార్ట్మెంట్లు నిషేధిత జాబితాలో పెట్టినప్పుడు బిజెపి అసెంబ్లీ బయట మరియు లోపల పోరాటం చేసిందన్నారు.జవహర్ నగర్ డంప్ యార్డ్ వల్ల చుట్టుపక్కల 30 కిలోమీటర్ల పరిధిలోని ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని, గర్భస్రావాలు, క్యాన్సర్లు, శ్వాసకోశ వ్యాధులతో ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద ప్రజలు కాబట్టే అక్కడ నివసిస్తున్నారు. ప్రభుత్వాలు పని చేయాల్సింది ఇలాంటి పెదవారికోసమే అని రేవంత్ రెడ్డి మర్చిపోవద్దు అన్నారు.రాంకీ, అయోధ్య రెడ్డిల ద్వారా వచ్చే సీ.ఎస్.ఆర్ నిధులను ఇక్కడ కాకుండా ఆంధ్రా ప్రాంతానికి ఖర్చు చేయడం సిగ్గుచేటన్నారు.ఈ సమస్య పరిష్కారం కోసం భేషజాలు పక్కనపెట్టి సీఎం రేవంత్ రెడ్డిని స్వయంగా కలిసినా ప్రయోజనం లేకపోయిందని చెప్పారు.

విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, ఐఏఎస్ అధికారి నరహరి కనుగొన్న పరిష్కారాన్ని ఇక్కడ వినియోగించాలని, వాసన మరియు లీచాట్ సమస్య లేని టెక్నాలజీని ఎక్కడి నుంచైనా తీసుకురావాలని డిమాండ్ చేశారు. డబ్బుల కోసం ఆలోచన చేయకండి అని అన్నారు. వైబ్రంట్ హైదరాబాద్ బ్రాండ్ ను పోగొట్టకండి, చెత్తకు శాశ్వత పరిష్కారం అందించమని కోరారు.

ప్రభుత్వానికి చేతకాకపోతే కేంద్ర ప్రభుత్వం ద్వారా చేయిస్తామన్నారు. కేంద్రం సహకారంతో ఇప్పటికే రెండు లక్షల ఇళ్లు, ఫ్లైఓవర్ల నిర్మాణానికి నిధులు ఇక్కడి కేంద్ర మంత్రులు, ఎంపీలం అందరం కలిసి తెచ్చినట్లు గుర్తుచేశారు.



తెలంగాణ పోరాట గడ్డ అని, ఈ ఉద్యమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రీ ఎన్. రామచందర్ రావు పూర్తి మద్దతు ప్రకటించారని తెలిపారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలందరూ కలిసి వస్తారని, ఈ ప్రాంత ప్రజల కోసం ఐక్యంగా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.ఇందులో భాగంగా ఈ నెల 25న రౌండ్ టేబుల్ సమావేశం, 27న భారీ పాదయాత్ర నిర్వహిస్తామని, అవసరమైతే జవహర్ నగర్‌లో సకల జనుల సమ్మె చేపడతామని హెచ్చరించారు.

సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేఎల్పీ నేతశ్రీ ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో పర్యటిస్తున్న రాహుల్ గాంధీకి ఇక్కడి పేదల కష్టాలు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డికి రాహుల్ గాంధీ ఈ సమస్యపై చెప్పడం లేదా అని నిలదీశారు.జవహర్ నగర్ సమస్య పరిష్కారం కోసం ఈటల రాజేందర్‌తో కలిసి తాను కూడా పాదయాత్రలో పాల్గొంటానని స్పష్టం చేశారు.

ఈ సన్నాహక సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి , డా. ఎస్. మల్లారెడ్డి , ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రవి నాయక్ , మేడ్చల్ మల్కాజిగిరి రూరల్ జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్ , అర్బన్ జిల్లా అధ్యక్షులు డి. గిరివర్ధన్ రెడ్డి , రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్ రెడ్డి , మేడ్చల్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే ఏనుగు సుదర్శన్ రెడ్డి , రాష్ట్ర అధికార ప్రతినిధి సుధాకర్ గండే , తదితర ముఖ్య నాయకులు, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్ లు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీశైల దేవస్థానంలో సిఫార్సు లేఖల నిలిపివేత

**ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు**



**శ్రీశైలం, వెలుతురు అక్టోబర్ 23:**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్) నేపథ్యంలో దేవస్థాన యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున, శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివార్ల దేవస్థానంలో వసతి మరియు స్వామి, అమ్మవార్ల దర్శనాలకు సంబంధించి ఎలాంటి సిఫార్సు లేఖలను స్వీకరించబోమని అధికారులు స్పష్టం చేశారు. ప్రోటోకాల్ ప్రముఖులకు మాత్రమే మినహాయింపు, ఎన్నికల నిబంధనల దృష్ట్యా సాధారణ సిఫార్సు లేఖలను పూర్తిగా నిలిపివేసినప్పటికీ, కేవలం ప్రోటోకాల్ పరిధిలోని ప్రముఖులకు మాత్రమే తగురీతిలో వసతి, దర్శన ఏర్పాట్లు కల్పించబడతాయని దేవస్థానం వెల్లడించింది.

## కాంగ్రెస్ చేతగానితనమే..

# కరువుకు కారణం..!

- రేవంత్ పాలనపై హరీశ్‌రావు ధ్వజం
- కరువు నివారణపై శ్వేతపత్రం విడుదల చేయాలి

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 23:**

కరువు వస్తోందని తెలిసినా ముందస్తు చర్యలు తీసుకోకుండా, ఇప్పుడు చేతులెత్తేయడం ప్రభుత్వ వైఫల్యమని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. అసమర్థుడికి అధికారం అప్పగిస్తే ఇల్లు పీకి పందిరి వేసినట్టుగా పాలన ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఎల్‌నినో ప్రభావం గురించి ఆరు నెలలుగా ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం.. ఈ కాలంలో కరువు నివారణకు తీసుకున్న ముందస్తు చర్యలేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇది ప్రకృతి తెచ్చిన కరువు మాత్రమే కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ చేతగానితనం కూడా ప్రస్తుత పరిస్థితులకు కారణమని ఆరోపించారు.

కరువు పరిస్థితులపై ప్రజలకు భరోసా ఇవ్వాల్సిన ముఖ్యమంత్రి.. తాగునీరు కూడా ఉండదంటూ భయాందోళనలకు గురిచేయడం ఏమిటని హరీశ్‌రావు ప్రశ్నించారు. కరువు ఎదుర్కొనేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయడం చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లేనని ఎద్దేవా చేశారు. గోదావరి, కృష్ణా నదుల నుంచి నీటిని ఎందుకు ఎత్తిపోలేదని, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలను ఎందుకు పెంచుకోలేదని నిలదీశారు. బొగ్గు నిల్వలు, విద్యుత్ సంక్షోభంపై తాము హెచ్చరించినా ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. ఎల్‌నినో ప్రపంచ వ్యాప్త సమస్య అయితే పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో



కరువు పరిస్థితులు ఎందుకు భిన్నంగా ఉన్నాయని ప్రశ్నించారు. అక్కడ నీటి లభ్యత ఉండగా, తెలంగాణలో రిజర్వాయర్లు వెలవెలబోవడానికి కారణాలేంటో ప్రభుత్వం వివరించాలని డిమాండ్ చేశారు.

20 వేల మెగావాట్ల విద్యుత్ వినియోగాన్ని గొప్పగా చెప్పుకుంటున్న ప్రభుత్వం.. విద్యుత్ కోతలతో ఎండిపోతున్న పంటలు, ట్యాంకర్లతో నీటిని తెచ్చుకుంటున్న రైతుల ఇబ్బందులపై ఎందుకు స్పందించడం లేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. కరువు పేరుతో సాగునీరు అందించలేమని ముందే చేతులెత్తేయడం పాలనా దక్షత కాదని, రైతులను సంక్షోభంలోకి నెట్టడమేనని విమర్శించారు. బియ్యం ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, వాటిని కూడా తన ఘనతగా చెప్పుకోవడం రేవంత్‌రెడ్డి భావదారిద్ర్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు.

ప్రస్తుత కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ఏం చేసిందో చెప్పకుండా, కరోనా సమయంలో కేసీఆర్ తీసుకున్న చర్యలపై విమర్శలు చేయడం సరికాదన్నారు. కరోనా సమయంలో వ్యాక్సిన్లు అందుబాటులోకి రావడానికి కృషి చేయడంతో పాటు, వలస కూలీలను తెలంగాణ బిడ్డలుగా భావించి కేసీఆర్ ప్రభుత్వం ఆదుకుందని పేర్కొన్నారు. కేసీఆర్‌పై విమర్శలు చేయడానికి చూపిస్తున్న శ్రద్ధలో కొంతైనా రైతులకు, ప్రజలకు నీళ్లు అందించడంపై చూపించాలని హితవు పలికారు. ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తే వ్యక్తిగత దూషణలకు దిగడం, ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపితే రాజకీయ విమర్శలు చేయడం ప్రజాపాలన అనిపించుకోదన్నారు.

కరువు నివారణ చర్యలు చేపట్టలేని రేవంత్‌రెడ్డికి ముఖ్యమంత్రిగా కొనసాగే అర్హత ఎక్కడిదని హరీశ్‌రావు ప్రశ్నించారు. తనను, కేసీఆర్‌ను విమర్శించినంత మాత్రాన ప్రాజెక్టుల్లో నీళ్లు పెరగవని, విద్యుత్ సమస్యలు తీరవని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల వారీగా నీటి నిల్వలు, తాగునీటి అవసరాలు, సాగునీటి పరిస్థితి, కరువు నివారణకు కేటాయించిన నిధుల వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రచార ఆర్భాటాలను పక్కనపెట్టి కరువును ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ ప్రకటించాలని, రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు, పశువులకు పశుగ్రాసం, కూలీలకు ఉపాధి కల్పించాలని కోరారు. నష్టపోయిన రైతులకు పరిహారం అందించడంతో పాటు రైతులకు రైతు బీమా, పంటలకు పంట బీమా పథకాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రకృతి వైపరీత్యాలను రాజకీయాలకు ఉపయోగించుకోవడం కాకుండా ప్రజలకు అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యతని హరీశ్‌రావు స్పష్టం చేశారు.



## దేశంలోనే తొలి 'ఎలక్ట్రిక్ ఫిషింగ్ బోట్'

**కాకినాడ, వెలుతురు అక్టోబర్ 23:**

ఆంధ్రప్రదేశ్‌లోని తీరప్రాంత నగరమైన కాకినాడ వేదికగా భారతీయ మత్స్య రంగంలో ఒక నూతన విప్లవానికి శ్రీకారం చుట్టబోతున్నారు. 'సురాస్ వెంచర్స్ లిమిటెడ్' సంస్థ రూపొందించిన దేశంలోనే తొలి ఎలక్ట్రిక్ చేపల వేట పడవ ప్రయోగాత్మక ప్రారంభోత్సవానికి కాకినాడ సిద్ధమైంది. స్థానిక ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వర రావు (కొండబాబు) చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఈ వినూత్న ప్రాజెక్టు, మత్స్యకారులకు డీజిల్ ఖర్చుల భారాన్ని తగ్గించడమే కాకుండా సముద్రంలో కాలుష్యాన్ని నియంత్రించి హరిత సాంకేతికతను మత్స్య రంగానికి పరిచయం చేసే లక్ష్యంతో ముందుకు వచ్చింది.మాజీ మత్స్యశాఖ అదనపు డైరెక్టర్, కంపెనీ టెక్నికల్ డైరెక్టర్ వి.వి. రావు తెలిపిన వివరాల ప్రకారం, ఈ ఎలక్ట్రిక్ పడవ శక్తివంతమైన బ్యాటరీతో నిరంతరాయంగా ఆరు గంటల పాటు సముద్రంలో ప్రయాణించ గలదు. రోజువారీ వేటకు వెళ్లే స్థానిక మత్స్యకారులకు ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని భావిస్తున్నారు. ఈ ప్రయోగాత్మక ప్రయత్నం విజయవంతమైతే, రాబోయే 24 నెలల్లో భారతదేశ వ్యాప్తంగానే కాకుండా అంతర్జాతీయంగా కూడా తన కార్యకలాపాలను విస్తరించాలని సురాస్ వెంచర్స్ లక్ష్యంగా పెట్టుకుంది. అంతేకాకుండా, కాకినాడను మెరైన్ ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, సర్వీసింగ్ హబ్‌గా తీర్చిదిద్దాలని కంపెనీ భావిస్తోంది. ఎలక్ట్రిక్ బోట్ల వినియోగం వల్ల ఇంధన ఖర్చులు గణనీయంగా తగ్గుతాయని భావిస్తున్నప్పటికీ, వీటి ప్రాక్టికల్ వినియోగం బ్యాటరీ ఛార్జింగ్ వేగం, సముద్ర వాతావరణంపై ఆధారపడి ఉంటుంది. తీరప్రాంతాల్లో చార్జింగ్ పాయింట్లు, షోర్-సైడ్ పవర్ సిస్టమ్స్, సాంకేతిక నిర్వహణ సదుపాయాలు ఏర్పాటు చేయడం ఈ ప్రాజెక్టు విజయానికి అత్యంత కీలకం. ఈ మొదటి ఎలక్ట్రిక్ బోట్ ప్రయోగం విజయవంతమైతే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో ఒప్పందాలు కుదుర్చుకోవడానికి కంపెనీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

## అందుబాటులోకి వందే భారత్ స్లీపర్ వెర్షన్..

**అనంతపురం, వెలుతురు అక్టోబర్ 23:**

దేశీయ రైల్వే రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ సిరీస్‌లో స్లీపర్ వెర్షన్ అందుబాటులోకి వస్తుండటంతో ప్రయాణికుల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది. ఈ ఏడాది జనవరిలో ప్రధాని మోదీ హౌరా-గువహతి మధ్య తొలి వందే భారత్ స్లీపర్ రైలునుప్రారంభించగా, ఇప్పుడు ఏపీ ప్రజలకు కూడా ఈ లగ్జరీ ప్రయాణ సదుపాయం అందుబాటులోకి రానుంది. దసరా పండుగ సందర్భంగా ముంబై, బెంగళూరు నగరాల మధ్య నడిచే ఈ ప్రతిష్టాత్మక రైలు ఏపీ మీదుగా రాకపోకలు సాగించనుండటంతో రాయలసీమ ప్రాంత వాసులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది.బెంగళూరు నుంచి ముంబై మధ్య 1,118 కిలోమీటర్ల దూరాన్ని కవర్ చేసే ఈ రైలు ప్రయాణ సమయాన్ని 20 గంటల నుంచి 16 గంటలకు తగ్గించనుంది. ఏపీలోని ధర్మవరం, అనంతపురం, గుంతకల్ రైల్వే స్టేషన్లలో ఈ రైలుకు స్టాపేజ్ కల్పించారు. దీనివల్ల ఐటీ ఉద్యోగులు, వ్యాపారులు బెంగళూరు, ముంబై నగరాలకు వేగంగా చేరుకోవడానికి వీలు కలుగుతుంది.




ప్రతిపాదిత వేళల ప్రకారం బెంగళూరులో రాత్రి 7.50 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11.55 గంటలకు ముంబై చేరుకుంటుంది.మ్యాప్‌లు చూడండివిమానం తరహాలోనే అంతర్జాతీయ స్థాయి సదుపాయాలు ఈ వందే భారత్ స్లీపర్ రైలు సొంతం. ఇందులో సెన్సార్ ఆటోమేటిక్ డోర్లు, సీసీటీవీ కెమెరాలు, అత్యవసర టాక్ బ్యాక్ సిస్టమ్స్, పవర్ సప్లై కోసం యూఎస్‌బీ ఛార్జింగ్ పాయింట్లు, అధునాతన 'కవచ్' రక్షణ వ్యవస్థ అందుబాటులో ఉన్నాయి. ఈ మార్గంలో టికెట్ ధర సుమారు రూ. 3,000 వరకు ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తుండగా, పూర్తి వివరాలను రైల్వే శాఖ త్వరలోనే అధికారికంగా ప్రకటించనుంది.

# తండ్రి కాబోతున్న గే పీఎం...

**న్యూఢిల్లీ, వెలుతురు అక్టోబర్ 23:**

నెదర్లాండ్స్ రాజకీయాల్లోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా ఓ ఆసక్తికరమైన వార్త చర్చనీయాంశంగా మారింది. ఆ దేశ ప్రధాని రాబ్ జెట్టెన్, ఆయన భాగస్వామి, అర్జెంటీనాకు చెందిన హాకీ క్రీడాకారుడు నికోలస్ కీనన్ తల్లిదండ్రులు కాబోతున్నారు. స్వలింగ సంపర్కులైన ఈ జంట సరోగసీ విధానం ద్వారా బిడ్డను తమ జీవితంలోకి ఆహ్వానించేందుకు సిద్ధమైంది. 2027లో తమ కుటుంబంలోకి చిన్నారి రానున్నట్లు జెట్టెన్ వెల్లడించినట్లు సమాచారం. దీంతో అసలు సరోగసీ అంటే ఏమిటి? ఇద్దరు పురుషులు ఈ విధానం ద్వారా తండ్రులు ఎలా అవుతారు? అనే అంశాలపై ఆసక్తి నెలకొంది.సరోగసీ అనేది సంతానం కోసం మరో మహిళ సహాయాన్ని తీసుకునే వైద్యపరమైన విధానం. కొన్ని కారణాల వల్ల స్వయంగా గర్భం దాల్చలేని వ్యక్తులు లేదా దంపతులు ఈ పద్ధతిని ఆశ్రయిస్తారు. ఇందులో గర్భాన్ని మోసే మహిళను 'సరోగేట్ మదర్' అంటారు. వైద్యపరమైన ప్రక్రియ ద్వారా ఆమె గర్భం దాల్చి, శిశువుకు జన్మనిస్తుంది. ఆ తర్వాత చట్టపరమైన నిబంధనలు, ముందస్తు ఒప్పందాల ప్రకారం బిడ్డ సంరక్షణ బాధ్యతలను ఉద్దేశిత తల్లిదండ్రులు స్వీకరిస్తారు. సాధారణంగా సరోగసీలో రెండు ప్రధాన విధానాలు ఉంటాయి. మొదటిది సంప్రదాయ సరోగసీ. ఇందులో గర్భాన్ని మోసే మహిళ అండం ఉపయోగించబడుతుంది. రెండోది గెస్టేషనల్ సరోగసీ. ఇందులో ఉద్దేశిత తల్లిదండ్రుల్లో ఒకరి లేదా దాత అండం, వీర్యాన్ని ఉపయోగించి ప్రయోగశాలలో పిండాన్ని




తయారు చేస్తారు. అనంతరం ఆ పిండాన్ని సరోగేట్ మహిళ గర్భాశయంలోకి ప్రవేశపెడతారు. ఈ విధానంలో గర్భాన్ని మోసే మహిళకు బిడ్డతో జన్యుపరమైన సంబంధం ఉండకపోవచ్చు.స్వలింగ సంపర్కులైన ఇద్దరు పురుషులు సంతానం పొందాలనుకున్నప్పుడు గెస్టేషనల్ సరోగసీ ఒక మార్గంగా ఉంటుంది. ఇందుకోసం సాధారణంగా అండదాత సహాయం తీసుకుంటారు. వైద్య నిపుణులు ఒక పురుష భాగస్వామి వీర్యంతో దాత అండాన్ని ఫలదీకరణం చేసి పిండాన్ని తయారు చేయవచ్చు. ఆ పిండాన్ని సరోగేట్ మహిళ గర్భాశయంలోకి ప్రవేశపెడతారు. గర్భధారణ సజావుగా సాగితే ఆమె బిడ్డకు జన్మనిస్తుంది.ఈ ప్రక్రియలో బిడ్డకు జన్యుపరంగా ఒక తండ్రితో సంబంధం ఉండవచ్చు. మరో భాగస్వామి తండ్రిగా చట్టపరమైన గుర్తింపు పొందడం మాత్రం సంబంధిత దేశంలోని చట్టాలు, తల్లిదండ్రుల గుర్తింపు విధానాలు, అవసరమైన న్యాయ ప్రక్రియలపై ఆధారపడి ఉంటుంది. అంటే సరోగసీ ద్వారా బిడ్డను పొందడం వైద్యపరమైన ప్రక్రియ మాత్రమే కాదు.. దానికి సంబంధించిన చట్టపరమైన అంశాలను కూడా ముందుగానే పరిశీలించాల్సి ఉంటుంది. జెట్టెన్, కీనన్‌లకు 2024లో నిశ్చితార్థం జరిగింది. అయితే ప్రధాని బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో తమ వివాహ ప్రణాళికల్లో మార్పులు చేసుకున్నట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. ఇప్పుడు తమ జీవితంలోకి కొత్త సభ్యుడు రానుండటంతో ఈ జంట ఆనందంలో మునిగిపోయింది. తమ బిడ్డ 2027లో జన్మించనున్నట్లు ప్రకటిస్తూ, తమకు సహకరించిన అండదాతకు, సరోగేట్ తల్లికి కృతజ్ఞతలు తెలిపారు. గర్భాన్ని మోస్తున్న మహిళ, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని కూడా వెల్లడించారు.

సామాజిక సమానత్వం, వ్యక్తిగత స్వేచ్ఛ విషయంలో నెదర్లాండ్స్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. 2001 ఏప్రిల్ 1న స్వలింగ వివాహాలను చట్టబద్ధం చేసిన ప్రపంచంలోనే తొలి దేశంగా నెదర్లాండ్స్ చరిత్ర సృష్టించింది. ప్రస్తుతం ఇద్దరు పురుషులు లేదా ఇద్దరు మహిళలు చట్టబద్ధంగా వివాహం చేసుకునేందుకు అక్కడ అవకాశం ఉంది.

## ఏపీ సీఎస్ పదవీకాలం ఆరు నెలల పొడిగింపు

**విజయవాడ, వెలుతురు అక్టోబర్ 23:**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ పదవీకాలాన్ని మరో ఆరు నెలల పాటు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనను పరిశీలించిన కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల మంత్రిత్వ శాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్, ట్రైనింగ్ ఈ మేరకు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది.కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం.. సీఎస్ సాయిప్రసాద్ పదవీకాలాన్ని 2026 డిసెంబర్ 1 నుంచి 2027 మే 31 వరకు ఆరు నెలల పాటు పొడిగిస్తూ ఆమోదం తెలిపింది. అఖిల భారత సర్వీసుల నిబంధనలు 1958లోని రూల్ 16(1)కి సడలింపు ఇస్తూ, ఏఐఎస్ రూల్స్ 1960లోని రూల్ 3 ప్రకారం ఈ పొడిగింపును ఖరారు



చేసినట్లు ఆనీఖు అండర్ సెక్రటరీ రాజేష్ కుమార్ యాదవ్ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.ఈ పొడిగింపు కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున సాధారణ పరిపాలన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ 2026 సెప్టెంబర్ 29న రా కేంద్రానికి అధికారికంగా ప్రతిపాదన పంపింది. రాష్ట్రంలో పరిపాలనా స్థిరత్వం, కీలక అభివృద్ధి సంక్షేమ ప్రాజెక్టులు, విధానాల అమలును సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు సీఎస్ అనుభవం ఎంతో అవసరమని ప్రభుత్వం భావించింది.ఈ మేరకు కేంద్రం జారీ చేసిన అధికారిక ఉత్తర్వుల ప్రతులను ప్రధాన మంత్రి కార్యాలయం , ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి , ఏపీ భవన్ ప్రత్యేక ప్రతినిధితో పాటు డీవోపీటీ అంతర్గత విభాగాలకు సమాచారం నిమిత్తం పంపించారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో ఏపీ ఉన్నతాధికార యంత్రాంగంలో మరో ఆరు నెలల పాటు సీఎస్ జి. సాయిప్రసాద్ మార్గదర్శకత్వంలోనే పాలనా ప్రక్రియ కొనసాగనుంది.

# పానగల్ ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరు

- ముఖ్యమంత్రి,మంత్రి జూపల్లికి కృతజ్ఞతలు తెలిపిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- ఆలయ యునెస్కో గుర్తింపు దిశగా కృషి చేస్తా..



**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 23:**

పానగల్‌లోని చారిత్రక ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేయడం పట్ల రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచిన ఛాయా సోమేశ్వరాలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి తెలిపారు. ప్రపంచస్థాయిలో ఎక్కడ లేని విధంగా "వందల ఏళ్ల క్రితమే శిల్పులు కాంతి, నీడ, నిర్మాణ శాస్త్రాన్ని సమన్వయం చేసి శివలింగంపై నిరంతర ఛాయ కనిపించేలా నిర్మించిన ఛాయా సోమేశ్వరాలయం తెలంగాణ శిల్పకళా వైభవానికి, ప్రాచీన నిర్మాణ విజ్ఞానానికి అద్భుత నిదర్శనమన్నారు. ఆలయానికి యునెస్కో గుర్తింపు తీసుకురావడానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో చారిత్రక వారసత్వాన్ని కాపాడటంతో పాటు మరింత పర్యాటక ప్రాధాన్యత తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. మంత్రి చొరవతో ఆలయ అభివృద్ధి నిధులు విడుదల కావటంలో భక్తులు,స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# తెలంగాణ ప్రగతికి టీజీఎస్‌పీఎఫ్ రక్షణ కవచం

- 67ప్రభుత్వ కీలక సంస్థలకు టీజీఎస్‌పీఎఫ్ భద్రత..
- టీజీఎస్‌పీఎఫ్ సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- అమీన్ పూర్‌లో ఘనంగా తెలంగాణ ప్రత్యేక రక్షణ దళం 36వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు





**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 23:**

భద్రతే అభివృద్ధికి పునాది అని, రాష్ట్రంలోని కీలక సంస్థలకు రక్షణ కల్పిస్తున్న తెలంగాణ ప్రత్యేక రక్షణ దళం (టీజీఎస్‌పీఎఫ్) సేవలు తెలంగాణ ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. దళం సిబ్బంది సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధి, శిక్షణ అవకాశాలు, పని పరిస్థితుల మెరుగుదలకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని తెలిపారు.

శుక్రవారం తెలంగాణ ప్రత్యేక రక్షణ దళం 35వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 1991 అక్టోబర్ 23న ఏర్పాటైన ఈ దళం 36 ఏళ్లలో విశిష్ట సంస్థగా ఎదిగిందన్నారు. ప్రస్తుతం తెలంగాణ సచివాలయం, శాసనసభ, హైకోర్టు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు, ప్రధాన దేవాలయాలు, ప్రభుత్వ ఆసుపత్రులు, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, కేంద్ర ప్రభుత్వానికి చెందిన కీలక సంస్థలు సహా మొత్తం 67 ముఖ్యమైన సంస్థలకు భద్రత కల్పిస్తోందని పేర్కొన్నారు. దాదాపు రెండు వేల మంది సిబ్బంది ఈ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తున్నారని చెప్పారు.

టీజీఎస్‌పీఎఫ్ సేవలు కేవలం భవనాలు, సంస్థల రక్షణకే పరిమితం కావని, ప్రభుత్వ వ్యవస్థలు నిరంతరాయంగా పనిచేసేలా చూడటంతోపాటు ప్రజల విశ్వాసాన్ని కాపాడే బాధ్యతను కూడా ఈ దళం నిర్వహిస్తోందని వివరించారు. దళం నినాదమైన 'ప్రగతికి రక్షణ' ఎంతో అర్థవంతమైనదని అన్నారు. పరిశ్రమలు, పెట్టుబడులు, రహదారులు, విద్యుత్ ప్రాజెక్టులు, ఆసుపత్రులు, విద్యాసంస్థల అభివృద్ధికి పటిష్టమైన భద్రత అవసరమని స్పష్టం చేశారు. భద్రత అనేది అభివృద్ధి తర్వాత వచ్చే అంశం కాదని, అభివృద్ధికి ముందస్తు పునాది అని పేర్కొన్నారు.

## విద్యుత్ కేంద్రాలకు కీలక రక్షణ

విద్యుత్ శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న మంత్రిగా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల వద్ద ప్రత్యేక రక్షణ దళం సేవల ప్రాధాన్యం తనకు మరింత స్పష్టంగా తెలుసని ఉప ముఖ్యమంత్రి అన్నారు. యాదాద్రి, కొత్తగూడెం, భద్రాద్రి వంటి విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఎంతో కీలకమని తెలిపారు. అక్కడ ఇంజినీర్లు, కార్మికులు విద్యుత్ ఉత్పత్తి బాధ్యతలు నిర్వహిస్తుంటే, ఆ కేంద్రాలకు భద్రత కల్పిస్తూ ఉత్పత్తి నిరంతరాయంగా సాగేలా టీజీఎస్‌పీఎఫ్ సిబ్బంది తోడ్పడుతున్నారని ప్రశంసించారు. విద్యుత్ వెలుగులు అందరికీ కనిపించినా, వాటిని కాపాడే భద్రతా సిబ్బంది కృషి చాలాసార్లు కనిపించదని, అయితే వారి సేవల విలువ ఎంతో గొప్పదని అన్నారు.

## క్రమశిక్షణ, నిజాయితీనే సంస్థకు బలం

భద్రతా వ్యవస్థ బలాన్ని ఆయుధాలతోనే కొలవలేమని, వాటిని ధరించే సిబ్బంది క్రమశిక్షణ, నిజాయితీ, వివేకం, బాధ్యతాయుత ప్రవర్తనతోనే అంచనా వేయాలని ఉప ముఖ్యమంత్రి అన్నారు. విధులకు అప్పగించిన అధికారాలను బాధ్యతగా వినియోగించడం, ప్రజలతో మర్యాదగా వ్యవహరించడం, అత్యవసర పరిస్థితుల్లో సమయస్ఫూర్తితో స్పందించడం సంస్థ ప్రతిష్ఠను నిర్ణయిస్తాయని చెప్పారు. ప్రజల్లో భయాన్ని కలిగించడం కాకుండా భరోసా కల్పించడమే మంచి భద్రతా వ్యవస్థ లక్షణమని పేర్కొన్నారు.

పండుగలు, సెలవు దినాలు, రాత్రివేళలు, అత్యవసర సమయాల్లోనూ భద్రతా సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. సిబ్బంది బాధ్యతలను అర్థం చేసుకుంటూ వారికి మానసిక బలాన్ని అందిస్తున్న కుటుంబ సభ్యుల త్యాగాలు కూడా ప్రశంసనీయమని అన్నారు. దళం అధికారులు, సిబ్బందితోపాటు వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరఫున ప్రత్యేక అభినందనలు తెలిపారు.




# తెలంగాణలో ఖేలో ఇండియా

- గేమ్స్ నిర్వహణకు పకడ్బందీ కార్యాచరణ
- గ్రామీణ స్థాయి నుంచే ప్రతిభావంతులైన క్రీడాకారుల గుర్తింపు
- డిసెంబర్ 11 నుంచి 22 వరకు పోటీలు
- 27 క్రీడాంశాల్లో ప్రతిభావంతుల ఎంపిక

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 23 :**

తెలంగాణలో డిసెంబర్ 11 నుంచి 22 వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా గేమ్స్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ కార్యాచరణతో ముందుకు సాగుతోందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడిపారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ఖేలో ఇండియా పోటీల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, క్రీడాకారుల ఎంపిక, స్టేడియాల సిద్ధత, శిక్షణ తదితర అంశాలపై శుక్రవారం సచివాలయంలో మంత్రి సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణలో ఖేలో ఇండియా గేమ్స్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. దేశవ్యాప్తంగా వచ్చే క్రీడాకారులు, కోచ్‌లు, ప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

## గ్రామీణ స్థాయి నుంచే క్రీడా ప్రతిభకు ప్రోత్సాహం

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, జాతీయ స్థాయిలో రాణించేలా క్రీడాకారులను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. 27 రకాల క్రీడాంశాల్లో 1:4, 1:2, 1:1 నిష్పత్తుల ఆధారంగా క్రీడాకారులను దశలవారీగా గుర్తించి, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఖేలో ఇండియా పోటీలకు సిద్ధం చేయాలని సూచించారు. క్రీడాకారుల ఎంపికలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతిభ ఆధారంగానే అవకాశాలు కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కేవలం పోటీల నిర్వహణకే పరిమితం కాకుండా, తెలంగాణ క్రీడాకారులు జాతీయ స్థాయిలో పతకాలు సాధించేలా దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు సాగాలని తెలిపారు.

## స్టేడియాల సిద్ధత.. క్రీడాకారులకు పోషకాహారం

ఖేలో ఇండియా పోటీలు నిర్వహించే క్రీడా వేదికలు, స్టేడియాలను గుర్తించి, వాటిలో అవసరమైన మౌలిక సదుపాయాలు, క్రీడా పరికరాలు, ఇతర ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పోటీల నిర్వహణకు సంబంధించి ప్రతి అంశంపై ప్రత్యేక దృష్టి సారించి, అధికారులకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. క్రీడాకారుల శారీరక దృఢత్వం, సామర్థ్యం పెంపొందించేందుకు నాణ్యమైన శిక్షణతోపాటు పోషకాలు సమృద్ధిగా ఉండే ఆహారాన్ని ప్రభుత్వ పరంగా అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. క్రీడాకారులకు అవసరమైన శిక్షణ, వైద్య సహాయం, వసతి, రవాణా వంటి సదుపాయాల కల్పనపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

## దేశానికే ఆదర్శంగా ఖేలో ఇండియా..

తెలంగాణలో నిర్వహించనున్న ఖేలో ఇండియా గేమ్స్ దేశానికే దిక్సూచిగా నిలిచేలా ఏర్పాట్లు ఉండాలని మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్షించారు. క్రీడాకారులకు అత్యుత్తమ వసతులు కల్పిస్తూ, పోటీల నిర్వహణలో ఎక్కడా లోపాలు లేకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని చెప్పారు. ఈ పోటీలు తెలంగాణ క్రీడా రంగానికి కొత్త దిశానిర్దేశం చేయడంతోపాటు రాష్ట్ర యువతలో క్రీడల పట్ల ఆసక్తిని మరింత పెంచేలా ఉండాలని పేర్కొన్నారు. సమీక్షా సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు, తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షుడు ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సోని బాలాదేవి, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి, ప్రవీణ్ కుమార్ మల్లారెడ్డి, డిప్యూటీ డైరెక్టర్లు రవీందర్, రవితేజ, అశోక్, శ్రీనివాస్, ఇంజినీర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# క్లోరోఫామ్ లీకేజీతో ఇద్దరు కార్మికుల మృతి

- సరాకా ల్యాబొరేటరీస్ మూసివేతకు ఆదేశాలు
- యాజమాన్య నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యుల ఆరోపణలు






**సంగారెడ్డి, వెలుతురు అక్టోబర్ 23:**

సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామికవాడలోని సరాకా ల్యాబొరేటరీస్‌లో క్లోరోఫామ్ లీకై ఇద్దరు కార్మికులు మృతి చెందారు. గురువారం రాత్రి 11.30 గంటల సమయంలో ప్రొడక్షన్ బ్లాక్-2లో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. విధుల్లో ఉన్న పంగ సుదర్శన్‌రావు (43), కీలపర్తి బాలాజీ (29) విషవాయువు ప్రభావంతో అపస్మారక స్థితికి చేరుకున్నారు. ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుల్లో సుదర్శన్‌రావు స్వస్థలం శ్రీకాకుళం కాగా, బాలాజీ విజయనగరం జిల్లాకు చెందినవారు. ఇద్దరూ హైదరాబాద్‌లోని చింతల్‌లో నివాసముంటున్నారు. యాజమాన్య నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని మృతుల కుటుంబ సభ్యులు ఆరోపించారు.

## పరిశ్రమ మూసివేతకు ఆదేశాలు

ప్రమాదంపై శుక్రవారం తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పరిశ్రమను తనిఖీ చేశారు. మొదటి అంతస్తులోని రియాక్టర్ నుంచి కింది అంతస్తులోని రిసీవర్‌కు క్లోరోఫామ్ బదిలీ చేస్తుండగా లీకేజీ జరిగినట్లు పరిశ్రమ అధికారులు వివరించారు. ఘటన తీవ్రత దృష్ట్యా ముందస్తు విచారణ అవకాశం ఇవ్వకుండానే పరిశ్రమ మూసివేతకు కాలుష్య నియంత్రణ మండలి ఉత్తర్వులు జారీ చేసింది. విద్యుత్ సరఫరాను నిలిపివేయాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. మరోవైపు ప్రమాదంపై జిన్నారం పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# అసంఘటిత కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డులు

- హమాలీ, డొమెస్టిక్ వర్కర్స్ కోసం త్వరలో ఏర్పాటు
- కార్మికుల హక్కుల పరిరక్షణే ప్రజాస్వామ్యానికి బలం
- పరిశ్రమల అభివృద్ధి-కార్మికుల సంక్షేమం రెండూ ముఖ్యం
- శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి



**హైదరాబాద్, వెలుతురు అక్టోబరు 23 :**

అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించడంతో పాటు వారి హక్కులను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని శక్తి, గనుల శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. హమాలీ, డొమెస్టిక్ వర్కర్స్ కోసం వేర్వేరుగా సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల సంక్షేమానికి చట్టపరమైన చర్యలు చేపట్టామని, ఇందుకు సంబంధించిన నిబంధనలను త్వరలో ప్రకటిస్తామని చెప్పారు.

శుక్రవారం హైదరాబాద్‌లోని లెమన్ ట్రీ హోటల్‌లో "సోషల్ డెమోక్రసీ, పొలిటికల్ లీడర్‌షిప్ అండ్ ట్రేడ్ యూనియన్స్: రీబిల్డింగ్ ది ఆర్కిటెక్చర్ ఆఫ్ సోషల్ డైలాగ్" అనే అంశంపై నిర్వహించిన సదస్సులో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం, కార్మికుల హక్కులను పరిరక్షించడం, భవిష్యత్తులో పని విధానాల్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా కార్మిక రంగాన్ని సిద్ధం చేయడం వంటి అంశాలపై ఈ సదస్సులో చర్చించారు.

దేశంలోని సుమారు 93 శాతం మంది కార్మికులు అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారని మంత్రి తెలిపారు. సంఘటిత రంగ కార్మికులకు ట్రేడ్ యూనియన్ల ద్వారా తమ హక్కులు, డిమాండ్ల సాధన కోసం పోరాడే అవకాశం ఉందని, అసంఘటిత రంగ కార్మికులకు ఆ స్థాయిలో ప్రాతినిధ్యం, రక్షణ లేదని అన్నారు. ఈ రంగంలోని కార్మికుల సమస్యల పరిష్కారానికి మరిన్ని చర్చలు, విధానపరమైన చర్యలు అవసరమన్నారు.

తన తండ్రి గడ్డం వెంకటస్వామి అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపేవారని గుర్తుచేశారు. ప్రైవేటు రంగ ఉద్యోగులకు పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టే సమయంలో పారిశ్రామిక వర్గాల నుంచి వ్యతిరేకత వచ్చినా, కార్మికుల ప్రయోజనాల కోసం ఆయన అండగా నిలిచారని తెలిపారు.

గిగ్ వర్కర్ల హక్కుల పరిరక్షణకు రాహుల్ గాంధీ చేపట్టిన చొరవను మంత్రి ప్రస్తావించారు. రాహుల్ గాంధీ చొరవతోనే తెలంగాణలో గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం చట్టాన్ని తీసుకొచ్చామని, వారి ప్రయోజనాలను పరిరక్షించేందుకు బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సంబంధిత నిబంధనలను త్వరలో ప్రకటిస్తామన్నారు.

హమాలీ కార్మికులు, డొమెస్టిక్ వర్కర్స్ కోసం వేర్వేరు సంక్షేమ బోర్డుల ఏర్పాటుకు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ల హక్కులు, సామాజిక భద్రత, న్యాయమైన వేతనాలు, పని ప్రదేశాల్లో భద్రత వంటి అంశాలకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు.

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్మికుల భద్రతను విస్మరించరాదని మంత్రి అన్నారు. సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో 54 మంది కార్మికులు మరణించిన ఘటనను ప్రస్తావిస్తూ.. ఫ్యాక్టరీల తనిఖీల సందర్భంగా అధికారులు సూచించిన భద్రతా చర్యలను యాజమాన్యాలు తప్పనిసరిగా అమలు చేయాలని చెప్పారు.

తనిఖీ నివేదికలను కంపెనీల బోర్డు సమావేశాల్లో చర్చించి, భద్రతా లోపాలను సరిదిద్దేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమల యాజమాన్యాలు తమ బాధ్యతలను గుర్తించి కార్మికుల ప్రాణాలను కాపాడేందుకు ప్రాధాన్యమివ్వాలని అన్నారు.

రక్షణ, ఏరోస్పేస్ తదితర రంగాల్లో వస్తున్న కొత్త పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కలిగిన యువతను తయారు చేయడమే లక్ష్యమన్నారు. ఐటీఐ విద్యార్థులకు నెలకు రూ.2,000 స్టైపెండ్ అందించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్, మాజీ ఎంపీ ఖుంతియా , తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్‌తో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.



# ఉద్యోగాలు కోల్పోయిన ఆర్టీసీ కార్మికులను ఆదుకుంటాం

**సీఎం ప్రజావాణి స్టేట్ ఇంచార్జ్ గద్వాల్ విజయలక్ష్మి**

**సీఎం ప్రజావాణిలో 103 దరఖాస్తులు**

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 23:**

వివిధ కారణాలతో ఉద్యోగాలు కోల్పోయిన ఆర్టీసీ కార్మికులకు తిరిగి విధుల్లోకి తీసుకునే విషయంలో ఆర్టీసీ ఎండీ, సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్యకు పరిష్కారం చూపించేందుకు చర్యలు తీసుకుంటామని, ఆర్టీసీ కార్మికులకు ఆదుకుంటాం అని సీఎం ప్రజావాణి స్టేట్ ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ గద్వాల్ విజయలక్ష్మి హామీనిచ్చారు.

వివిధ కారణాలతో ఉద్యోగాలు కోల్పోయిన ఆర్టీసీ కార్మికులు పెద్ద ఎత్తున శుక్రవారం జరిగిన సీఎం ప్రజావాణికి వచ్చి గద్వాల్ విజయలక్ష్మి దృష్టికి సమస్యలు వివరించారు. కొంత కాలం క్రితం 317 మంది ఆర్టీసీ కార్మికులకు తిరిగి ఉద్యోగాలు ఇప్పించామని, మిగతా 180 మందికి కూడా ఆదుకునేందుకు ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామని విజయలక్ష్మి పేర్కొన్నారు.

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో శుక్రవారం నిర్వహించిన 263వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో 103 దరఖాస్తులు అందాయి. సీఎం ప్రజావాణి స్టేట్ ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్ పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి దరఖాస్తులు స్వీకరించి ఎండార్స్ మెంట్స్ చేసి సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. రెవెన్యూ శాఖకు 27, బీసీ సంక్షేమ శాఖకు 18, మున్సిపల్ శాఖకు 14, ఇతర శాఖలకు 44 దరఖాస్తులు అందాయి. ఈ ప్రజావాణి కార్యక్రమంలో స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏ.సీ.పీ. ఉమేందర్, ఎన్.ఆర్.ఐ. సలహా మండలి వైస్ చైర్మన్ మంద భీం రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కరువు వేళ గిరిజనులకు 125 రోజుల ఉపాధి

- జాబ్ కార్డులు లేని కుటుంబాలకు కొత్త కార్డులు
- ఆదివాసీ, గిరిజన ప్రాంతాలపై దృష్టి

**హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 23:**

ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఆదివాసీ, గిరిజన ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం అమలుపై దృష్టి సారించింది. జాబ్ కార్డులు లేని అర్హులైన గిరిజన కుటుంబాలకు కొత్త కార్డులు మంజూరు చేయడంతో పాటు, 125 రోజుల ఉపాధి కల్పించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. 18 ఏళ్లు నిండిన కుటుంబ సభ్యులందరి పేర్లను జాబ్ కార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. కరువు వేళ ఉపాధి కల్పించి వలసలను నివారించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టారు.

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో నిర్వహించిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో మంత్రి సీతక్క పాల్గొని కరువు నివారణ చర్యలపై చర్చించారు. ప్రతి జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులకు అత్యవసర ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. రాష్ట్రంలో దాదాపు రూ.7,000 కోట్లతో కరువు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలకు తాగునీరు, రైతులకు అవసరమైన సహాయం అందించడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కల్పించేలా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని జిల్లాల్లో అర్హులకు జాబ్ కార్డుల జారీ, 125 రోజుల ఉపాధి కల్పనపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కమిషనర్ స్పష్టం చేశారు.



Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITOR G BAKKA YADAIAH, R.N.I. TEL TEL/2019/78609. Cell: 91773 87328, Email: velthurunewspaper@gmail.com